ఆదివారం
20•1•2019
కరీంనగర్
• వెల. రూ.8
• సంపుటి 8 • సంచిక 205
• పేజీలు : 16 + 16 + 32 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే, ఎంపీ కల్వకుంట్ల కవిత

యువతే సమాజానికి శక్తి

గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితో ఏదైనా సాధ్యమే

తెలంగాణ అభివృద్ధిలో జాగృతి కృషి భేష్

తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన సదస్సులో అన్నా హజారే

సుస్థిరాభివృద్ధికి యువత కదలాలి

హింస, అకాల మరణాలు వంటి సమస్యలకు అంతం పలకాలి: ఎంపీ కవిత

3

మార్గదర్శిగా రైతుబంధు

- రైతులకు సముద్రంలో దీపస్తంభంలాంటిదీ పథకం
- వ్యవసాయ సంక్షోభాన్ని రూపుమాపడంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరు అభినందనీయం
- సామాజికవేత్త, పద్మభూషణ్ అన్నా హజారే ప్రశంసలు
- లోక్‌పాల్‌పై 30 నుంచి నిరాహారదీక్ష చేపడుతానని ప్రకటన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ ప్రభుత్వం అమలుపరుస్తున్న రైతుబంధు పథకం యావత్ దేశానికి అత్యవసరమని సామాజికవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత అన్నాహజారే చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు తెలంగాణను స్ఫూర్తిగా తీసుకుని ఈ పథకాన్ని అమలుచేయాలని సూచించారు. తెలంగాణ జాగృతి నిర్వహిస్తున్న అంతర్జాతీయ యువ సదస్సుకు వచ్చిన ఆయన శనివారం హైటెక్స్‌లోని నోవాటెల్‌లో మీడియాతో మాట్లాడుతూ రైతుబంధు పథకాన్ని అమలు పరుస్తున్న

మిగతా 11వ పేజీలో

రేపే తొలివిడుత పంచాయతీ పోరు

3,701 గ్రామ పంచాయతీల్లో ముగిసిన ప్రచారం

- బరిలో **12,202** మంది సర్పంచ్ అభ్యర్థులు
- **28,976** వార్డు స్థానాలకు **70,094** మంది అభ్యర్థులు పోటీ
- పోలింగ్‌కు సర్వం సిద్ధం

11

అద్భుత విజయం సాక్షిగా

బంగారు తెలంగాణ

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం

- ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- త్వరలో పింఛన్లు, పంట సాయం పెంపు
- చెప్పినట్టుగానే నిరుద్యోగ భృతి ఇస్తాం
- జాతీయ ఎజెండాగా మారిన రైతుబంధు
- ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్

“ పంటకాలంలో పెట్టుబడి కోసం రైతాంగం అప్పులు చేయాల్సిన అగత్యం ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందింది. ఈ పథకాన్ని ఐక్యరాజ్య సమితి ఎఫ్‌ఏవో ప్రశంసించడం మనందరికీ గర్వకారణం. దేశంలో ఓ ఆదర్శవంతమైన పథకంగా రైతుబంధు మారింది. చాలా రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలుచేయడానికి సిద్ధమయ్యాయి.

\- గవర్నర్ నరసింహన్



శనివారం అసెంబ్లీ ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న రాష్ట్ర గవర్నర్ నరసింహన్

“ ప్రజల బతుకుల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసే బంగారు తెలంగాణ నిర్మాణంకోసం ప్రజలు అందించిన అపూర్వ విజయం పునాదిగా నా ప్రభుత్వం పునరంకితమవుతున్నదని ఉభయసభల సాక్షిగా నిండు విశ్వాసంతో ప్రకటిస్తున్నాను.

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు అందించిన అద్భుత విజయం సాక్షిగా ప్రజల బతుకుల్లో సుఖసంతోషాలు వెల్లివిరిసేలా బంగారు తెలంగాణ నిర్మాణానికి ప్రభుత్వం పునరంకితమవుతుందని రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ ప్రకటించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలను అందుకున్న ప్రజల దీవెనలవల్ల టీఆర్‌ఎస్ చారిత్రాత్మక విజయాన్ని సాధించి రెండోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, రానున్న ఐదేండ్లలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త లక్ష్యాలను, ప్రణాళికలను, పథకాలను నిర్దేశించుకుంటూ పురోగమిస్తుందని చెప్పారు. నీటిపారుదలరంగానికి గడిచిన నాలుగున్నరేండ్లలో రూ.77,777 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందని, రాబోయేకాలంలో రూ.1.17 లక్షల కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపడుతుందని తెలిపారు. 'మిషన్ భగీరథ' పనులు వచ్చే మార్చి నెలాఖరువరకు వందశాతం పూర్తవుతాయన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేస్తున్న ప్రభుత్వానికి, మిషన్ భగీరథ ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువచేసేందుకు విప్లవాత్మక సంస్కరణలను ప్రభుత్వం విజయవంతంగా అమలుచేసిందని, 10 జిల్లాలను 31 జిల్లాలుగా చేసిందని చెప్పారు. కొత్తగా నారాయణపేట, ములుగు జిల్లాలను ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. శాంతిభద్రతలను మరింత పకడ్బందీగా పర్యవేక్షించడానికి కొత్త పోలీసు కమిషనరేట్లను ఏర్పాటుచేసిందని తెలిపారు. తెలంగాణ వచ్చేనాటికి రాష్ట్రంలో కేవలం రెండు పోలీస్ కమిషనరేట్లు ఉండగా.. ప్రభుత్వం కొత్తగా ఏడు కమిషనరేట్లను నెలకొల్పిందన్నారు. కొత్త పోలీసు సబ్‌డివిజన్లను, కొత్త సర్కిళ్లు, కొత్త స్టేషన్లను ఏర్పాటుచేసిందని తెలిపారు. కొత్త శాసనసభ కొలువుదీరిన తర్వాత గవర్నర్ నరసింహన్

మిగతా 2వ పేజీలో

అద్దంలా రహదారులు

అన్ని పంచాయతీలకు బీటీ రోడ్లు • సాగునీటి ప్రాజెక్టుల తర్వాత రోడ్లకే ప్రాధాన్యం • రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు బడ్జెట్ సిద్ధం

రాజకీయాలకు అతీతంగా పనులు జరుగాలి • ఎమ్మెల్యే కార్యాలయాలు త్వరగా పూర్తవ్వాలి • రాష్ట్ర రహదారులపై సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వచ్చే రెండేండ్లలో రాష్ట్రంలోని అన్ని రహదారులను అద్దంలా మార్చాలని అధికారులకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు సూచించారు. కొత్తగా ఏర్పాటైన గ్రామపంచాయతీలతోసహా రాష్ట్రంలోని మొత్తం 12,751 పంచాయతీలకు బీటీ రహదారి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత రహదారులకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని స్పష్టంచేశారు. రాష్ట్రంలో రహదారుల పరిస్థితిపై శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం రహదారుల పరిస్థితి ఎలా ఉంది? వాటిని అద్దంలా తయారుచేయడానికి ఏం చేయాలనే విషయంపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు అవసరమైన బడ్జెట్ కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వెల్లడించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో ఎమ్మెల్యే కార్యాలయాల నిర్మాణాలు చేపట్టామని, వాటిని త్వరగా పూర్తిచేయాలని కోరారు. హైదర్‌గూడలో కొత్తగా నిర్మించిన ఎమ్మెల్యేల నివాస గృహాలను త్వరలో కేటాయించనున్నట్టు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్రం ద్వారా రికార్డుస్థాయిలో జాతీయ రహదారులను సాధించుకున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. రాష్ట్రంలో

మిగతా 2వ పేజీలో



ఫిబ్రవరి మొదటివారంలో
పోడుభూములపై సమావేశం
కాంగ్రెస్ గిరిజన ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్

4

• రుణ భారతం!

మోదీ పాలనలో పెరిగిన అప్పులు

ప్రభుత్వ అప్పుల పెరుగుదల **50%**

రూ.82 లక్షల కోట్లు దాటిన వైనం



నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు పాలనలో భారతావని అప్పుల కుప్పగా మారుతున్నది. గడిచిన నాలుగున్నరేండ్లలో దేశ రుణభారం ఏకంగా 50 శాతం పెరిగిపోయింది. కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ.82 లక్షల కోట్లను దాటిపోయినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. జూన్ 2014 నాటికి రూ.54,90,763 కోట్లుగా ఉన్న రుణాల విలువ.. గతేడాది సెప్టెంబర్ నాటికి రూ.82,03,253 కోట్లకు చేరింది.

9



శనివారం కోల్‌కతాలో ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీలో మాట్లాడుతున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

మోదీపై రణభేరీ

ప్రతిపక్షాల భారీ సభతో జనసంద్రంగా మారిన కోల్‌కతా

బీజేపీ హఠావో.. దేశ్ బచావో అంటూ మమత పిలుపు



సుపరిపాలనకు రోడ్‌మ్యాప్ కావాలి: దేవెగౌడ

మనసులు కలవకున్నా.. చేతులు కలపాలి: ఖర్గే

బీజేపీ మళ్లీ గెలిస్తే దేశం విచ్ఛిన్నమే: కేజ్రీవాల్

ప్రజాధనం లూటీకే మహాకూటమి: ప్రధాని మోదీ

5

జేఈఈలో తెలంగాణ ప్రతిభ

టాప్ 15లో నలుగురు మనరాష్ట్రం వారే

జేఈఈ మెయిన్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశవ్యాప్తంగా ఇటీవల జరిగిన జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-1, పేపర్-1 (బీఈ/బీటెక్) ఫలితాల్లో తెలంగాణ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఉత్తమ మార్కులు సాధించిన మొదటి 15 మందిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు నలుగురు ఉండటం విశేషం. ఈ నెల 8 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జేఈఈ మెయిన్ ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే)శనివారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 100 మార్కులను 15 మంది సాధించగా, వారిలో నలుగురు విద్యార్థులు తెలంగాణకు చెందినవారు ఉండటం మన ప్రతిభకు

మిగతా 4వ పేజీలో



శనివారం ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించేందుకు అసెంబ్లీకి వచ్చిన గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి సాదరంగా ఆహ్వానిస్తున్న శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



అసెంబ్లీహాలులో ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్. చిత్రంలో శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కూడా ఉన్నారు.



శనివారం అసెంబ్లీ ఆవరణలో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు

బంగారు తెలంగాణ

మొదటిపేజీ తరువాయి...

శనివారం తొలిసారిగా ఉభయసభలను ఉద్దేశించి శాసనసభలో ప్రసంగించారు. ఇటీవలి ఎన్నికల్లో విజయం సాధించిన ఎమ్మెల్యేలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి పదవీకాలం దిగ్విజయంగా సాగాలని, అంకితభావంతో ప్రజాసేవలో నిమగ్నం కావాలని ఆకాంక్షించారు.

అన్ని రంగాల్లో పునర్నిర్మాణం

ఆరుదశాబ్దాల సుదీర్ఘపోరాటం తర్వాత సాకారమైన తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు నాయకత్వంలో 2014 జూన్‌లో తొలి ప్రభుత్వం ఏర్పడిందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. తెలంగాణ నిర్లక్ష్యానికి గురై ఉన్న ఆనాటి పరిస్థితుల్లో అవలంబించాల్సిన పంథాను నిర్దేశించుకుని ప్రభుత్వం ప్రయాణాన్ని మొదలుపెట్టి, అన్నిరంగాల్లోనూ పునర్నిర్మాణం ప్రారంభించిందని తెలిపారు. పేదల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చిందని, కోటి ఎకరాలకు సాగునీరందించడానికి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రాధాన్య ప్రాతిపదికన చేపట్టిందని, పరిశ్రమలు, ఐటీరంగ విస్తరణద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి అనేక కార్యక్రమాలు ప్రారంభించిందని వివరించారు. కులవృత్తులను పునరుద్ధరించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే కార్యక్రమాలను చేపట్టిందన్నారు. నిరాశ నిస్పృహలలో కూరుకుపోయిన రైతాంగానికి ధైర్యం, స్థైర్యం కల్పించిందని చెప్పారు.

అవినీతిరహిత పాలన అందించింది

కఠినమైన ఆర్థిక క్రమశిక్షణతో అవినీతిరహిత పాలన అందించడంలో ప్రభుత్వం గొప్ప విజయం సాధించిందని, ఫలితంగా రాష్ట్ర సొంత ఆదాయ వనరులు గణనీయంగా పెరిగాయని గవర్నర్ నరసింహన్ తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రాలకు కూడా సాధ్యపడనిస్థాయిలో 2014 నుంచి 2018 వరకు నాలుగేండ్లలో 17.17% స్థిరమైన ఆర్థికవృద్ధి రేటు సాధించిందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్‌నాటికి 29.93% ఆదాయాభివృద్ధి రేటు సాధించిందని చెప్పారు. జీఎస్టీ వసూళ్లలోనూ అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. గతంలో పింఛన్లు కంటి తుడుపుగా ఇస్తే.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1000 నుంచి 1500 వరకు పెంచిందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పేరిట పేదింటి ఆడపిల్లల పెండ్లిళ్లకు లక్షానూట పద

ఎన్నికల హామీల అమలుకు చర్యలు

ఇటీవలి ఎన్నికలలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వంపై పెద్ద విశ్వాసాన్ని వ్యక్తంచేస్తూ చారిత్రాత్మక తీర్పునిచ్చారని, నాలుగింట మూడొంతుల స్థానాల్లో గెలిపించి తిరిగి అధికారంలోకి తెచ్చారని గవర్నర్ నరసింహన్ అన్నారు. ఈ విజయాన్ని వినమ్రంగా స్వీకరిస్తూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలను ప్రారంభించిందని చెప్పారు. 'ఆసరా పింఛన్లను రూ.1000 నుంచి రూ.2,016కు, దివ్యాంగులకు రూ.1500 నుంచి రూ.3,016కు పెంచాలని నిర్ణయించింది. 57 సంవత్సరాల వయస్సు దాటిన అందరికీ పింఛన్లు అందించబోతున్నది. నిరుద్యోగులకు నెలకు రూ.3,016 భృతి అందించనున్నది. సొంత స్థలం ఉన్న అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నది. ఈ సంవత్సరం నుంచే రైతుబంధు సహాయాన్ని ఎకరానికి ఏడాదికి రూ.8వేల నుంచి రూ.10వేలకు పెంచుతున్నది. రైతు సమన్వయ సమితి సభ్యులకు గౌరవభృతి అందించనున్నది. చట్టసభల్లో బీసీలకు 33%, మహిళలకు 33% రిజర్వేషన్ల కోసం, ఎస్టీలకు 10%, మైనార్టీలకు 12% రిజర్వేషన్ల సాధనకోసం కేంద్రంతో రాజీలేని పోరాటం కొనసాగిస్తున్నది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కోసం భారీ ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాలని ఆలోచిస్తున్నది. ప్రభుత్వం, మహిళా సంఘాలు, ఐకేపీ ఉద్యోగుల సంయుక్త నిర్వహణలో ఈ యూనిట్లు పనిచేస్తాయి. సందర్భోచితంగా ఐకేపీ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది' అని గవర్నర్ వివరించారు. పేదలకు పూర్తి ఉచితంగా డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 2,71,763 ఇండ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. పోలీస్ శాఖను బలోపేతం చేయడంతో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ప్రశాంత జీవనం సాగుతున్నదన్నారు. హైదరాబాద్‌లో త్వరలోనే అంతర్జాతీయస్థాయి పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభం కానున్నదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రం దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు.



శనివారం అసెంబ్లీ హాలులో గవర్నర్ ప్రసంగ పాఠాన్ని చదువుతున్న సీఎం కేసీఆర్, హోంమంత్రి మహమూద్ అలీ, ఇతర సభ్యులు

హార్లు అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. తెలంగాణను మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చడానికి 28 వేల మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం లక్ష్యంగా తలపెట్టిన కొత్త విద్యుత్ ప్లాంట్లు శరవేగంగా నిర్మాణమవుతున్నాయని తెలిపారు. 800 మెగావాట్ల కేటీపీఎస్ ఏడోదశ నిర్మాణాన్ని కేవలం 42 నెలల రికార్డు సమయంలో పూర్తిచేసి, విద్యుత్ ఉత్పత్తి ప్రారంభినట్టు చెప్పారు. 1080 మెగావాట్ల భద్రాద్రి పవర్‌ప్లాంట్‌లో ఈ ఏడాది నుంచే ఉత్పత్తి ప్రారంభమవుతుందని తెలిపారు. సౌరవిద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే రెండోస్థానంలో నిలువడం గర్వకారణమన్నారు. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్రంలో 7,778 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం మాత్రమే ఉండేదని, కానీ ప్రభుత్వ ప్రత్యేక కృషితో నాలుగున్నరేండ్లలోనే 16,503 మెగావాట్ల స్థాపిత విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకటించిన వార్షిక నివేదిక ప్రకారం తలసరి విద్యుత్ వినియోగం వృద్ధిరేటులో దేశంలోనే ప్రథమస్థానంలో తెలంగాణ నిలిచిందని తెలిపారు.

కుట్రలను ఛేదించి కోటి ఎకరాల సాగువైపు

రాష్ట్రంలోని కోటి ఎకరాలకు సాగునీటిని అందించడానికి ప్రభుత్వం భారీ సాగునీటి ప్రాజెక్టులను నిర్మిస్తున్నదని గవర్నర్ నరసింహన్ చెప్పారు. ప్రతిపక్షాల ప్రతీఘాత చర్యలను, రాజకీయ దురుద్దేశంతో వేసిన బూటకపు కేసులను, ఆటంకాలను అకుంఠితదీక్షతో అధిగమించిందన్నారు. అన్ని ప్రాజెక్టులకు అటవీ, పర్యావరణ, పరిపాలనాపర అనుమతులను సాధించిందని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలంచేసే సీతారామ ప్రాజెక్టుకు అటవీ, పర్యావరణ అనుమతులను ఇటీవలే సాధించుకున్నామన్నారు. పాలమూరు–రంగారెడ్డి పథకానికి అన్ని అనుమతులు సాధించడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తున్నదని చెప్పారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు పనులను స్వయంగా పర్యవేక్షించిన కేంద్ర జలసంఘం ప్రభుత్వ కృషిని ప్రశంసించిందన్నారు. ఈ ప్రాజెక్టుద్వారా ఈ ఏడాది వర్షాకాలంలోనే గోదావరి ద్వారా ఎత్తిపోతలను ప్రారంభించడానికి ప్రభుత్వం నిర్మాణ పనులలో వేగం పెంచిందని చెప్పారు. ఇటీవలనే సీఎం కేసీఆర్ స్వయంగా ప్రాజెక్టులను సందర్శించి, నిర్దేశిత సమయంలో పూర్తిచేసి నీరందించడానికి వీలుగా పనులను వేగిరం చేయాలని ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను వచ్చే ఐదేండ్లలో పూర్తిచేయాలని కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉన్నదని చెప్పారు.

గ్రామపంచాయతీలుగా తండాలు

'మా తండాలో మా పాలన' అనే నినాదంతో తండాలు, గూడేలను పంచాయతీలుగా చేయాలని గిరిజనులు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారన్న గవర్నర్.. వారి కలను తెలంగాణ ప్రభుత్వం నిజం చేసిందని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 1326 ఎస్టీ గ్రామపంచాయతీలను ఏర్పాటుచేసిందని, వీటికితోడు 1311 పంచాయతీలు అనుసూచిత ప్రాంతాల్లోనే ఉన్నాయని తెలిపారు. ఇతర గ్రామపంచాయతీల్లోనూ ఎస్టీలకు రిజర్వేషన్‌ను కల్పించిందన్నారు. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో మూడువేల మంది ఎస్టీలు సర్పంచ్‌లుగా అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. దేశంలో ఎస్టీల కోసం ఇంత పెద్దఎత్తున పంచాయతీలను ఏర్పాటుచేసిన ప్రభుత్వం మరొకటి లేదన్న గవర్నర్.. ఇది అభ్యుదయ పంథాలో నడుస్తున్న తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయమని చెప్పారు.

పారిశ్రామికాభివృద్ధిలో అగ్రగామి

టీఎస్‌ఐపాస్ ద్వారా 8,858 పరిశ్రమలకు 15 రోజుల వ్యవధిలోనే అనుమతులు ఇవ్వగా, 5,570 పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయని గవర్నర్ చెప్పారు. 'రూ.1.32 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తరలివచ్చాయి. 8.37 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి. ఖాయిలాపడిన సిర్పూర్ పేపర్ మిల్లును ప్రభుత్వం పునరుద్ధరించింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి' అని తెలిపారు. ఐటీ రంగంలో బలీయమైన శక్తిగా రాష్ట్రం ఎదిగిందని, ప్రపంచంలోనే ప్రముఖ ఐటీ హబ్‌గా హైదరాబాద్ గుర్తింపు పొందిందని చెప్పారు. ఐటీ ఎగుమతులు ఈ ఏడాది లక్ష కోట్ల రూపాయలకు చేరుకున్నాయని పేర్కొన్నారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం

సమైక్య రాష్ట్రంలో ఛిన్నాభిన్నమైన తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కోలుకునే దశలో ఉందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. 'కులవృత్తులపై ఆధారపడే బీసీ కులాలకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహం ఇచ్చి, వారి స్థితిగతులను మార్చాలని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తిరిగి నిలబెట్టాలని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలోనే మరే రాష్ట్రంలోనూ అమలుచేయని గొప్ప కార్యక్రమాలను అమలుచేస్తున్నది. గొల్ల, కుర్మలకు ఇప్పటికే 75 లక్షల గొర్రెలను పంపిణీ చేసింది. పెరిగిన పశుగణంతో వారికి ఇప్పటికే రూ.1200 కోట్లకు పైగా ప్రయోజనం చేకూరింది' అని చెప్పారు. గొర్రెలతోపాటు ఇతర పశువులకు సత్వర వైద్యసేవలు అందించేందుకు 100 సంచార పశు వైద్యశాలలు నడుపుతున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. రాష్ట్రంలోని జలాశయాలన్నింటిలో పెద్ద ఎత్తున చేపపిల్లలు, రొయ్యపిల్లల పెంపకాన్ని ప్రభుత్వం చేపట్టడంతో మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరిగిందని తెలిపారు. చేనేత, మరమగ్గాల కార్మికుల స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి, అనేక కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. 'విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, ఇతర సంస్థల ఉద్యోగులకు యూనిఫారాలు, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పంపిణీ చేసే దుస్తుల కోసం చేనేత, మరమగ్గాల ఉత్పత్తులను స్థానికంగా కొనుగోలు చేస్తున్నది. చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు వరంగల్‌లో మెగా టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నది. సిరిసిల్ల, గద్వాలలో టెక్స్‌టైల్ హబ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదించింది' అన్నారు. నవీన క్షౌరశాలల ఏర్పాటుకోసం నాయీబ్రాహ్మణులకు, ఆధునిక వాషింగ్ మిషన్ల కొనుగోలుకు రజకులకు ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని చెప్పారు. కల్లుగీత కార్మికులను ప్రోత్సహించడానికి తాటిచెట్లపై పన్నును పూర్తిగా రద్దుచేసిందని, ప్రమాదవశాత్తు గీత కార్మికులు మరణిస్తే ఇచ్చే నష్టపరిహారాన్ని రూ.5లక్షలకు పెంచిందని చెప్పారు. వేయి కోట్ల బడ్జెట్‌తో ఎంబీసీ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు.

విద్యారంగంలో ముందడుగు

కేజీ టు పీజీ విద్యావిధానంలో భాగంగా పెద్ద సంఖ్యలో రెసిడెన్షియల్ పాఠశాలలను, కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటుచేసిందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. 'తెలంగాణ ఏర్పాడే నాటికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకోసం కేవలం 296 రెసిడెన్షియల్ స్కూళ్లుండగా.. నా ప్రభుత్వం అన్ని హంగులతో కొత్తగా 542 కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లు నెలకొల్పింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచి 119 గురుకులాలను ప్రారంభించనున్నది. విద్యకోసం విదేశాలకు వెళ్లేవారికి రూ.20 లక్షల ఆర్థికసాయాన్ని అందిస్తున్నది' అని తెలిపారు.

కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు

తెలంగాణ సాధించుకున్న ఫలితం సంపూర్ణంగా సాకారం కావాలంటే స్థానికులకే ఉద్యోగావకాశాలు దక్కాలని గవర్నర్ నరసింహన్ చెప్పారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన స్థానికుల హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటుచేసిందని, లోకల్ క్యాడర్ ఉద్యోగాలలో 95% అవకాశాలు స్థానికులకే దక్కేలా చట్టం చేసిందని తెలిపారు. డిస్ట్రిక్ట్ క్యాడర్‌తోపాటు ఏడు జోన్లు, రెండు మల్టీజోన్లను ఏర్పాటుచేసిందని, కొత్త జోనల్ వ్యవస్థ ప్రకారమే నియామకాలు జరుగుతాయని చెప్పారు.

ప్రజారోగ్య సేవలు అద్భుతం

ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేవలను ప్రభుత్వం గణనీయంగా మెరుగుపరిచిందని గవర్నర్ నరసింహన్ చెప్పారు. '40 ప్రభుత్వ దవాఖానల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్, డిజిటల్ రేడియాలజీ, 2డీ ఎకో తదితర అత్యాధునిక వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చింది. హైదరాబాద్‌లో ఇప్పటికే 40 బస్తీ దవాఖానల్లో వైద్యసేవలను అందిస్తున్నది. సిద్దిపేట, మహబూబ్‌నగర్ వైద్యకళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. సూర్యాపేట, నల్లగొండలో వచ్చే ఏడాది నుంచి ప్రారంభమవుతాయి' అని తెలిపారు. దవాఖానలో మరణించినవారి మృతదేహాలను ఉచితంగా తరలించడానికి దేశంలో ఎక్కడా లేనివిధంగా పరమపద వాహనాలను ప్రవేశపెట్టిందన్నారు. పేద గర్భిణులకు రూ.12వేలు చెల్లిస్తున్నదని, ఆడపిల్లను ప్రసవిస్తే అదనంగా మరో వేయి రూపాయలు ఇస్తున్నదని చెప్పారు. నవజాత శిశువులకు, బాలింతలకు కావాల్సిన 16రకాల వస్తువులతో రూ.2వేల విలువైన కేసీఆర్ హెల్త్ కిట్లను అందిస్తున్నదని తెలిపారు. ఈ చర్యలతో మాతాశిశు మరణాలు తగ్గాయన్నారు. కంటివెలుగు పథకంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైనవారికి మందులు, అద్దాలను అందిస్తున్నదని, అవసరాన్ని బట్టి శస్త్రచికిత్సలు చేయిస్తున్నదని తెలిపారు. ఇదే తరహాలో చెవి, ముక్కు, గొంతు, దంత సంబంధ వ్యాధుల పరీక్షల కోసం ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. అన్ని పరీక్షలను నిర్వహించి తెలంగాణ హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించనున్నట్టు తెలిపారు.

కుదుటపడిన వ్యవసాయం

సమైక్యరాష్ట్రంలో నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైన వ్యవసాయరంగాన్ని నిలబెట్టడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు మంచి ఫలితాలను, రైతాంగానికి గొప్ప ఊరటను ఇచ్చాయని గవర్నర్ నరసింహన్ చెప్పారు. 'వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తుతో కరంటు కష్టాలు తీరాయి. ప్రభుత్వ వ్యూహాత్మక చర్యలతో రైతులకు సకాలంలో ఎరువులు, క్రిమిసంహారకాలు, విత్తనాలు అందుతున్నాయి. నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల అమ్మకాల నిరోధానికి ప్రభుత్వ కఠిన చర్యలు చేపట్టింది. అటువంటి చర్యలకు పాల్పడేవారిపై పీడీ యాక్టు నమోదుకు చట్టాన్ని సవరించింది' అని చెప్పారు. పంటకాలంలో పెట్టుబడి కోసం రైతాంగం అప్పులు చేయాల్సిన అగత్యం లేకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిందని గవర్నర్ తెలిపారు. 'ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు పంటలకు రూ.8 వేలు దక్కుతుండటంతో రైతాంగం హర్షం వ్యక్తంచేస్తున్నది. ఈ పథకాన్ని ఐక్యరాజ్యసమితి ఎఫ్‌ఏవో ప్రశంసించడం మనందరికీ గర్వకారణం. దేశంలో ఇప్పుడు ఓ ఆదర్శవంతమైన పథకంగా రైతుబంధు మారింది. చాలా రాష్ట్రాలు దీనిని అమలుచేయడానికి సిద్ధమయ్యాయి. అశోక్‌గులాటి వంటి అనేకమంది ప్రముఖ వ్యవసాయ, ఆర్థిక నిపుణులు రైతుబంధు తరహా పథకం మాత్రమే వ్యవసాయసంక్షోభానికి పరిష్కారమని పేర్కొన్నారు. ఈ పథకం ఇప్పుడు జాతీయ అజెండాగా మారడంతో తెలంగాణ బిడ్డలు గర్వపడుతున్నారు' అని తెలిపారు. మానవీయమైన ఆలోచనతో ప్రవేశపెట్టిన రైతుబీమా పథకం కింద ఇప్పటివరకు 5,675 మంది రైతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల చొప్పున రూ.283 కోట్లు అందించినట్టు చెప్పారు. ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒకరు చొప్పున వ్యవసాయ విస్తరణాధికారులను నియమించిందని తెలిపారు. భూరికార్డుల ప్రక్షాళన విజయవంతం చేయడంతో దాదాపు 94% భూముల యాజమాన్యాల హక్కుల విషయంలో స్పష్టత వచ్చిందన్నారు.

గవర్నర్ ప్రసంగానికి నేడు ధన్యవాదాలు



గవర్నర్ ప్రసంగ పాఠాన్ని చదువుతున్న ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ఇతర సభ్యులు

గవర్నర్ ప్రసంగానికి ఉభయసభలు ఆదివారం ధన్యవాదాలు తెలుపనున్నాయి. ఉదయం 10.30 గంటలకు శాసనసభ, శాసనమండలి సమావేశమవుతాయి. శాసనసభలో ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ ధన్యవాద తీర్మానాన్ని ప్రతిపాదిస్తారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీర్మానానికి మద్దతుగా మాట్లాడుతారు. తీర్మానంపై చర్చకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమాధానం ఇవ్వనున్నారు. మండలిలో ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీర్మానాన్ని ప్రతిపాదిస్తారు. మరో విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మద్దతుగా మాట్లాడుతారు. నారదాసు లక్ష్మణ్‌రావు కూడా మాట్లాడనున్నారు. షబ్బీర్ అలీ (కాంగ్రెస్), రాంచందర్‌రావు (బీజేపీ), జాఫ్రీ ఎంఐఎం, టీచర్స్ ఎమ్మెల్సీ కే జనార్దన్‌రెడ్డి ధన్యవాద తీర్మానంపై చర్చలో పాల్గొంటారు. హోంమంత్రి మహమూద్ అలీ సమాధానమిస్తారు.

నేడు సభ ముందుకు పంచాయతీరాజ్ ఆర్డినెన్స్

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను 50 శాతానికి మించకుండా తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం సభ ముందు ఉంచనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రిజర్వేషన్ల కుదింపు అనివార్యమైంది. అదేవిధంగా నూతన చట్టాన్ని అనుసరిస్తూ కొన్ని వార్డుల రిజర్వేషన్లలో స్వల్ప మార్పులు తీసుకొచ్చారు. వీటి చట్ట సవరణ నేపథ్యంలో నేడు సభ ముందుకు ఆర్డినెన్స్ తీసుకొస్తున్నారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.53 గంటలకు



సూర్యాస్తమయం: 6.01 గంటలకు

విళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, చతుర్దశి, మధ్యాహ్నం 2.21 వరకు, తదుపరి పూర్ణిమ, నక్షత్రం: ఆరుద్ర ఉదయం 8.08 వరకు తదుపరి పునర్వసు, అమృతఘడియలు: లేవు, రాహుకాలం సాయంత్రం 4.37 నుంచి 6.01 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.32 నుంచి 5.16 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.45 నుంచి రాత్రి 8.21 వరకు.

లోకం పోకడ



అద్దంలా రహదారులు



శనివారం ప్రగతిభవన్‌లో రాష్ట్రంలోని రహదారుల పరిస్థితిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఆర్‌అండ్‌బీశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్ శర్మ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్‌ఈ చంద్రశేఖర్, సీఎంవో కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖల ఆధ్వర్యంలో భారీగా రోడ్ల నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. అవసరమైన చోట రహదారులకు, శిథిలావస్థకు చేరిన వంతెనలకు మరమ్మతులు, ఇరుకు వంతెనలను వెడల్పు చేయాలని ఆదేశించారు. దీనికోసం ఈఎన్సీ స్థాయి నుంచి ఏఈ స్థాయి వరకు రాష్ట్రస్థాయి ఆర్‌అండ్‌బీ అధికారుల సదస్సు నిర్వహించాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి ప్రతి రహదారి పరిస్థితిని సమీక్షించి, తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా, మండలం అనే తేడా లేకుండా, అక్కడ ఏ పార్టీ ప్రజాప్రతినిధి ప్రాతినిధ్యం వహిస్తున్నారనే విషయాన్ని పక్కనబెట్టి.. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని సూచించారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా దగ్గరుండి మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి, ఆర్‌అండ్‌బీ నుంచి జాతీయరహదారులకు రోడ్లు బదిలీ అయిన సందర్భంలో వాటి నిర్వహణ, మరమ్మతులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. కొత్త రోడ్లు నిర్మాణం అయ్యే వరకు పాత రోడ్లు పాడైపోయినా పట్టించుకోవడంలేదని, దీంతో ప్రయాణికులు ఇబ్బందిపడాల్సి వస్తున్నదని చెప్పారు. సమీక్షలో ఆర్‌అండ్‌బీ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ గణపతిరెడ్డి, ఎస్‌ఈ చంద్రశేఖర్, సీఎంవో కార్యదర్శులు స్మితా సబర్వాల్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వెంటనే పరిహారం ఇవ్వండి

కాళేశ్వరం ప్రాజెక్టులో కాల్వల నిర్మాణం కోసం భూమిని కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని అధికారులను సీఎం కేసీఆర్ ఆదేశించారు. ముథోల్ నియోజకవర్గ పరిధిలోని రైతులకు పరిహారం ఇప్పించాలని సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే జీ విఠల్‌రెడ్డి శనివారం ప్రగతిభవన్‌లో కలిసి విజ్ఞప్తిచేశారు. చిన్న సుద్దవాగు ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురైన ప్రజలకు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన సీఎం కేసీఆర్ ఆర్థికశాఖ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

మాలావత్ పూర్ణకు యూత్ అచీవ్‌మెంట్ అవార్డు



జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సు సందర్భంగా పలువురికి అవార్డులు, ఫెలోషిప్‌లు ప్రదానం చేశారు. 13 ఏండ్ల 11 నెలల అతి చిన్న వయసులోనే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణకు సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే, ఎంపీ కవిత.. జాగృతి యూత్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చాటిన పూర్ణను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్ణను ఎంపీ కవిత ప్రత్యేకంగా అభినందించారు. తన విజయంతో నిజామాబాద్ జిల్లాను ప్రపంచానికి పరిచయం చేసిందని పూర్ణను ప్రశంసించారు. మరిన్ని విజయాలు అందుకోవాలని దీవించారు. తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా సామాజికరంగంలో విశేష సేవలందించిన ఎనిమిది మందికి తెలంగాణ జాగృతి ఇండియా యూత్ ఫెలోషిప్ ప్రదానం చేశారు. ఇందులో భాగంగా గ్రహీతలకు మెమెంటో, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ ఫెలోషిప్‌ను ఈ ఏడాది నుంచి ఇస్తున్నట్లు కవిత తెలిపారు. అనంతరం తన పక్కనే మలావత్ పూర్ణకు కూర్చునే అవకాశం కల్పించిన కవిత.. అన్నా హజారేతో కలిసి పలువురు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

ప్రపంచ సమస్యలపై విస్తృతంగా చర్చలు

- 8 మందికి తెలంగాణ జాగృతి ఇండియా యూత్ ఫెలోషిప్
- సదస్సు నిర్వహణపై జాగృతికి ప్రతినిధుల ప్రశంసలు
- నేటి ముగింపు వేడుకల్లో పాల్గొననున్న గవర్నర్ నరసింహన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నోవాటెల్ వేదికగా ప్రారంభమైన జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు 135 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు హాజరయ్యారు. దేశంలోని పలు యూనివర్సిటీలకు చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాంధేయమార్గంలో సుస్థిరాభివృద్ధి, నూతన ఆవిష్కరణలు పేరుతో నిర్వహిస్తున్న సదస్సును సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే.. ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ కవిత అధ్యక్షోపన్యాసం చేయగా, అన్నా హజారే, సార్క్ మాజీ సెక్రటరీ జనరల్ అర్జున్ బహదూర్ థాపా ప్రసంగించారు.. ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా 'వాక్ ద టాక్ ఆన్ యూత్ డెవలప్‌మెంట్' అంశంపై ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. ఇందులో ఎంపీలు కవిత, అసదుద్దీన్ ఒవైసీ, గౌరవ్ గగోయ్ పాల్గొన్నారు. అనంతరం 'గాంధీ, యూత్ అండ్ సస్టెయినబిలిటీ- పర్‌స్పెక్టివ్ ఫ్రం ద వరల్డ్' అంశంపై యూకే ఎంపీ సీమా మల్హోత్రా, న్యూజిలాండ్ ఎంపీ కన్వల్‌జిత్‌సింగ్ భక్షీ, ఒకినవా, ఆఫ్ఘనిస్తాన్‌లో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ వ్యవస్థాపకుడు జాన్ డిక్సన్, శ్రీలంక పరిశ్రమలు, వాణిజ్య శాఖ ఉప మంత్రి బుదికా పథిరాణా, మాసిడోనియా రిపబ్లిక్ పెట్టుబడుల శాఖ మాజీ మంత్రి గ్లిగర్ తస్కోవిచ్ ప్రసంగించారు. 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నది. ఇదే అంశంపై వేర్వేరుగా ఏర్పాట్లుచేసిన హాళ్లలో ప్రముఖులు పాల్గొని ప్రపంచ సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సదస్సు నిర్వహణపై జాగృతిని ప్రశంసించారు. జాగృతి గురించి తెలిపేలా ఏర్పాటుచేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రెండోరోజు ప్రముఖుల రాక

జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో రెండోరోజయిన ఆదివారం గ్లోబల్ పాలసీ ఇన్‌సైట్ సీఈవో అర్పిత్ చతుర్వేది, యూఎన్ గ్లోబల్ కాంపాక్ట్ ఈడీ కమల్‌సింగ్, భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ ప్రసంగిస్తారు. మహిళా నాయకత్వంపై ప్రత్యేక నిర్వహిస్తున్న ప్రత్యేక సమావేశంలో పలు రంగాల్లో రాణిస్తున్న, ప్రపంచంలో పలు కీలక హోదాల్లో ఉన్న మహిళా ప్రముఖులు పాల్గొంటారు. స్కిల్ బిల్డింగ్ ఫర్ సస్టెయినబిలిటీ, ఇన్నోవేషన్ వర్క్‌షాప్ మీద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హాళ్లలో చర్చలు జరుగుతాయి. సాయంత్రం సదస్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ ప్రసంగిస్తారు.



జాగృతి అంతర్జాతీయ సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా, చిత్రంలో ఎంపీలు కవిత, ఒవైసీ, గౌరవ్ గొగోయ్, యూకే ఎంపీ సీమా మల్హోత్రా

భవిష్యత్ దృష్టితో విధానాలుండాలి

- అందులో అంతా భారతీయమే.. తేడాలు అనవసరం
- ప్యానల్ డిస్కషన్‌లో జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత
- ఎంపీ, ఎమ్మెల్యే అర్హత వయస్సును 20కి తగ్గించాలి
- పార్లమెంట్‌లో యువత ప్రాతినిధ్యం పెరగాలి: ఎంపీ ఒవైసీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విధానాల రూపకల్పనలో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోవడం ముఖ్యమని జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత అన్నారు. ప్రస్తుతం మన భారత్ యువదేశమని, భవిష్యత్‌లో ఓల్డెస్ట్ నేషన్‌గా అవుతుందని, అందుకే విధానాలనేవి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రూపొందాలని చెప్పారు. విధానాల రూపకల్పనలో మొదలు భారతీయులం అనే దృష్టితోనే ఉండాలని, ఎలాంటి తేడాలు ఉండకూడదని అన్నారు. జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో భాగంగా ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్‌గుప్తా శనివారం యువత అభివృద్ధి అనే అంశంపై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీలు కవిత, అసదుద్దీన్ ఒవైసీ, అసోం ఎంపీ గౌరవ్ గొగోయ్, యూకే ఎంపీ సీమా మల్హోత్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఎలాంటి తారతమ్యాలు ఆలోచించకుండా దేశంలోని అన్ని సమస్యలను పార్లమెంట్ వేదికగా ప్రస్తావించాలన్నారు. నిరుద్యోగం, పేదరికం, ఆరోగ్యం, విద్య ఇలా అనేక అంశాలపై ఎలాంటి వివక్ష లేకుండా చర్చించాలని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రం నమోదు చేయనివిధంగా తెలంగాణ 23- 24 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తున్నదన్నారు. వృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రాలకు అప్పు పరిమితిని పెంచాలని కోరారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలు అనే తేడా లేకుండా ప్రభుత్వాలు పాలన కొనసాగించాలని సూచించారు. వివిధ రంగాల్లో దూసుకుపోతున్న భారత్ వంటి దేశాల్లో యువత ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా పోటీచేసేందుకు ప్రస్తుతం ఉన్న అర్హత వయస్సును 20 ఏండ్లకు తగ్గించాలని అన్నారు. దీనిపై పార్లమెంట్‌లో ప్రైవేటు మెంబర్ బిల్ పెట్టినట్లు చెప్పారు. ప్రస్తుతం ఎంపీల సరాసరి వయసు 55 ఏండ్లు ఉన్నదని, పార్లమెంట్‌లో యువత భాగస్వామ్యం పెరగాలని అన్నారు. దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని, యువత ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను తగ్గించాల్సి బాధ్యత ప్రభుత్వాలపై ఉందని చెప్పారు. అనంతరం పలు దేశాల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

యువతే సమాజానికి శక్తి

దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలి ▪ ఇతరులకు సాయం చేస్తే దేవుళ్లతో సమానం

- గాంధీజీ ఆలోచనల స్ఫూర్తితో ఏదైనా సాధ్యమే
- తెలంగాణ అభివృద్ధిలో జాగృతి కృషి భేష్
- తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో అన్నా హజారే కితాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



దేశ యువతే సమాజానికి శక్తి అని, యువకులు మేల్కొంటే దేశం, సమాజం బాగుపడుతుందని సామాజికవేత్త అన్నా హజారే అన్నారు. దేశ సేవచేయాలని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలనే కోణంలో యువత ఆలోచనావిధానం ఉండాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో నిర్వహించిన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎంపీ కవితతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, ఆవిష్కరణలు' అంశంపై ఆయన మాట్లాడుతూ... మహాత్మాగాంధీ 150వ వర్ధంతి సందర్భంగా సదస్సు నిర్వహిస్తున్నందుకు తెలంగాణ జాగృతిని అభినందించారు. దేశంలో పేరుకుపోయిన అవినీతిని అహింసామార్గంలో యువత అంతమొందించాలని పిలుపునిచ్చారు. సరైన దిశానిర్దేశం ఉంటే యువత ఏదైనా చేయగలుగుతుందని చెప్పారు. గాంధీజీ, స్వామి వివేకానంద చెప్పినట్టుగా ఎన్ని ఆటుపోటులు ఎదురైనా లక్ష్యాన్ని చేరేందుకు ముందుకు సాగాలని సూచించారు. గాంధీజీ చెప్పినట్టు దేశాన్ని మార్చాలంటే ముందు గ్రామాన్ని మార్చాలని, గ్రామాన్ని మార్చాలంటే అందులోని ప్రజలందరినీ మార్చాలని సూచించారు. ఆలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో సేవ చేయడంతోపాటు సమాజం కోసం కూడా సేవ చేయాలని, మనుషులకు సేవ చేస్తే దేవుడికి చేసినట్టేనని చెప్పారు. ఇతరుల బాధను అర్థం చేసుకున్న వాళ్లు దేవుళ్లతో సమానమని వర్ణించారు.

అమెరికాను అధిగమిస్తాం

తెలంగాణను అభివృద్ధి చేసేందుకు ఎంపీ కవిత జాగృతిని ఏర్పాటుచేయడం గొప్ప విషయమని అన్నా హజారే కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తిచేశారు. ఇలా చేస్తే అభివృద్ధిలో అమెరికా, రష్యావంటి దేశాలను సైతం అధిగమించవచ్చని ధీమా వ్యక్తంచేశారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంపై యువత దృష్టి సారించాలని, కానీ సిగరెట్లు, గుట్కాలకు అలవాటుపడి పహిల్వాన్‌లాగా భ్రమ పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మనం చేసే పనుల వల్ల ఏం లాభం చేకూరుతుందో, కర్తవ్యం ఏమిటో తెలియాల్సిన అవసరం ఉండాలని చెప్పారు. సమాజం కోసం జీవించే వారు చరిత్రలో నిలిచిపోతారని, సమాజానికి సేవ చేసినందుకే గాంధీజీ, సావిత్రిబాయిపూలే వంటి వారిని మననం చేసుకుంటున్నామని గుర్తుచేశారు.

ఆత్మహత్య ఆలోచన విరమించుకున్నా

'ఇరవై ఏండ్ల వయస్సులో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నప్పటికీ, గాంధీజీ గురించిన పుస్తకం చదివి నిర్ణయాన్ని మార్చుకున్నా. గాంధీజీ స్ఫూర్తితోనే సమాజం కోసం జీవితాన్ని త్యాగంచేశా. సేవ చేసేందుకే దేవుడు మనుషులను సృష్టించారని గ్రహించి, సమాజ సేవకు అంకితమయ్యా. గ్రామానికి, దేశానికి, సమాజానికి సేవ చేసేందుకు పెండ్లి చేసుకోలేదు. పేదరికంలో ఉన్న నా గ్రామమైన రాలేగావ్‌సిద్ధిలో సేవచేయాలని నిర్ణయించుకున్నా. ఒకప్పుడు గ్రామంలో చేయడానికి పనిలేక ఆరు కిలోమీటర్ల దూరం వెళ్లి రాళ్లుకొట్టి ఉపాధి పొందేవాళ్లు. గతంలో మూడు వందల ఎకరాల్లో ఒక పంటే పండేది. ప్రస్తుతం వర్షపు నీటిని కాపాడుకోవడంతో 12 వందల ఎకరాల్లో మూడు పంటలు పండుతున్నాయి. ప్రతి ఒక్కరూ సమాజం కోసం త్యాగం చేయాలి. విత్తనం త్యాగం చేస్తేనే మహావృక్షమై ఫలాలనిస్తుంది. గత పన్నెండేండ్లలో రాలేగావ్‌సిద్ధిలోజరిగిన అభివృద్ధిని సందర్శించేందుకు ఆరు లక్షల మంది వచ్చారు. రాలేగావ్‌లో ఐదుగురు పీహెచ్‌డీ సాధించారు. మరో ఇద్దరు పీహెచ్‌డీ చేస్తున్నారు'అని అన్నా హజారే వివరించారు.

సుస్థిరాభివృద్ధికి యువత కదలాలి

- ప్రపంచ సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే
- రోజూ 80 కోట్ల మంది ఆకలితో అలమటిస్తున్నారు
- యువత ప్రపంచాన్ని గెలిచేందుకు ఈ సమావేశం తొలి అడుగు
- గాంధేయవాది అన్నా హజారే అందరికీ స్ఫూర్తి
- జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో ఎంపీ కవిత





శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ నోవాటెల్‌లో ప్రారంభమైన తెలంగాణ జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత, సదస్సుకు హాజరైన దేశవిదేశాల ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోసం, సుస్థిరాభివృద్ధిని సాధించేందుకు ప్రపంచ యువత కదలాలని, కలిసికట్టుగా పోరాటం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత పిలుపునిచ్చారు. ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న సమస్యలన్నీ మనకు మనం సృష్టించుకున్నవే అని, వాటికి పరిష్కారం కనుగొనేందుకు మేధావులు, యువ నాయకులు ముందుకు రావాలన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును ఏర్పాటు చేశామని, పెద్ద సంఖ్యలో ప్రపంచదేశాల నుంచి ప్రతినిధులు పాల్గొనడం సంతోషకరమని చెప్పారు. సమస్యలను పరిష్కరించేందుకు, ప్రపంచాన్ని యువత గెలిచేందుకు ఈ సదస్సు ఒక తొలి అడుగుగా నిలువాలని ఆకాంక్షించారు. ఈ సదస్సులో శనివారం జాగృతి అధ్యక్షురాలు, ఎంపీ కవిత అధ్యక్షోపన్యాసం చేశారు. గాంధేయమార్గంలో సుస్థిరాభివృద్ధి, ఆవిష్కరణలు అనే అంశంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచంలో మనం ముందుకు పోవాలంటే ఆకలి చావులు, అకాల మరణాలు, హింసకు మొదట అంతం పలకాలని, మనకు మనం సృష్టించుకున్న ఈ సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనేందుకు కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రముఖులు, ప్రతినిధులు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువత దృష్టి కేంద్రీకరించాలని కోరారు. వీటిపై పోరాటం చేసేవారిని కలుపుకొని ఒక నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవాలని, యువ నేతలు, యువత.. ఇలా అందరం కలిసి పనిచేసినప్పుడు ఈ సమస్యల నుంచి ప్రపంచానికి విముక్తి చూపించగలమని అన్నారు. ఈ లక్ష్యంలో గాంధేయవాది అన్నా హజారే అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఆయన ఈ కార్యక్రమానికి హాజరవటం గొప్ప విషయమని, మహారాష్ట్రలోని రాలేగావ్‌సిద్దిని గొప్పగా నిలబెట్టారంటూ కరువు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా చేసిన క్రమాన్ని వివరించారు. గాంధీజీ స్ఫూర్తిని పాటించి గ్రామాన్ని ఆర్థికంగా నిలబెట్టారని, అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. గాంధీజీ 150వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన మార్గదర్శకం ప్రకారం సుస్థిరాభివృద్ధివైపు ప్రపంచం నడువాలని ఆశిస్తున్నామన్నారు.

> 'నేను సంతోషంగా లేను.. ఈ ప్రపంచంలో ప్రతి ఏడాది 22,000 మంది చిన్నారులు అకాలమరణం చెందుతున్నారు. ప్రతిరోజు 80 కోట్ల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. రోజులు గడుస్తున్నకొద్దీ మనం విషపూరితమైన గాలిని పీల్చుతున్నాం. ఆధునిక ప్రపంచంలో కూడా ఇంకా యుద్ధాలు జరుగుతున్నాయి. అందుకే నేను సంతోషంగా లేను. వీటన్నింటికి అంతం పలుకాలి. ఇవన్నీ మనం సృష్టించుకున్నవే. కలిసికట్టుగా ఉండి పోరాటం చేయాలి. మేధావులు, ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వామ్యం కావాలి. ఈ సదస్సు వేదికగా ఒక పరిష్కారం ఆలోచించాలి.'
> -జాగృతి అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సులో ఎంపీ కవిత

అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే 90 శాతం యువత

ప్రపంచ జనాభాలో 42 శాతం మంది 35 ఏండ్లకంటే తక్కువ వయసున్నవారేనని, 25 శాతం 15-29 మధ్య వయసువారేనని ఎంపీ కవిత చెప్పారు. ప్రపంచంలో మొత్తంగా 180 కోట్ల యువ జనాభా ఉందని, అందులో 90 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనేనని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన- చెందుతున్న దేశాల్లో జీవిస్తున్న యువత మధ్య పెద్ద తేడా ఉందని చెప్పారు. దీని గురించి ఆలోచించాల్సి ఉందన్నారు. 'యువత మరణాల శాతం ధనిక దేశాలతో పోల్చితే పేదదేశాల్లో ఐదు రెట్లు ఎక్కువగా ఉంది. పేద దేశాల్లో యువతకు సరైన విద్య, ఆరోగ్యం, ఉద్యోగావకాశాలు ఉండటం లేదు. ఈ సమస్యలపై కలిసి పోరాటం చేయాలి. తారతమ్యాలు ఎలా తొలగించాలి అనేది ఈ సదస్సు వేదికగా ప్రతి ఒక్కరు ఆలోచించాలి' అని కోరారు. యువత అంటే కేవలం పురుషులే కాదని, మహిళలు కూడా భాగమేనని, లింగ సమానత్వం కోసం ఇంకా పోరాటం చేయాల్సి వస్తున్నదన్నారు. యువతులు ఎంతో మంది విద్య, ఉద్యోగావకాశాలకు దూరంగా ఉంటున్నారని, హెచ్ఐవీ బాధితుల్లో మహిళలే ఎక్కువగా ఉండటం బాధాకరమైన విషయమని చెప్పారు. చాలా దేశాల నుంచి ఈ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన యువత ప్రపంచాన్ని మార్చేలా పరిష్కారాలు చూపాలని కోరారు.

యువత హక్కుల కోసం పోరాటం చేయాలి

యువత హక్కుల కోసం పోరాటం చేసినప్పుడే మార్పు సాధ్యమవుతుందని, ప్రతి దేశంలో ఉన్న యువత పోరాటం చేయడం ఎలా.. అనే దానికి ఈ సదస్సు సమాధానం చెప్తుందని ఎంపీ కవిత తెలిపారు. 'సరైన విధానాలు రూపొందించి, యువతను సరైన మార్గంలో నడిపిస్తే దేశం అభివృద్ధి చెందుతుంది. కాని ప్రపంచంలో ఎన్ని దేశాలు యువతను ప్రోత్సహిస్తున్నాయి. వారిపై పెట్టుబడి పెడుతున్నాయి. భారత్‌కు యువతను ప్రోత్సహించే విధానం ఉంది. కాని యువతకు సరిపోయేంత పెట్టుబడి జరుగుతుందా అంటే లేదు' అని ఆమె అన్నారు. అందుకే వివిధ సంస్థల మధ్య ఒక నెట్‌వర్క్ రూపొందించాలని, ప్రతి దేశంలోని యూత్ ఆర్గనైజేషన్స్‌తో కలిసి పనిచేయాలని చెప్పారు. అప్పుడు అనుకున్నవన్నీ సాధ్యమవుతాయని, యువత మీద ప్రభుత్వాలు ఆశించిన రీతిలో పెట్టుబడి చేస్తాయని.. ఈ సమావేశం ముఖ్య లక్ష్యం కూడా అదేనని ఆమె అన్నారు. 'ఇది సాధ్యపడుతుందా అని ఆలోచించకండి. పెద్ద లక్ష్యం ఏం కాదు. అసాధ్యం కూడా కాదు. ఈ ప్రపంచంలో ఏదైనా ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుంది. ఈ సదస్సు కూడా ప్రపంచ సమస్యల పరిష్కారానికి, యువత హక్కుల పోరాటానికి మొదటి అడుగులాంటిది. 'మొదట పట్టించుకోరు.. తర్వాత అపహాస్యం చేస్తారు. నీపై పోరాటం చేస్తారు.. అయినప్పటికీ విజయం సాధిస్తావు' అనే మహాత్ముడి స్ఫూర్తితో ముందుకు వెళ్దాం' అని కవిత పిలుపునిచ్చారు.

టీఆర్టీ పోస్టుల ఎంపిక జాబితా విడుదల

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (టీఆర్టీ)లో భాగంగా స్కూల్ అసిస్టెంట్స్, పీఈఈ, ఎస్జీటీ పోస్టులకు సంబంధించి 925 ఉద్యోగాలకు ఎంపికైనవారి జాబితాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) విడుదల చేసింది. ఎస్ఏ సోషల్ స్టడీస్ (ఆంగ్ల మీడియం) 4 పోస్టులు, ఎస్ఏ సోషల్ స్టడీస్ (హిందీ మీడియం) ఒక పోస్టు, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు మీడియం) 9 పోస్టులు, ఎస్ఏ మ్యాథ్స్ (తెలుగు మీడియం) 191 పోస్టులు, పీఈటీ (ఉర్దూ మీడియం) 4, పీఈటీ (ఇంగ్లిష్ మీడియం) 1, ఎస్జీటీ (ఉర్దూ మీడియం) 281 పోస్టుల భర్తీకి జాబితా విడుదల చేశారు. ఎస్జీటీ ఉర్దూలో 636 పోస్టులకుగాను అర్హులైన అభ్యర్థులు దొరుకకపోవడం వల్ల 320 ఖాళీలు భర్తీ చేయలేకపోయినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఎస్ఏ గణితంలో 215 నోటిఫై చేయగా 16 పీహెచ్‌సీ కోటా కొలువులకు సంబంధించిన వైద్య ధ్రువీకరణపత్రాలు అందిన తర్వాత నియామకం చేపట్టనున్నట్టు పేర్కొన్నది.

ఫిబ్రవరి మొదటివారంలో పోడుభూములపై సమావేశం

కాంగ్రెస్ గిరిజన ఎమ్మెల్యేలతో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పోడుభూముల సమస్యపై ఫిబ్రవరి మొదటివారంలో గిరిజన ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలిపారు. కాంగ్రెస్‌కు చెందిన గిరిజన ఎమ్మెల్యేలు శనివారం అసెంబ్లీలో తనను కలిసి పోడుభూముల సమస్యలపై వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. సీఎం కేసీఆర్‌ను కలిసినవారిలో ఎమ్మెల్యేలు ధనసరి అనసూయ, ఆత్రం సక్కు, రేగా కాంతారావు ఉన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి కూడా సీఎంను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎమ్మెల్సీ రాంచందర్‌రావు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. టీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు నోముల నర్సింహయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, భాస్కర్‌రావు, బాల్క సుమన్, కోనేరు కోనప్ప, ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్ సీఎంను కలిసి నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.

'పోడు'లపై సీఎం సానుకూలం: ఆదివాసీ ఎమ్మెల్యేలు

పోడుభూముల సమస్యల పరిష్కారంపై సీఎం కేసీఆర్ సానుకూలంగా ఉన్నారని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు చెప్పారు. ఆయన శనివారం ఎమ్మెల్యేలు సీతక్క, రేగా కాంతారావుతో కలిసి మీడియాపాయింట్‌లో మాట్లాడారు. పోడుభూముల సమస్యలపై సీఎంకు వినతిపత్రాన్ని అందజేశామని, వచ్చే నెల మొదటివారంలోనే సమావేశం నిర్వహించనున్నట్లు హామీ ఇచ్చారని చెప్పారు.



శనివారం అసెంబ్లీలో పోడుభూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు ధనసరి అనసూయ(సీతక్క), ఆత్రం సక్కు, రేగా కాంతారావు తదితరులు

అసెంబ్లీ సమావేశాల వల్లే ఐక్యతార్యాలీకి సీఎం కేసీఆర్ గైర్హాజరు

నిజామాబాద్ ఎంపీ కవిత వెల్లడి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణలో అసెంబ్లీ సమావేశాల బిజీ కారణంగానే సీఎం కేసీఆర్ శనివారం కోల్‌కతాలో జరిగిన ఐక్యతార్యాలీకి హాజరుకాలేకపోయారని ఎంపీ కవిత తెలిపారు. భవిష్యత్తులో బీజేపీయేతర, కాంగ్రెసేతర ర్యాలీల్లో టీఆర్ఎస్ పార్టీ కచ్చితంగా పాలుపంచుకుంటుందని చెప్పారు. స్పీకర్ ఎన్నిక, సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఉండటంతో సీఎం కేసీఆర్‌కు సమయం లేకపోయిందని ఆమె శనివారం నోవాటెల్‌లో మీడియా కు చెప్పారు. సీఎం కేసీఆర్ చెప్పినట్టుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలు ఇచ్చిన అవకాశాలను వినియోగించుకోలేదని పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో టీఆర్ఎస్ క్రియాశీల పాత్ర పోషించబోతున్నదన్నారు.



శనివారం ముంబైలో నూతనంగా ప్రారంభమైన నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియన్ సినిమాలో జాతిపిత మహాత్మా గాంధీజీ విగ్రహం పక్కన ఆశీనులైన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

అయ్యప్ప దర్శనానికి ఇద్దరు మహిళల యత్నం

భద్రత కల్పించలేమని పోలీసులు చెప్పడంతో ఇంటి బాట

శబరిమల, జనవరి 19: కేరళలోని శబరిమల అయ్యప్పను దర్శించుకునేందుకు మరో ఇద్దరు మహిళలు విఫల యత్నం చేశారు. కేరళలోని కన్నూర్‌కు చెందిన రేష్మా నిశాంత్, షానీలా సాజేష్ అనే 30 ఏండ్లలోపు వయస్సున్న ఇద్దరు మహిళలు శనివారం ఉదయం 5 గంటలకు నీలక్కల్ బేస్‌క్యాంప్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి శబరిమలకు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వెంటనే వారిని కంట్రోల్ రూమ్‌కు తరలించారు. ప్రస్తుతం అయ్యప్ప భక్తుల రద్దీ ఎక్కువగా ఉందని, 50 ఏండ్ల లోపు మహిళలు కనిపిస్తే భక్తులు ఆగ్రహంతో దాడులకు పాల్పడే అవకాశం ఉందని పోలీసులు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. తాము 41 రోజులపాటు నిష్ఠగా దీక్ష చేశామని, అయ్యప్పను దర్శించుకునేందుకు అనుమతి ఇవ్వాలని మహిళలు కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రక్షణ కల్పించడం కష్టమని పోలీసులు తమ నిస్సహాయతను వ్యక్తంచేశారు. దీంతో మొత్తం ఆరుగురు సభ్యుల బృందం ఇంటి బాట పట్టింది. అయితే, ఆలయానికి తీసుకెళతామని చెప్పి, పోలీసులు తమను మోసం చేశారని ఇద్దరు మహిళలు విమర్శించారు. జనవరి 16నే వీరిద్దరూ అయ్యప్పను దర్శించుకునేందుకు మెట్ల మార్గం ద్వారా వెళ్లేందుకు యత్నించారు. అయితే, భక్తులు తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో తమ యాత్రను విరమించుకున్నారు.

బస్సు కిటికిలో నుంచి వాంతులు చేసుకుంటుండగా.. కరెంట్ స్తంభం తగిలి తెగిన తల

పన్నా (ఎంపీ), జనవరి 19: కిటకిటలాడుతున్న బస్సులో ప్రయాణిస్తున్న ఆశా రాణి (56) అనే మహిళ వాంతులు వచ్చి కిటికిలో నుంచి తలను బయటకు పెట్టడంతో విద్యుత్ స్తంభం తగిలి తల తెగిపోయింది. ఈ దుర్ఘటన మధ్యప్రదేశ్‌లోని పన్నా జిల్లాలో శుక్రవారం జరిగింది. నిర్లక్ష్యంగా బస్సును నడిపిన డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

సద్దుమణిగిన సంక్షోభం!

- కర్ణాటకలో ఆపరేషన్ కమలానికి తెర
- ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదని మాజీ సీఎం యెడ్యూరప్ప ప్రకటన
- గుర్గావ్ నుంచి బెంగళూరుకు తిరిగి రావాలని బీజేపీ ఎమ్మెల్యేలకు ఆదేశం
- రానున్న రోజుల్లో అగ్నిపర్వతం బద్దలవుతుందంటూ కాంగ్రెస్-జేడీఎస్ విభేదాలపై వ్యాఖ్యలు



యెడ్యూరప్ప

బెంగళూరు, జనవరి 19: కొద్దిరోజులుగా రసవత్తరంగా మారిన కర్ణాటక రాజకీయాలు కంచికి చేరాయి. ఆపరేషన్ కమలానికి ప్రస్తుతానికి తెరపడినట్లే! కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ సర్కారును కూల్చే ఉద్దేశం తమకు లేదని బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు, మాజీ సీఎం యెడ్యూరప్ప ప్రకటించారు. గుర్గావ్‌లోని ఓ హోటల్‌లో ఉన్న 104 మంది బీజేపీ ఎమ్మెల్యేలు బెంగళూరుకు తిరిగి రావాలని ఆదేశించారు. మరోవైపు బీజేపీ ప్రలోభాలతో ఎక్కడ తన ఎమ్మెల్యేలను ఎగురవేసుకుపోతుందేమోనన్న భయంతో బెంగళూరు సమీపంలోని ఈగల్టన్ రిసార్ట్‌లో కాంగ్రెస్ తన ఎమ్మెల్యేలను దాచిపెట్టింది.

ప్రభుత్వాన్ని అస్థిరపర్చే ఉద్దేశం లేదు: యెడ్యూరప్ప

కర్ణాటకలో తాజా రాజకీయ పరిణామాలపై యెడ్యూరప్ప శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలైన కాంగ్రెస్-జేడీఎస్‌ల మధ్య తీవ్ర విభేదాలున్నాయని, శుక్రవారం జరిగిన సీఎల్పీ భేటీకి నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడమే ఇందుకు నిదర్శనమని విమర్శించారు. వచ్చే కొద్ది రోజుల్లో అగ్నిపర్వతం బద్దలవుతుందనేందుకు (ప్రభుత్వం కూలిపోతుందనేందుకు) ఇదే సంకేతమని చెప్పారు. అయితే, కాంగ్రెస్-జేడీఎస్ సంకీర్ణ సర్కారును అస్థిరపర్చే ఉద్దేశం తమకు లేదని యెడ్యూరప్ప చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్‌కు ఎలాంటి భయాలు, అనుమానాలు అక్కర్లేదని అన్నారు. తాము నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ఆయన తెలిపారు. గుర్గావ్‌లో ఉన్న తమ ఎమ్మెల్యేలంతా బెంగళూరు చేరుకోవాలని యెడ్యూరప్ప ఆదేశించారు. రాష్ట్రంలో కరువుతో అల్లాడుతున్న ప్రాంతాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు పర్యటిస్తారని, అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. కేవలం నిరాశ, నిస్పృహలతోనే గైర్హాజరైన ఎమ్మెల్యేలను బెదిరిస్తూ సిద్దరామయ్య వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. మరోవైపు ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదన్న యెడ్యూరప్ప నిర్ణయాన్ని మాజీ సీఎం సిద్దరామయ్య స్వాగతించారు.

ప్రభుత్వం ప్రమాదంలో ఉంది : సీఎం కుమారస్వామి

ప్రస్తుతం సంకీర్ణ సర్కారు ప్రమాదంలోనే ఉందని, అయితే, దీనిపై తానేమీ వ్యాకులత చెందడంలేదని సీఎం కుమారస్వామి చెప్పారు. 'రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఉంది. ప్రభుత్వాన్ని కూల్చేందుకు వారు (బీజేపీ) శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. దీనిపై నేనేమీ భయపడడం లేదు. అయితే వారి పాచికలు ఎన్నటికీ పారబోవు' అని చెప్పారు. నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల గైర్హాజరు అంశం ఆ పార్టీ అంతర్గత విషయమని చెప్పారు. స్వతంత్ర ఎమ్మెల్యేలను నమ్ముకోవద్దని పలు సందర్భాల్లో కాంగ్రెస్‌కు చెప్పానని, వారిపై ఆధారపడి ప్రభుత్వాన్ని నడుపలేమని పేర్కొన్నారు.

ఈగల్టన్ రిసార్టు నుంచి రూ.982 కోట్లు రికవరీ చేయండి: బీజేపీ

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను దాచిన ఈగల్టన్ రిసార్టు నుంచి రూ.982 కోట్లు రికవరీ చేయాలని బీజేపీ రాష్ట్రశాఖ డిమాండ్ చేసింది. 77 ఎకరాల ప్రభుత్వ భూమిని రిసార్టు యాజమాన్యం కబ్జా చేసినట్లు గతంలో జరిగిన దర్యాప్తులో తేలిందని పేర్కొన్నది. ఇందుకుగానూ రిసార్టుపై రూ.982 కోట్ల జరిమానా విధించారని, ఈ విషయాన్ని అసెంబ్లీలో రెవెన్యూమంత్రి ఆర్‌వీ దేశ్‌పాండే స్వయంగా వెల్లడించారని బీజేపీ గుర్తుచేసింది. ఈ మొత్తాన్ని ఎప్పుడు వసూలు చేస్తారో చెప్పాలంటూ మాజీ సీఎం సిద్దరామయ్య, డీకే శివకుమార్, దినేశ్ గుండూరావులకు ప్రశ్నలు సంధించింది. జరిమానాను వసూలు చేసి ఆ మొత్తాన్ని రాష్ట్రంలో రైతుల రుణాలను మాఫీ చేసేందుకు వినియోగించాలని కోరింది.

డొల్ల కంపెనీలపై జీఎస్టీ అధికారుల దాడులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జీఎస్టీ కమిషనరేట్ ఆధ్వర్యంలో డొల్ల కంపెనీల ముసుగులో మోసాలు చేస్తున్న వ్యాపార సంస్థలపై దాడులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా షెల్ కంపెనీల ద్వారా లబ్ధి పొందుతున్న వ్యాపారులను జీఎస్టీ హైదరాబాద్ కమిషనరేట్ అధికారులు పసిగట్టి పట్టుకున్నారు. రూ. 500 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న ఐరన్ అండ్ స్టీల్ వ్యాపార సంస్థపై, యాజమాని ఇంటిపై తనిఖీలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. శంకరంపేట, నాచారం యూనిట్లపై సోదాలు చేయగా పలు అక్రమాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. మూడు డొల్ల సంస్థల ద్వారా సుమారు రూ. 40 కోట్ల మేర నకిలీ ఇన్వాయిస్‌లు జారీ చేసినట్టు వెల్లడైంది. ఈ నకిలీ ఇన్వాయిస్‌ల జారీ ద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ. 4 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్టు అధికారులు తెలిపారు. యజమానిని అరెస్టు చేసి తక్షణమే రూ. 3 కోట్లు రికవరీ చేసినట్టు పేర్కొన్నారు. ఓ వారంలో మిగిలిన రూ. కోటి చెల్లించే పూచీకత్తు యజమానిదేనని చెప్పారు. రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని జీఎస్టీ కమిషనరేట్ అధికారులు పేర్కొన్నారు.

ఈవీఎంలతో ఫుట్‌బాల్ ఆటలొద్దు

రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి అరోరా విజ్ఞప్తి



పాట్నా, జనవరి 19: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎం) రాజకీయ పార్టీలు ఫుట్‌బాల్‌లా భావిస్తున్నాయని కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి సునిల్ అరోరా ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓటమిపాలైతే ఈవీఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, విజయం సాధిస్తే మాత్రం ఆ అంశాన్ని పక్కనబెడుతున్నారని విమర్శించారు. దయచేసి ఈవీఎంలను ఫుట్‌బాల్‌ను చేయొద్దని రాజకీయ పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈవీఎంలలో అవకతవకలకు ఆస్కారమే లేదని స్పష్టం చేశారు. రెండు రోజుల బీహార్ పర్యటనను ముగించుకున్న ఆయన శనివారం పాట్నాలో మీడియాతో మాట్లాడారు. 'ఈవీఎంలలో అక్రమాలకు తావులేదు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినా తక్షణమే వాటిని సరిచేస్తున్నాం' అని వివరించారు. వచ్చే లోకసభ ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఎన్నికల ఏర్పాట్లు పూర్తయిన అనంతరం లోకసభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని చెప్పారు. బీహార్ పర్యటనలో భాగంగా ఆయన వివిధ రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి ఆయా పార్టీల నుంచి సలహాలు కోరారు. ఈవీఎంల వినియోగాన్ని ప్రతిపక్ష ఆర్జేడీ వ్యతిరేకించగా, ప్రతి బూత్‌లోనూ వీవీప్యాట్లు అందించే ఏర్పాట్లు చేయాలని అధికార జేడీయూ సూచించింది. ఒక్కో బూత్‌ను 800 మంది ఓటర్లకే పరిమితం చేయాలని, మారుమూల ప్రాంతాల ఓటర్ల సౌకర్యార్థం మొబైల్ పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని సీపీఐ కోరింది. ఎన్నికల జాబితాలో అక్రమాలను సరిచేయాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది.

లైంగికదాడి కేసు ఉపసంహరించుకోనందుకు.. యువతి కాల్చివేత

- గుర్గావ్‌లో నడి రోడ్డుపై మృతదేహాన్ని వదిలి పరారైన నిందితుడు



గుర్గావ్: లైంగికదాడి కేసును ఉపసంహరించుకోనందుకు బాధితురాలిని నిందితుడు కాల్చిచంపాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని నడిరోడ్డుపై వదిలేశాడు. ఈ దారుణం గుర్గావ్‌లో చోటుచేసుకుంది. 22 ఏండ్ల వయసున్న ఒక యువతి నాలుగేండ్లుగా నైట్‌క్లబ్‌లో డ్యాన్సర్‌గా పనిచేస్తున్నారు. అదే నైట్‌క్లబ్‌లో పనిచేస్తున్న బౌన్సర్ సందీప్‌కుమార్ ఆమెపై లైంగికదాడికి పాల్పడటంతో 2017 మార్చిలో కేసు నమోదైంది. ఈ కేసు విచారణలో భాగంగా శుక్రవారం ఆమె కోర్టుకు హాజరై తన వాంగ్మూలాన్ని వినిపించాల్సి ఉంది. శుక్రవారం తెల్లవారుజామున సందీప్‌కుమార్ నాథూపూర్‌లో ఉన్న యువతి ఇంటికి వచ్చాడు. ఐదు నిమిషాలు మాట్లాడాలని చెప్పి యువతిని కారులో కూర్చోబెట్టుకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కేసు ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తెచ్చాడు. అనంతరం యువతిని తుపాకీతో కాల్చి చంపి గుర్గావ్-ఫరీదాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే పక్కన పడేశాడు.

ఐఆర్సీటీసీ కేసులో లాలూకు బెయిలు

మనీ లాండరింగ్ కేసులో బెయిలు పొడిగింపు



న్యూఢిల్లీ: ఐఆర్సీటీసీ (ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్) కుంభకోణం కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు స్వల్ప ఊరట లభించింది. సీబీఐ దాఖలు చేసిన ఈ కేసులో లాలూ ప్రసాద్‌కు శనివారం ఢిల్లీ హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. దాణా కుంభకోణ కేసుల్లో ఇప్పటికే జైలుశిక్ష అనుభవిస్తున్న లాలూ ప్రస్తుతం రాంచీలోని రిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే మొత్తం ష్యూరిటీతో ప్రత్యేక న్యాయమూర్తి అరుణ్ భరద్వాజ్ ఆయనకు బెయిలు మంజూరు చేశారు. ఇదిలావుంటే, ఐఆర్సీటీసీ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీ లాండరింగ్ కేసులో లాలూ, రబ్రీదేవి, తేజస్వి తదితరులకు గతంలో మంజూరుచేసిన తాత్కాలిక బెయిలు గడువును న్యాయస్థానం ఈ నెల 28 వరకు పొడిగించింది.

జకీర్ నాయక్ కుటుంబసభ్యుల ఆస్తులు జప్తు

న్యూఢిల్లీ: వివాదాస్పద మతప్రచారకుడు జకీర్ నాయక్ కుటుంబసభ్యులకు చెందిన రూ.16.40 కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. మనీల్యాండరింగ్ కేసులో భాగంగా ముంబై, పుణెలో ఉన్న ఈ ఆస్తులను జప్తు చేసినట్లు ఈడీ పేర్కొంది. జకీర్ నాయక్ ప్రసంగాలు రెచ్చగొట్టేలా ఉండటం, వివాదాస్పదం కావడంతో గతంలో దృష్టి సారించిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కేసు నమోదు చేసింది. ఇలాంటి ప్రసంగాలకుగాను అతడికి అక్రమ మార్గంలో నిధులు అందుతున్నట్లు గుర్తించింది. దీంతో ఈడీ కూడా మనీల్యాండరింగ్ చట్టం కింద జకీర్ నాయక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నది. ఇందులో భాగంగానే జకీర్ నాయక్ కుటుంబసభ్యుల పేరు మీద ఉన్న రూ.16.40 కోట్ల ఆస్తులను జప్తు చేసింది.

త్వరలో కిమ్‌తో భేటీ: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా- ఉత్తరకొరియా రెండో సదస్సుకు వేదిక ఖరారైందని, త్వరలోనే దీన్ని ప్రకటిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఉత్తరకొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్, ట్రంప్ మధ్య రెండో భేటీ ఫిబ్రవరి చివరిలో ఉంటుందని శుక్రవారం శ్వేతసౌధం ధ్రువీకరించింది. ఉత్తరకొరియా కీలక నేత కింగ్ యాంగ్ చోల్ శుక్రవారం ట్రంప్‌తో భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరలో అధ్యక్షుల భేటీ నిర్వహించేందుకు నిర్ణయించామని ట్రంప్ చెప్పారు. సమావేశం జరిగే దేశాన్ని ఎంపికచేశామని, త్వరలోనే దీన్ని ప్రకటిస్తామని తెలిపారు.

'హౌసింగ్ సొసైటీ'లో బీటీఎన్జీవో ఘన విజయం

- ఎన్నికల్లో సత్యనారాయణగౌడ్ ప్యానెల్ విజయదుందుభి
- ఏపీ ఎన్జీవోలకు చెంపపెట్టు.. బీటీఎన్జీవోకే అన్ని డైరెక్టర్లు
- ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఘోర పరాజయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో భాగ్యనగర్ తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(బీటీఎన్జీవో) ఘన విజయం సాధించింది. బీటీఎన్జీవో అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్ ప్యానెల్ విజయదుందుభి మోగించింది. 15 మంది డైరెక్టర్లతో పోటీచేసిన బీటీఎన్జీవోలకు ఏకపక్షంగా ఓట్లుపడటంతో భారీ మెజార్టీ సాధించారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ల ఎన్నికలు ఏపీ ఎన్జీవో భవన్‌లో శనివారం జరిగాయి. ఉదయం 8 గంటల నుంచే పోలింగ్ మొదలైంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం 2,327 ఓట్లు పోలవగా 91 ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. బీటీఎన్జీవో అధ్యక్షుడు ఎం సత్యనారాయణగౌడ్ 1,875, అమర్‌జ్యోతి 1,861, పద్మారెడ్డి 1,851, అబ్దుల్ సాదిఖ్ 1,848, ప్రభాకర్‌రెడ్డి 1,839, బలరాం 1,938, విష్ణువర్ధన్‌రెడ్డి 1,834, రాజేశ్వర్‌రావు 1,829, శ్రీధర్‌రెడ్డి 1,826, కేశవ 1,825, వెంకటపతి 1,818, శ్రీనివాసారావు 1,812, శ్రీనివాస్ 1,810, మల్లారెడ్డి 1,796, రషీదా బేగం 1,778 ఓట్లతో విజయం సాధించారు. ఏపీ ఎన్జీవోల ప్యానెల్‌కు అత్యధికంగా వచ్చిన ఓట్లు 379 మాత్రమే. ఎన్నికల్లో ఉద్యోగులను విభజించేందుకు కుట్రలు చేసిన ఏపీ ఎన్జీవోలు ఘోర పరాజయం పాలయ్యారు. బీటీఎన్జీవోకు చెందిన ఒక్కో డైరెక్టర్‌కు వచ్చిన ఓట్లలో కనీసం పావువంతు కూడా ఏపీ ఎన్జీవోలకు రాలేదు. ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి దాదాపు 1500 ఓట్ల తేడాతో ఓడిపోయారు. సత్యనారాయణగౌడ్ 1,875 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. ఉద్యోగులు పటాకులు కాల్చి స్వీట్లు పంచుకొని విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.



శనివారం భాగ్యనగర్ టీఎన్జీవో విజయోత్సవ ర్యాలీలో నూతన అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్(ఎడమ), పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

పలువురి శుభాకాంక్షలు

ఏపీ ఎన్జీవోలకు బుద్ధిచెప్పేందుకు ఉద్యోగులు ఒక్కతాటిపై నిలిచి ఉద్యమస్ఫూర్తిని ప్రదర్శించారని టీజీవో వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎన్నికైన డైరెక్టర్లను అభినందించారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, టీజీవో అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులు నూతన డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు.

ఉద్యోగులకు రుణపడి ఉంటా

హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో ఏపీ ఎన్జీవోలు ఎన్ని కుట్రలు చేసినా ఉద్యోగులు ఒక్కతాటిపై నిలిచారు. సొసైటీ సొమ్ముతో జల్సాలు చేస్తున్న వారి నుంచి నిధులన్నీ కక్కిస్తాం. ప్రభుత్వం కేటాయించిన నివేశన స్థలాల సమస్యను టీఎన్జీవో, టీజీవో నేతల సహకారంతో పరిష్కరించుకుంటాం. మా ప్యానెల్‌ను గెలిపించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాం.

-సత్యనారాయణగౌడ్, బీటీఎన్జీవో అధ్యక్షుడు

జేఈఈలో తెలంగాణ ప్రతిభ

మొదటిపేజీ తరువాయి...

నిదర్శనం. ఇందులో అడెల్లి సాయికిరణ్, ఇందుకూరి జయంత్ ఫణీసాయి, కే విశ్వనాథ్, బెట్టిపాటి కార్తీకేయ ఉన్నట్టు ఎన్టీఏ ప్రకటించింది. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, కేంద్రీయ విద్యాలయాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్-1 కోసం దేశవ్యాప్తంగా 9,29,198 మంది నమోదు చేసుకోగా 8,74,469 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 258 నగరాల్లో 467 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. రోజుకు రెండుపూటలా పరీక్షలు నిర్వహించిన క్రమంలో ఒక ప్రశ్నపత్రానికి మరో ప్రశ్నపత్రానికి మధ్య ఉన్న వ్యత్యాసాలను నార్మలైజేషన్ ద్వారా మార్కులను సరిచేస్తారు. ఆ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ర్యాంకులను విడుదలచేస్తామని ఎన్టీఏ అధికారులు తెలిపారు. జేఈఈ మెయిన్ పేపర్-2 (బీఆర్క్)కు సంబంధించిన ఫలితాలు త్వరలోనే విడుదలకానున్నాయి. జేఈఈ మెయిన్-2 పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 20 వరకు నిర్వహించే అవకాశముంది.





శనివారం అసెంబ్లీ ఆవరణలోని అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు నివాళులర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులున్నారు.

పక్షపాతంలేకుండా సభను నడుపుతా

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతనంగా ఎన్నికైన అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఉదయం అసెంబ్లీ ఆవరణలోని మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్పీకర్‌గా దేశంలోని మహనీయులను గౌరవించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. నియమ నిబంధనల ప్రకారం ప్రతిపక్ష పార్టీలకు మాట్లాడే అవకాశమిస్తానని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల సలహాలు, సూచనలు స్వీకరించి సభ సంప్రదాయాలను పాటిస్తానని వివరించారు. స్పీకర్ వెంట అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు తదితరులున్నారు. స్పీకర్‌గా ఎన్నికైన పోచారం శ్రీనివాస్‌రెడ్డికి శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్‌తో సహా మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, మండలిలో చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్సీలు వీ గంగాధర్‌గౌడ్, ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎల్పీ నేతగా భట్టి.. స్పీకర్‌కు లేఖ

కాంగ్రెస్ శాసనసభాపక్షనేతగా మల్లు భట్టి విక్రమార్కను ఎన్నుకున్నట్టు ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి లేఖను అందించారు. భట్టిని ప్రతిపక్షనేతగా గుర్తించాలని కోరారు. సీఎల్పీనేతగా ఎన్నికైన భట్టి విక్రమార్కకు టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీ ఆవరణలోని సీఎల్పీ కార్యాలయం ముందు తారసపడిన భట్టి విక్రమార్కను కేటీఆర్ పలుకరించి అభినందించారు.

ప్రమాణం చేసిన రాజాసింగ్

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి చాంబర్‌లో శనివారం ప్రమాణం స్వీకరించారు. సభ నియమావళికి సంబంధించి కిట్ బ్యాగ్‌ను రాజాసింగ్‌కు స్పీకర్ అందించారు.

స్పీకర్‌గారూ.. వేములవాడకు రండి

మహాశివరాత్రి ఉత్సవాలకు రాజన్న దర్శనానికి రావాలని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి ఆహ్వానించారు.

సబ్ కా సాథ్ సబ్ కా వినాశ్



దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత అభివృద్ధి గణాంకాలతో ప్రజలను మోసగిస్తూ దుశ్చర్యలకు పాల్పడుతున్న మొదటి ప్రభుత్వం నరేంద్రమోదీ సర్కారే. రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసిన మోదీ ప్రభుత్వం దేశాన్ని తిరోగమన దిశలో నడుపుతున్నది. దేశాన్ని ఛిన్నాభిన్నం చేసి పరిపాలించాలన్నది భారతీయ జనతాపార్టీ వ్యూహంగా కనిపిస్తున్నది. కశ్మీర్‌లో కాల్పులు, అల్లర్లకు మోదీ ప్రభుత్వమే కారణం. దీర్ఘకాలం నుంచి నలుగుతున్న కశ్మీర్ సమస్య పరిష్కారం కోసం సంబంధిత అన్ని వర్గాలతో ప్రేమపూర్వక వాతావరణంలో చర్చించాలని సూచించినందుకు నన్ను పాకిస్థానీ ఏజెంట్‌గా చిత్రీకరించారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ అని మోదీ ప్రభుత్వం నినదించడం హాస్యాస్పదం. సబ్‌కా సాథ్ సబ్‌కా వినాశ్ అనే నినాదం మోదీ సర్కారుకు చక్కగా నప్పుతుంది.

– కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా

తిరుగుబాటు కాషాయ స్వరం

వాళ్లంతా ఒకప్పుడు కరడుగట్టిన కాషాయ నేతలు. కానీ ఇప్పుడు స్వరం మారింది. మాజీ ప్రధాని వాజపేయి హయాంలో కేంద్ర మంత్రులుగా పనిచేసిన యశ్వంత్‌సిన్హా, అరుణ్‌శౌరీ, శత్రుఘ్నసిన్హాలు తాజాగా విపక్షాల ఐక్యతా సభలో బీజేపీపైనే వాగ్బాణాలు సంధించారు.

నాడు లోకకల్యాణం.. నేడు తుగ్లక్ ఆదేశాలు



వాజపేయి హయాంలో లోకకల్యాణం జరిగితే మోదీ పాలనలో రాత్రికి రాత్రే తుగ్లక్ ఆదేశాలు వస్తున్నాయి. పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిన మోదీ సర్కారు.. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు ఒప్పందంతో దేశ పరువును మంటగలిపింది. కనుక మోదీ ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే. ఈ మాట అన్నందుకు నన్ను బీజేపీ నుంచి తొలగించినా భయపడను. మీరు నిజాలను అణగదొక్కితే కాపలాదారే దొంగ అని ప్రజలు అంటూనే ఉంటారు. దేశంలో కొత్త నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు మనమంతా కృషిచేయాలి'

– బీజేపీ అసంతృప్త ఎంపీ శత్రుఘ్న సిన్హా

బీజేపీని గద్దె దించేందుకు ఐక్యంగా కృషి



కేంద్రంలో బీజేపీని గద్దె దించాల్సిన అవసరమున్నది. ఈ విషయంలో మరో అభిప్రాయానికి తావులేదు. ఈ లక్ష్య సాధన కోసం విపక్షాలన్నీ సమిష్టిగా కృషిచేయాలి. ఇది తేలికైన పనేమీ కాదు. లోక్‌సభ ఎన్నికల్లో మనమంతా ఐక్యంగా వ్యవహరించి ఒకే మాటకు కట్టుబడి ఉండాలి. ప్రతి స్థానంలో బీజేపీ అభ్యర్థిపై ప్రతిపక్షాలు ఉమ్మడిగా ఒకే అభ్యర్థిని పోటీకి దింపగలిగితే విజయం మనల్నే వరిస్తుంది. ప్రధాని మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. ఇది అబద్ధాల ప్రభుత్వం. దేశంపై తన పట్టు సడలుతోందన్న విషయం మోదీకి తెలుసు. బీజేపీని గద్దె దించాలన్న మమతా బెనర్జీ పిలుపు విజయవంతమవుతుంది. విపక్షాల ఐక్యతను చాటేందుకు భారీస్థాయిలో ఈ బహిరంగ సభను నిర్వహించిన మమతా బెనర్జీకి అభినందనలు. ఇతర ప్రతిపక్షాలు కూడా ఇటువంటి సభలను నిర్వహించాలి.


– కేంద్ర మాజీ మంత్రి అరుణ్ శౌరీ

ఇక ఢిల్లీ రాజకీయాల్లోకి

- భారీ కటౌట్లతో మమత సందేశం
- దుర్గాదేవి రూపంలో దీదీ దర్శనం

కోల్‌కతా: విపక్షాల బహిరంగ సభకు ఆతిథ్యమిచ్చిన కోల్‌కతా వీధులన్నీ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ భారీ కటౌట్లు, పోస్టర్లతో నిండిపోయాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల బలాన్ని, ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ సభను నిర్వహించిన మమతా బెనర్జీ ఇకపై ఢిల్లీ రాజకీయాల్లో పెద్దపాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఈ కటౌట్లు, పోస్టర్ల ద్వారా సందేశమిచ్చారు. సభ కోసం పశ్చిమ బెంగాల్‌లో ఏర్పాటు చేసిన పలు పోస్టర్లు, కటౌట్ల చిత్రాలను తృణమూల్ కాంగ్రెస్ ట్విట్టర్‌లో పోస్టు చేసింది. బెంగాల్‌లో మమత ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రారంభించిన పథకాలను వివరిస్తూ వీటిని ఏర్పాటు చేశారు. వీటిలోని ఓ కటౌట్‌లో మమత పది చేతులతో కూడిన దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్రంలోని మొత్తం 42 స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమని సూచించేలా 42/42 అని రాసివున్న కిరీటాన్ని కటౌట్‌లో మమత తలపై అమర్చారు.





బ్రిగేడ్ సమావేశ్‌లో ఐక్యతా గీతాన్ని ఆలపిస్తున్న హార్దిక్ పటేల్, హేమంత్ సొరేన్, శత్రుఘ్న సిన్హా, యశ్వంత్ సిన్హా, స్టాలిన్, అఖిలేశ్ యాదవ్, కుమార స్వామి, చంద్రబాబు నాయుడు, ఫరూక్ అబ్దుల్లా, దేవెగౌడ, మమతా బెనర్జీ, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్, అరవింద్ కేజ్రీవాల్, శరద్ యాదవ్, అజిత్ సింగ్, సతీశ్ చంద్ర మిశ్రా

ప్రతిపక్షాల ఐక్యతా ర్యాలీతో జనసంద్రంగా మారిన కోల్‌కతా

- బీజేపీ హఠావో.. దేశ్ బచావో : మమత
- కమలనాథులు మళ్లీ గెలిస్తే దేశం విచ్ఛిన్నమే: కేజ్రీవాల్
- ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల, ప్రజల హక్కులను పరిరక్షించాయి: కుమారస్వామి
- సీనియర్ నాయకులతో సుపరిపాలనకు రోడ్‌మ్యాప్: దేవెగౌడ
- మనసులు కలవకున్నా.. చేతులు కలపాలి: ఖర్గే
- ఈవీఎంల వినియోగంపై నలుగురు సభ్యులతో విపక్షాల కమిటీ ఏర్పాటు

మోదీని దించుతాం..
దేశాన్ని కాపాడుతాం

కోల్‌కతా, జనవరి 19:

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, ప్రధాని మోదీని గద్దె దించుతామని పలు ప్రతిపక్ష పార్టీలు ప్రతినబూనాయి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ శనివారం 'బ్రిగేడ్ సమావేశ్' పేరిట కోల్‌కతాలోని బ్రిగేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రతిపక్షాల ఐక్యతా సభలో 22 పార్టీలకు చెందిన 20 మందికి పైగా నాయకులు పాల్గొన్నారు. పార్టీలు తమ మధ్యనున్న విభేదాలను పక్కనపెట్టి వచ్చే ఎన్నికల్లో సమైక్యంగా పోరాడాలని వారు నిర్ణయించారు. ప్రధాని అభ్యర్థిని ఎన్నికల తరువాత నిర్ణయించుకోవచ్చని తీర్మానించారు. ఎన్నికలకు ముందు ఇటువంటి భారీ సభలను మరిన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించారు. తదుపరి సభలను న్యూఢిల్లీ, ఏపీ రాజధాని అమరావతిలో నిర్వహించనున్నారు. ఈ సభలో ఒక మాజీ ప్రధాని, ముగ్గురు ముఖ్యమంత్రులు, ఆరుగురు మాజీ సీఎంలు, ఐదుగురు మాజీ కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ టాప్ నాయకులు రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ, బీఎస్పీ అధినేత్రి మాయావతి ఈ సభకు గైర్హాజరయ్యారు. అయితే ఈ రెండు పార్టీలు తమ ప్రతినిధులను మాత్రం సభకు పంపించాయి. బిజూ జనతాదళ్, సీపీఎం నేతృత్వంలోని వామపక్ష పార్టీలు ఈ మహాసభలో పాల్గొనలేదు. బీజేపీ మాజీ నేతలు యశ్వంత్ సిన్హా, అరుణ్‌శౌరి, బీజేపీ అసమ్మతి నాయకుడు, ఎంపీ శత్రుఘ్న సిన్హా కూడా ఈ సభలో పాల్గొనడం విశేషం. ఇంకా శరద్ యాదవ్, శరద్‌పవార్, కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ, ఆరెల్డీ నాయకుడు అజిత్‌సింగ్, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, పాటిదార్ ఉద్యమ నాయకుడు హార్దిక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌కు కాలం చెల్లింది: మమత

'దిల్లీ మే సర్కార్ బదల్ దో (ఢిల్లీలో ప్రభుత్వాన్ని మార్చండి)' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ కాల పరిమితి ముగిసిందని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో సమైక్య ప్రతిపక్షం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఎవరనేది ఎన్నికలు ముగిసిన తరువాత నిర్ణయిద్దామని అన్నారు. దేశంలో ఇప్పుడు 'సూపర్ ఎమర్జెన్సీ' ఉన్నది. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కంటే నేడు పరిస్థితులు ఘోరంగా ఉన్నాయి. మోదీ హయాంలో బ్యాంకులు, సీబీఐ, రిజర్వు బ్యాంకు, ఆర్థిక వ్యవస్థ, ప్రజాస్వామ్యం కోలుకోలేని రీతిలో దెబ్బతిన్నాయి. నిరర్థక ఆస్తులు, రాఫెల్, ఇన్సూరెన్స్ వంటి భారీ కుంభకోణాలు చోటు చేసుకున్నాయి. దొంగల తల్లికి నోరు పెద్దగా ఉంటుందని బెంగాలీలో సామెత ఉంది. బీజేపీకి ఇక అచ్ఛేదిన్ రావు. వారికిచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేశారు. బీజేపీ హఠావో.. దేశ్ బచావో' అంటూ మమత తన ప్రసంగాన్ని ముగించారు.

70 ఏండ్లలో పాక్ చేయలేనిది ఐదేండ్లలో మోదీ, అమిత్‌షా చేశారు: కేజ్రీవాల్

బీజేపీ మరోసారి అధికారానికి వస్తే దేశం విచ్ఛిన్నమవుతుందని ఢిల్లీ ముఖ్యమంత్రి,



సభకు హాజరైన భారీ జనసందోహం

ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రమాదకరమైన బీజేపీని ఓడించాల్సిందేనని ఆయన పిలుపునిచ్చారు. 'గత 70 ఏండ్లలో పాకిస్థాన్ చేయలేని దానిని ఐదేండ్లలో నరేంద్ర మోదీ, అమిత్ షా ద్వయం సాధించింది. దేశాన్ని ముక్కలు చేయాలని పాకిస్థాన్ కలలు కన్నది. బీజేపీ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా ముస్లింలను, ముస్లింలకు వ్యతిరేకంగా క్రైస్తవులను రెచ్చగొడుతూ పాకిస్థాన్ కలలను సాకారం చేస్తున్నది. మోదీ–అమిత్‌షా దేశాన్ని పాలించడం కొనసాగిస్తే.. వారు రాజ్యాంగాన్ని మార్చివేస్తారు. ఈ దేశంలో మరోసారి ఇక ఎన్నికలే జరుగకపోవచ్చు. జర్మనీలో హిట్లర్ పాలించినట్టుగా.. ఇక్కడ కూడా ఫాసిస్టు పాలన మొదలవుతుంది. నోట్ల రద్దుతో ఉపాధి అవకాశాలను దెబ్బతీశారు. విభజన రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలి. వచ్చే సార్వత్రిక ఎన్నికలు మరో కొత్త ప్రధాని కోసం కాకుండా.. మోదీని, ఆయన పార్టీని గద్దె దించడం కోసం జరుగాలి' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

అవినీతిపై పోరు.. బీజేపీ ఒట్టి మాటలు: కుమారస్వామి

అవినీతిపై పోరాడుతామని బీజేపీ చెప్పిన రోజునే ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బేరసారాలకు దిగిందని కర్ణాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ఆరోపించారు. 'ఈ నెల 11–12 తేదీల్లో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో అవినీతిపై పోరాడుతామని చెప్పారు. కానీ అదే రోజు కర్ణాటకలో బేరసారాలకు దిగారు. బీజేపీ ద్వంద్వ ప్రమాణాలకు ఇదే నిదర్శనం. ప్రజాస్వామ్యాన్ని నంబర్ల ఆటగా బీజేపీ మార్చివేసింది. ఎమ్మెల్యేలను సరుకు కింద జమకట్టింది. నేడు దేశంలో ఓ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని అప్రజాస్వామిక వ్యక్తులు నడుపుతున్నారు' అంటూ విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం దేశంలో ఎన్నో బలమైన ప్రాంతీయ పార్టీలు ఉద్భవించాయని, అవి తమ రాష్ట్రాలు, ప్రజల హక్కులను పరిరక్షించడంలో ప్రాముఖ్యమైన పాత్రను పోషించాయని కుమారస్వామి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలు అత్యంత సమీపంలో ఉన్నందున ప్రతిపక్ష పార్టీలు బీజేపీని సమైక్యంగా ఎదుర్కోవాలని మాజీ ప్రధాని, జనతాదళ్ (ఎస్) అధ్యక్షుడు హెచ్‌డీదేవెగౌడ పిలుపునిచ్చారు. 'సీనియర్ నాయకులతో ఒక చిన్న గ్రూపును ఏర్పాటు చేసి సుపరిపాలన అందించేందుకు ఒక రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేయాలి. లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపిణీ అనే అత్యంత కఠినమైన లక్ష్యాన్ని సాధించాలి. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు' అని మాజీ ప్రధాని ఉద్ఘాటించారు.

సీబీఐ, ఈడీతో బీజేపీ కూటమి: అఖిలేశ్

లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)తో కూటమి కడుతున్నదని సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు, ఉత్తర్ ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ ఎద్దేవా చేశారు. 'ప్రధాని పదవికి మా (ప్రతిపక్షాల) వద్ద చాలా మంది పోటీ పడుతున్నారని బీజేపీ విమర్శిస్తున్నది.. ఎవరు ప్రధాని కావాలన్నది ప్రజలు నిర్ణయిస్తారని మేం చెప్తున్నాం. మీ ప్రధాని (మోదీ) దేశాన్ని నిరుత్సాహపరిచారు. ఇప్పుడు మీ కొత్త ప్రధాని ఎవరో మీరు చెప్పాలి. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఎలా దుర్వినియోగం చేయవచ్చో మీరు నేర్పించారు. భవిష్యత్తులో ఇవే పరిస్థితులను ఎదుర్కోవడానికి మీరు కూడా సిద్ధంగా ఉండాలి. బీఎస్పీతో మా పొత్తు బీజేపీని కకావికలం చేసింది. యూపీలో కనీసం ఒక్క సీటైనా గెలిచేందుకు ఇప్పుడు బీజేపీ వ్యూహాలు రచిస్తున్నది' అని అఖిలేశ్ పేర్కొన్నారు.

వచ్చే ఎన్నికలు ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసమే : ఖర్గే

రానున్న లోక్‌సభ ఎన్నికలు ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం జరుగాలని లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. విపక్షాల బహిరంగ సభకు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ శుభాకాంక్షలు చెప్పారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన సోనియాగాంధీ సందేశాన్ని చదివి వినిపించారు. 'బీజేపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక, రాజకీయ సంస్థలు ధ్వంసమవుతున్నాయి. ప్రతిపక్షాలన్నీ ఐక్యం కాకపోతే.. మోదీ, అమిత్‌షా ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడాన్ని చూడాల్సి ఉంటుంది. గమ్యస్థానం దూరంగా ఉంది. దారి కఠినంగా ఉంది. అయినా మనం అక్కడికి చేరుకోవాల్సిందే. మన మనస్సులు కలవకపోయినా.. కనీసం చేయి చేయి కలిపి ముందుకు సాగాలి' అంటూ ఖర్గే అన్నారు.

రానున్న ఎన్నికలు.. రెండో స్వాతంత్ర్య పోరాటం: స్టాలిన్

వచ్చే లోక్‌సభ ఎన్నికలు రెండో స్వాతంత్ర్య పోరాటం వంటివని, ప్రజలందరూ ఈ పోరులో పాల్గొనాలని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. 'బీజేపీ వెదజల్లుతున్న హిందూత్వ అనే విషాన్ని నిలువరించాలి. హిందూ మతం పేరిట సాగిస్తున్న ఉన్మాదాన్ని అడ్డుకోవాలి. మోదీ మళ్లీ అధికారానికి వస్తే దేశం 50 ఏండ్లు వెనుకకు పోతుంది' అని స్టాలిన్ హెచ్చరించారు.

ఈవీఎంలు దొంగ యంత్రాలు: ఫరూక్ అబ్దుల్లా

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు 'చోర్ మెషిన్లు' అని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. పారదర్శకత కోసం మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అబద్ధాలకు ఉత్పత్తిదారుడు, హోల్‌సేల్ వ్యాపారి, డిస్ట్రిబ్యూటర్ అని రాష్ట్రీయ జనతాదళ్ నాయకుడు తేజస్వి యాదవ్ విమర్శించారు. పదుల సంఖ్యలో ప్రతిపక్షాలు ఏకం కావడం చూస్తే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మార్పు తథ్యమని తెలుస్తున్నదని దళిత నాయకుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని పేర్కొన్నారు.బీజేపీని ఈ దేశం నుంచి పెకిలించి వేయాలని జార్ఖండ్ ముక్తి మోర్చా నాయకుడు హేమంత్ సొరేన్ పిలుపునిచ్చారు.

ఎన్నికల సంస్కరణల కోసం విపక్షాల కమిటీ

ఈవీఎంలను బీజేపీ ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని విపక్ష పార్టీలు ఆరోపించాయి. కోల్‌కతాలో విపక్షాల ఐక్యతా సభ అనంతరం మమతాబెనర్జీ నివాసంలో నేతలంతా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల సంస్కరణల కోసం నలుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మమత ప్రకటించారు. ఈ కమిటీలో అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్), అఖిలేశ్ యాదవ్ (ఎస్పీ), సతీశ్‌మిశ్రా (బీఎస్పీ), అరవింద్ కేజ్రీవాల్ (ఆప్) సభ్యులుగా ఉంటారు. ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్‌ను మళ్లీ ప్రవేశపెట్టాలని మెజార్టీ విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈవీఎంల వినియోగంలో అక్రమాల నివారణకు ఈ కమిటీ పలు సూచనలు చేయనున్నది. అనంతరం వీటిని ఎన్నికల సంఘానికి సమర్పించనున్నారు.

అది ప్రజా వ్యతిరేక కూటమి

- దోపిడీని అడ్డుకున్నందుకే వారంతా ఏకమయ్యారు
- ప్రజాస్వామ్యాన్ని అణచివేసినవారే కాపాడాలంటూ పిలుపునివ్వడమా?
- ప్రతిపక్షాల కూటమిపై ప్రధాని మోదీ విమర్శలు

సిల్వస్సా (దాద్రా నగర్ హవేలీ), జనవరి 19: లోక్‌సభ ఎన్నికల ముంగిట బీజేపీకి వ్యతిరేకంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో బీజేపీయేతర పక్షాలన్నీ కోల్‌కతా వేదికగా సమరశంఖం పూరించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ ఆ పార్టీలపై ఎదురుదాడికి దిగారు. ఈ మహాకూటమి మోదీ వ్యతిరేక కూటమి కాదని, ప్రజా వ్యతిరేక కూటమి అని విమర్శించారు. దాద్రా నగర్ హవేలీ రాజధాని సిల్వస్సాలో శనివారం వైద్య కళాశాలకు శంకుస్థాపన చేసిన అనంతరం భారీ బహిరంగ సభను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'అవినీతికి వ్యతిరేకంగా నేను చేపట్టిన చర్యలు కొంతమందికి ఆగ్రహం కలిగించాయి. ప్రజా ధనాన్ని దోచుకోకుండా నిరోధించాను కాబట్టి వారికి కోపం రావడం సహజమే. ఇప్పుడు వారంతా మహాకూటమి పేరుతో ఏకమయ్యారు' అని మోదీ విమర్శించారు. కూటమి ఇంకా ఏర్పడక ముందే భాగస్వామ్య పక్ష నేతలంతా అప్పుడే ఎవరెవరికి ఏమేమి కావాలో బేరాలాడుతున్నారని ఎద్దేవా చేశారు. సొంత రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అణచివేసిన వారే ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని మమతా బెనర్జీపై మోదీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. బీజేపీ తలపెట్టిన రథయాత్రకు ప్రభుత్వం అనుమతి నిరాకరించడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లో ఒకే ఒక ఎమ్మెల్యే ఉన్న పార్టీ (బీజేపీ) అధికార పార్టీని నిద్రపోనివ్వడం లేదని... కేవలం ఒక్క ఎమ్మెల్యే ఉన్నా.. వారంతా బచావో.. బచావో అని కేకలు పెడుతున్నారని మోదీ వ్యాఖ్యానించారు. ఒకరినొకరు కాపాడుకునేందుకు విపక్ష పార్టీలన్నీ యత్నిస్తున్నాయన్నారు.

విపక్షాలది విరుద్ధ సిద్ధాంతాల వేదిక: బీజేపీ

విపక్షాల ఐక్యతా సభను వ్యక్తిగత ప్రయోజనాల, విరుద్ధ సిద్ధాంతాల వేదికగా బీజేపీ విమర్శించింది. దేశంలో మళ్లీ తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని విశ్వాసం వ్యక్తం చేసింది. 'ఇది మోదీకి వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమం... ఈ కూటమికి నాయకుడు ఎవరు?' అని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి రాజీవ్ ప్రతాప్ రూఢీ ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ శత్రుఘ్న సిన్హా సభకు హాజరవడంపై స్పందిస్తూ.. కొంతమంది బీజేపీ స్టాంప్ కొనసాగిస్తారని, అదే సమయంలో అవకాశవాదంతో వ్యవహరిస్తారని విమర్శించారు. ఈ విషయాన్ని పార్టీ పరిశీలిస్తుందన్నారు.



కే-9 వజ్ర సెల్ఫ్ ప్రొపెల్డ్ హోవిట్జర్ శతఘ్నిలో విహరిస్తున్న ప్రధాని మోదీ

గుజరాత్‌లో హోవిట్జర్ శతఘ్నుల తయారీ

- యూనిట్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- దేశంలోనే తొలి ప్రైవేట్ రంగ శతఘ్నుల తయారీ కేంద్రమిదే

హజీరా: దేశంలోనే మొట్టమొదటి ప్రైవేటు రంగ శతఘ్ని తయారీ కేంద్రాన్ని ప్రధాని మోదీ శనివారం గుజరాత్‌లో ప్రారంభించారు. సూరత్‌కు 30 కి.మీ. దూరంలోని హజిరాలో లార్సెన్ అండ్ టర్బో(ఎల్ అండ్ టీ) కంపెనీ నెలకొల్పిన ఈ కేంద్రంలో కే9 వజ్ర సెల్ఫ్ ప్రొపెల్డ్ హోవిట్జర్ శతఘ్నులను తయారు చేయనున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా 2017లో ఎల్ అండ్ టీ సంస్థ భారత రక్షణ శాఖ నుంచి రూ.4,500 కోట్ల విలువైన కాంట్రాక్టును దక్కించుకుంది. ఇందులో భాగంగా భారత సైన్యానికి 100 కే9 వజ్ర–టీ 155/ఎంఎం శతఘ్నులను ఎల్ అండ్ టీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే పదింటిని అందజేసింది. ఈ మేరకు శనివారం ఒక శతఘ్నిలో మోదీ కొద్దిసేపు విహరించారు. రక్షణ రంగంలో మేకిన్ ఇండియాకు ఊతమిచ్చేందుకు తాము ప్రయత్నిస్తున్నామని, ప్రైవేట్ రంగం కూడా ఇందులో భాగస్వామ్యం కావడం సంతోషకరమన్నారు. కే9 వజ్ర ఒప్పందంలో భాగంగా ఎల్ అండ్ టీ కంపెనీ 42 నెలల్లో 100 శతఘ్నులను సరఫరా చేయాల్సి ఉంటుంది. ఓ ప్రైవేట్ కంపెనీకి రక్షణ శాఖ అప్పగించిన అతిపెద్ద కాంట్రాక్ట్ ఇదే కావడం విశేషం. కార్యక్రమంలో రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్, ఎల్ అండ్ టీ గ్రూప్ చైర్మన్ ఏఎమ్ నాయక్ కూడా పాల్గొన్నారు. 50 టన్నుల బరువైన కే9 వజ్ర శతఘ్ని 47 కిలోల బరువైన బాంబులతో 43 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదని ఎల్ అండ్ టీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ జేడీ పాటిల్ వెల్లడించారు.

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం, 20 జనవరి 2019
WWW.NTNEWS.COM

ప్రాంతీయ పార్టీలదే ప్రాభవం

ఫెడరల్ ఫ్రంట్



ఎస్జీవీ శ్రీనివాసరావు

పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మమత బెనర్జీ శనివారం కోల్‌కతాలో నిర్వహించిన సభ దేశ రాజకీయాల్లో పెరిగిన ప్రాంతీయ పార్టీల ప్రాబల్యానికి నిదర్శనంగా నిలిచింది. ప్రాంతీయ పార్టీలే దేశాన్ని శాసించాలన్న ఫెడరల్ ఫ్రంట్ ప్రధాన ఆశయం ఈ సభలో ప్రతిఫలించింది. ఏ కూటమిలో భాగస్వామ్యం ప్రస్తావన లేకుండా ఈ సభ ప్రాంతీయ శక్తుల నేతృత్వంలో జరిగింది. ఒకనాడు జాతీయ పార్టీల ముందు సాగిలపడ్డ పరిస్థితి నుంచి ఇవాళ తమకు తామే స్వయంగా ఇరువై పార్టీలను సమీకరించుకోగల స్థాయికి ప్రాంతీయపార్టీలు ఎదిగిన వైనాన్ని ఈ సభ కళ్లకు కట్టింది. గతంలో ఇలాంటి సభలు నిర్వహించినా జాతీయ నాయకులే ప్రధాన ఆకర్షణగా సభ జరిగేది. ప్రధాన ప్రసంగాలు, సందేశాలు, నినాదాలు అంతా వారి హవా నడిచేది. ఇపుడా స్థానాన్ని ప్రాంతీయనాయకులే తీసుకున్నారు. అయితే కాంగ్రెస్ కూటమి లేదా బీజేపీ కూటమి అన్నట్టుగా ఇంతకాలం సాగిన రాజకీయానికి కూడా ఈ సభ ఫుల్‌స్టాప్ పెట్టింది. ప్రాథమికంగా బీజేపీకి వ్యతిరేకంగా జరిపిన సభ అని చెప్పుకున్నా ఎక్కడా కాంగ్రెస్ వైపు మొగ్గ గానీ అనుకూలతగానీ కనిపించలేదు. ఏ నాయకుడూ తాము కాంగ్రెస్ కూటమిగా ఉంటున్నట్టు లేదా ఉండబోతున్నట్టు ప్రకటించలేదు. అసలా పార్టీ పేరు కూడా ఎత్తలేదు. పైగా ప్రధాని అభ్యర్థి ఎవరనేది పక్కనపెట్టాలని నేరుగా వేదికపైన వినిపించింది. అంటే కూటమి లేదా నాయకత్వం విషయంలో రాజీ పడకూడదన్న భావన కనిపించింది. ఫెడరల్ ఫ్రంట్ భావజాలానికి ఇది తొలి విజయం. ప్రస్తుతానికి బీజేపీ వ్యతిరేక వైఖరి తీసుకున్నా.. కాలం గడిచేకొద్దీ ఇది కాంగ్రేసేతర బీజేపీయేతర కూటమి దిశగా అడుగులు వేసే అవకాశముంది.

అనేక సంకేతాలు..

మమత సభ దేశానికి అనేక సంకేతాలు పంపింది. కొన్ని సానుకూలమైనవి మరికొన్ని ప్రతికూలమైనవి. సభ బాగా జరిగింది. అనేకమంది నాయకులు వచ్చారు. పశ్చిమబెంగాల్‌లో మమత స్టామినా వెల్లడైంది. రేపటి జాతీయ రాజకీయాల్లో ఆమె విస్మరించరాని శక్తిగా మారిందని రుజువు చేసుకున్నారు. జాతీయపార్టీలను తనచుట్టూ తిప్పుకోగలనని రుజువు చేసుకున్నారు. బాగానే ఉంది. కానీ ఈ సభ దేశానికి ఏ సందేశం పంపించింది? ఇంతమంది నాయకులు ఒకచోట కూడి ప్రజలకు ఏం చెప్పారు? దేశానికి ప్రజలకు ఏం చేద్దామనుకున్నారు. భవిష్యత్ కార్యక్రమమేమిటి? ఈ విషయంలో స్పష్టత రాలేదు. అలాంటి సందేశమూ లేదు. ఈ విషయంలో రాజకీయంగా కొంత డొల్లతనం కనిపించింది. వ్యక్తులను విమర్శించేందుకో దింపేందుకో కూటమి కట్టడమనేది రాజకీయ భావ దారిద్ర్యం. అనేక దశాబ్దాలుగా ఇదే రాజకీయంగా చెలామణి అవుతూ వస్తున్నది. వ్యక్తులను టార్గెట్ చేస్తూ కూటములు కట్టడం అనేకసార్లు విఫలమైంది. ఎపుడో ఓసారి సఫలమైనా వచ్చిన కూటమి నాలుగుదినాలు నిలబడిన దాఖలాల్లేవు. అధికార పార్టీ మీద ఆగ్రహంతో వేసే ఓట్లతో అధికారంలోకి రావడం.. తిరిగి అలాంటి ఆగ్రహమే చవి చూసి దిగిపోవడం దేశ రాజకీయాల్లో పరిపాటి అయ్యింది. ఇదే ధోరణి మమత సభలో మరోసారి పునరావృతమైంది. అంతేతప్ప దేశాభివృద్ధి కోసం ఒక ఎజెండాను ప్రకటించలేకపోయింది. సీనియర్ నేత శరద్‌పవార్ నుంచి మఫ్లర్ హీరో కేజ్రీవాల్ వరకు తమ తమ విధానాల మీద కనీసం సూచనాప్రాయంగానైనా చెప్పలేకపోయారు. దశాబ్దాలుగా అధికారంలో ఉండి ప్రస్తుతం మాజీలైన వారు రైతుల గురించి నిరుద్యోగం గురించి ప్రస్తావించారు తప్ప ఆ సమస్యల పరిష్కారానికి ఏం చేస్తామనే అంశాన్ని విస్మరించారు. సభకు వచ్చిన లక్షల మంది జనం తమవెంట ఏ సందేశం తీసుకువెళ్లారని ప్రశ్నిస్తే చెప్పుకోడానికి ఏమీ కనిపించదు. మొత్తంగా దేశ రాజకీయాల్లో గుణాత్మక మార్పు రావల్సిన అవసరాన్ని ఈ సభ గుర్తుచేసింది.

ఫెడరల్ ఫ్రంట్...

ఫెడరల్ ఫ్రంట్ అంటే శూన్యమేనని మహా విజినరీ చంద్రబాబు తేల్చేశారు. కానీ శూన్యంలో అనంత విశ్వం ఉందని ఆ విశ్వంలో మనం భాగమని పాపం ఆయనకు తట్టినట్టు లేదు. ఏదోఒక వేదిక ఎక్కి నలుగురు నాయకులతో చేతులు కలిపి పళ్లికిలించి ఫొటోలకు ఫోజులివ్వడమే రాజకీయమని బాబు భావన కావచ్చు. బీజేపీ కాంగ్రెస్ ఫ్రంట్‌లే తప్ప మరో ఫ్రంట్ ఉండదనుకునే బాబుకు ఫెడరల్ ఫ్రంట్ కన్నా ముందే ఆ ఫ్రంట్ ప్రతిపాదించిన భావజాలం దేశ రాజకీయాలను ప్రభావితం చేయడం ప్రారంభించిందని తెలియకపోవచ్చు. శనివారం నాటి కోల్‌కతా సభలోనే అడుగులుపడ్డాయని ఆయన ఊహించి ఉండకపోవచ్చు. ఫ్రంట్ ఎజెండా కింద ఇప్పటికే కేసీఆర్ ప్రతిపాదించిన ప్రాంతీయ పార్టీల బలోపేతం అంశానికి మమత సభ తార్కాణంగా నిలిస్తే.. ఫ్రంట్ ఎజెండాలో ప్రముఖంగా ఉంటుందని చెప్పిన రైతుబంధు పథకాన్ని కేంద్రమే అమలు చేసే దిశగా అడుగులు వేసింది. పశ్చిమబెంగాల్ ఒడిషా అమలుచేస్తున్నాయి. అనేక రాష్ట్రాల్లో రైతులనుంచి, రైతు నాయకుల నుంచి రైతుబంధు అమలు డిమాండ్లు వస్తున్నాయి. అలాగే దేశంలో ప్రవహించే నదుల నీటి సద్వినియోగం అంశం చర్చనీయాంశంగా మారింది. ఇంటింటికీ నల్లా నీరు వంటి తెలంగాణ పథకాలు దేశంలో అనేక రాష్ట్ర ప్రభుత్వాలను ఆలోచింపజేస్తున్నాయి. దేశంలో వ్యవసాయ విధానం, ఆర్థిక విధానం అంశాల్లో మార్పు రావాలన్న ప్రతిపాదన మీద ఆర్థికవేత్తల్లో మేధోమథనం జరుగుతున్నది. ఫ్రంట్‌కు పూర్తి స్వరూపం రాకముందే దేశ రాజకీయాల మీద ప్రభావం చూపడం ప్రారంభమైంది.

దేశంలో గుణాత్మక మార్పు రావల్సిన అవసరం ఉన్నదనే నినాదంతో సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రతిపాదించారు. దేశం ముందు ఒక బృహత్తర ప్రణాళికను ఉంచేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల మూలాల్లోకి వెళ్లి శాశ్వత పరిష్కారాలు సూచించే దిశగా గత ఐదేండ్లుగా తెలంగాణ రాష్ట్రాన్నే పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలుచేశారు. ఈ పథకాలన్నీ ఫెడరల్ ఫ్రంట్ ఎజెండాలో భాగమే. దేశంలోని అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలుచేస్తున్నాయి. పూర్తిస్థాయి ఎజెండా రూపకల్పన జరిగి ఫ్రంట్‌కు ఒక స్వరూపం ఏర్పడిన తర్వాత దేశ రాజకీయ వ్యవస్థలో పెనుమార్పులే వస్తాయి.

కేసీఆర్ ప్రతిపాదనలో రెండు అంశాలు ప్రధానంగా ఉన్నాయి. ఒకటి కేంద్ర రాష్ట్ర అధికారాల సమీక్ష. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు. పాంతీయ శక్తుల బలోపేతం.

రెండోది పాలన విధానాల్లో సమూల మార్పు. డెబ్బై ఏండ్ల స్వాతంత్ర్య అనుభవంలో విఫలం చెం దిన విధానాలను మార్చడం. ఆర్థిక విధానం.. వ్యవసాయ విధానం మొదలుకొని విశాల దృక్పథంలో మానవీయ కోణంలో దేశం ఎదుర్కొనే సమస్యలన్నింటికీ శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించడం. ఈ అంశాల మీద విధి విధానాల రూపకల్పన జరుగుతున్నది.

అది ఉద్యమమైనా.. పాలన అయినా లక్ష్యసాధన కోసం చేపట్టే రోడ్‌మ్యాప్ రూపకల్పనకు కేసీఆర్ చాలా సమయం వెచ్చిస్తారు. సాధ్యాసాధ్యాల మీద అన్ని కోణాలను స్పృశిస్తారు. లెక్కకు మిక్కిలి సమీక్షలు జరుపుతారు. మార్పులు చేర్పులు చేస్తారు. ఏ కార్యాచరణ అయినా దానికి ముందు ఇదో సుదీర్ఘ మేథోమథనం. అందుకే ఆయన ప్రణాళికలు పథకాలు అంతగా విజయవంతమయ్యాయి. ఇపుడు ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు కూడా ఆ దారిలోనే ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు.

జాతీయం ..ప్రాంతీయం..

కోల్‌కతా సభలో మమత హిందీ ఇంగ్లీష్‌లోనూ ప్రసంగించడం చూస్తుంటే ప్రాంతీయ పార్టీలు జాతీయస్థాయికి ఎదుగుతున్నట్టు కనిపిస్తున్నదని ఓ సీనియర్ పాత్రికేయుడు వ్యాఖ్యానించారు. నిజమే.. ప్రాంతీయపార్టీలు జాతీయస్థాయికి ఎదుగడం కనిపిస్తున్నది. అదే సమయంలో జాతీయపార్టీలు కుంచించుకుపోతూ, ప్రాంతీయ పార్టీల ముందు సాగిలపడటం కనిపిస్తున్నది. అనివార్యం. దేశరాజకీయాలు ఇవాళ ఆ దిశగానే వెళ్తున్నాయి.

> అది ఉద్యమమైనా.. పాలన అయినా లక్ష్యసాధన కోసం చేపట్టే రోడ్‌మ్యాప్ రూపకల్పనకు కేసీఆర్ చాలా సమయం వెచ్చిస్తారు. సాధ్యాసాధ్యాల మీద అన్ని కోణాలను స్పృశిస్తారు. లెక్కకు మిక్కిలి సమీక్షలు జరుపుతారు. మార్పులు చేర్పులు చేస్తారు. ఏ కార్యాచరణ అయినా దానికి ముందు ఇదో సుదీర్ఘ మేథోమథనం. అందుకే ఆయన ప్రణాళికలు పథకాలు అంతగా విజయవంతమయ్యాయి.

సముద్రశక్తిగా భారత్

జాతీయం



క్రెయిగ్ జెఫ్రీ

ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాలో ఎనభై శాతం హిందూ మహా సముద్రం మీదుగానే సాగుతుంది. ఈ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యం కూడా ఈ మధ్య పెరుగుతున్నది. హిందూ మహా సముద్ర ప్రాంతంలో తమ ప్రమేయం పెరుగుతుందని, భారత్‌తో రక్షణ తదితర రంగాల్లో కలిసి పనిచేస్తామని ఆస్ట్రేలియా ఇటీవల ప్రకటించింది. ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి మారైజ్ పైనే ఇటీవల ఢిల్లీలో జరిగిన 'రైసీనా డైలాగ్' సమావేశంలో మాట్లాడుతూ భారత ఆస్ట్రేలియా భవిష్యత్తు పరస్పరం ముడిపడి ఉన్నది. వచ్చే దశాబాల్లో రెండు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్ళు, అవకాశాలపై సహకరించుకుంటాం అన్నారు. దక్షిణాసియా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆస్ట్రేలియా 25 మిలియన్ డాలర్లు అందిస్తుందని కూడా ఆమె వెల్లడించారు. రెండు దేశాల కార్యకలాపాలను కూడా ఆమె వివరించారు. భవిష్యత్తులో హిందూ మహాసముద్రానికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ ప్రసంగం సూచిస్తున్నది. ఆస్ట్రేలియా, భారత్, ఇండొనేషియా, బంగ్లాదేశ్, మడగాస్కర్, సోమాలియా, టాంజానియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యెమెన్ దేశాలు హిందూ మహా సముద్రాన్ని ఆనుకొని ఉన్నాయి. అంతర్జాతీయ రాజకీయాల విషయానికి వస్తే, అట్లాంటిక్ సముద్రం మన తాతల కార్యకలాపాలకు వేదిక అయితే, పసిఫిక్ సముద్రం మన తరానికి ప్రాముఖ్యం పొందింది. హిందూ మహా సముద్రం రాబోయే తరాలకు వేదిక కానున్నది. రాబోయే తరాల భౌగోళిక రాజకీయాలకు హిందూ మహాసముద్రం వేదిక కాబోతున్నదనే సూచనలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. ఈ ప్రాంత దేశాల్లోని ప్రజల సగటు వయసు ముప్పై ఏండ్లు. అమెరికా ప్రజల సగటు వయసు 38 కాగా, జపాన్ సగటు వయసు 46. హిందూ మహాసముద్ర దేశాల్లో మొత్తం జనాభా 250 కోట్లు. ఇది ప్రపంచ జనాభాలో మూడోవంతు.

హిందూ మహాసముద్ర ప్రాధాన్యం పెరుగుతుందని చెప్పడానికి అనేక ఆర్థిక, రాజకీయ కారణాలున్నాయి. ఆస్ట్రేలియా కూడా ఈ మహాసముద్రం ఎంతో ప్రాధాన్యం గలది. ఎనభై శాతం చమురు రవాణా ఈ సముద్రం మీదుగానే సాగుతున్నది. ఈ సముద్ర మార్గాలు కొన్ని కీలకమైన జలసంధుల గుండా సాగుతాయి. పర్షియన్ జలసంధికి ఒమన్ జలసంధికి మధ్య హోర్ముజ్ జలసంధి ఉన్నది. పర్షియన్ జలసంధి నుంచి సాగే రవాణా అంతా ఈ హోర్ముజ్ జలసంధిని దాటవలసిందే. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు ఆసియా దేశాల ఆర్థిక వ్యవస్థల మీద కన్ను వేశారు. దీంతో హిందూ మహాసముద్ర దేశాల ఆర్థిక వ్యవస్థలు వేగంగా విస్తరిస్తున్నాయి. ప్రపంచ సగటు ఆర్థికాభివృద్ధి 3.2 శాతం అయితే భారత్, బంగ్లాదేశ్, మలేషియా, టాంజానియా దేశాల వృద్ధి 5 శాతం. ఇక భారత్ అయితే ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ. భవిష్యత్తులో అత్యధిక జనాభా గల దేశంగా మారనున్నది.

రాజకీయంగా చూస్తే హిందూ మహా సముద్రం వ్యూహాత్మక పోటీకి వేదికవుతున్నది. చైనా వన్ బెల్ట్ వన్ రోడ్ పథకం కింద ఈ ప్రాం తంలో ప్రాజెక్టుల కోసం వందల బిలియన్ల డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నది. కెన్యాకు 470 కిలోమీటర్ల రైల్వే ప్రాజెక్టు కోసం 3.2 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చింది. గత యాభై ఏండ్లలో కెన్యాలో చేపట్టిన అతి పెద్ద ప్రాజెక్టు ఇది. ఈ రైలు మార్గం కెన్యా రాజధాని నైరోబీ నుంచి హిందూ మహాసముద్ర నగరమైన మొంబాసాను కలుపుతుంది. శ్రీలంక, మాల్దీవ్స్, బంగ్లాదేశ్‌లలో కూడా చైనా ప్రభు త్వ తోడ్పాటుగల సంస్థలు పెద్దఎత్తున మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ పరిణామాలకు పాశ్చాత్య దేశాలు అప్రమత్తమయ్యాయి. చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేసేందుకు అమెరికా, ఆస్ట్రేలియా మౌలిక వసతుల నిధిని సమకూర్చుతున్నాయి. డిజిటల్ ఎకానమీ, ఇంధనం, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం ఇటీవల 113 మిలియన్ డాలర్ల నిధులను అందజేశాయి. భద్రతాపరంగా కూడా హిందూ మహా సముద్రం కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంత దేశాలకు పలు ఇబ్బందులు తలెత్తాయి. సముద్రపు దొంగలు, నియంత్రణ లేని వలసలు, ఉగ్రవాద కార్యకలాపాలు సోమాలియా, బంగ్లాదేశ్, ఇండొనేషియా తదితర దేశాలకు తలనొప్పిగా మారాయి. ఈ ప్రాంత దేశాలు పరస్పరం సహకరించుకొని ఆర్థికంగా బలపడుతూ, భౌగోళిక రాజకీయ ప్రమాదాలను ఎదుర్కోవాలె. ఈ క్రమంలో ఈ ప్రాం తానికి భారత్ నాయకత్వ పాత్ర పోషించవలసి వస్తుంది. ఈ ప్రాంతంలో పెద్ద దేశం అంటే భారత్ మాత్రమే.

ప్రధాని నరేంద్ర మోదీ 2008లో షాంగ్రి లా డైలాగ్ వేదికపై చెప్పిన మాటలు గమనార్హమైనవి. ' ఇండో పసిఫిక్ విస్తృతమైన అవకాశాలకు, సవాళ్లకు వేదికగా మారింది. మన భవిష్యత్తు అంతా పరస్పరం ముడిపడి ఉన్నదని రోజులు గడిచేకొద్దీ నాకు తెలిసివచ్చింది' అని మోదీ అన్నారు. గత ప్రధానులతో పోలిస్తే మోదీ అనేక దేశాలు పర్యటించారు. ఆఫ్రికా ఆ కొస నుంచి ఈ కొస వరకు తిరిగారు. భారత్– ఆఫ్రికా దేశాల మధ్య సహకారం పెంచేందుకు, వాణిజ్య పెట్టుబడులు పెంచడానికి కృషిచేశారు. హిందూ మహా సముద్రం చుట్టూరా ఏ ప్రాంతానికి ఆ ప్రాంతంలోని దేశాలు ఒక కూటమిగా ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు బంగాళాఖాతం తీరంలోని దేశాలు బిమ్‌స్టిక్ పేర కూటమిగా అవతరించాయి. వీటి మధ్య వాణిజ్య ఒప్పందాల కోసం చర్చలు సాగుతున్నాయి. ఆస్ట్రేలియా మరో 21 దేశాలు కలిసి ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్ పేర ఒక కూటమిగా ఏర్పడ్డాయి. ఆర్థిక అభివృద్ధి, భద్రత అంశాలపై చర్చలు సాగుతున్నాయి. అయితే భారత్ ఇంధనపరంగా సంస్థాగతంగా వృద్ధి చెందుతున్నప్పటికీ, అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర దేశాల మధ్య తోడ్పాటుతో పోలిస్తే హిందూ మహా సముద్ర దేశాల మధ్య సహకారం ఇంకా తక్కువగానే ఉన్నది.

(ది వైర్ సౌజన్యంతో)

> చైనా ప్రాబల్యాన్ని కట్టడి చేసేందుకు అమెరికా, ఆస్ట్రేలియా మౌలిక వసతుల నిధిని సమకూర్చుతున్నాయి. డిజిటల్ ఎకానమీ, ఇంధనం, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం ఇటీవల 113 మిలియన్ డాలర్ల నిధులను అందజేశాయి. భద్రతాపరంగా కూడా హిందూ మహా సముద్రం కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంత దేశాలకు పలు ఇబ్బందులు తలెత్తాయి. సముద్రపు దొంగలు, నియంత్రణ లేని వలసలు, ఉగ్రవాద కార్యకలాపాలు సోమాలియా, బంగ్లాదేశ్, ఇండొనేషియా తదితర దేశాలకు తలనొప్పిగా మారాయి.



కోల్‌కతా ప్రతిపక్ష ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగానికి అందరికన్నా ఎక్కువ స్పందన వచ్చింది. బెంగాలీ, హిందీ, ఇంగ్లిష్ కలగలిపి మాట్లాడారు. దీనివల్ల తెలుస్తున్నదేమిటి? ఇది ప్రాంతీయ నాయకుల జమానా!

రాజ్‌దీప్ సర్దేశాయి



స్మృతి ఇరానీ సిద్ధాంతం! 'తప్పుడు కేసులు బనాయించడం, బెయిల్ నిరాకరించడం, లాకప్‌లో వేయడం, ప్రతిపక్షాల నోరు మూతపెట్టడం. ఆహా ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి! ఆరోపణలు వచ్చినప్పుడు, బెయిల్ ఇవ్వడమే నిబంధన అని, నిరాకరించడం అరుదుగా జరుగుతుందని ఎప్పుడు తెలుస్తుందో!

పి.చిదంబరం



వెల్‌డన్ గూకేశ్.. చదరంగంలో అతిచిన్న వయసులో చరిత్ర సృష్టించావు. అతిచిన్న వయసులో గ్రాండ్ మాస్టర్ కావడంలో దేశంలో మొదట, ప్రపంచంలో రెండవ స్థానంలో నిలిచావు. నీ విజయం మాకు గర్వంగా ఉన్నది. భవిష్యత్తులో ఇంకా రాణించాలని ఆకాంక్ష.

అశోక్ గెహ్లోట్



గ్రేట్ సిరీస్ విజయం!
మొత్తం టీమ్ చక్కగా ఆడింది.
టూర్‌ను ఎంతో ఎంతో ఉన్నతంగా ముగించడం చాలా సంతోషం..
జై హింద్.

విరాట్ కోహ్లీ

సృజనశక్తిని పెంచేదే విద్య

విశ్లేషణ



ప్రొఫెసర్
కనకదుర్గ దంటు

తెలంగాణ రాష్ట్రం అనేక విషయాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ నేపథ్యంలోనే అతి ముఖ్యమైన విద్యారంగంలో సమూల, సమగ్ర మార్పులు చేయవలసిన అవసరం ఉన్నది. మిగతా రంగాలకు, విద్యారంగానికి ఒక మౌలికమైన భేదం ఉన్నది. వ్యవసాయం, వైద్యం వంటివి స్థానిక ప్రాంతీయ, భౌగోళిక, వాతావరణ పరిస్థితులను అనుసరించి సాగుతాయి. కానీ విద్య అనేది మానవ వనరులను పెంపొందించేది కనుక ఇతర రాష్ట్రాలతో దేశాలతో సంబంధాలు నెలకొల్పి, సాగించే సాధనం కనుక ప్రపంచంలో జరుగుతున్న మార్పులకు, కాలానికి అనుగుణంగా దేశీయ పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ఈ రంగాన్ని తీర్చిదిద్దాలి. ముఖ్యంగా భాషా విధానాన్ని రూపొందించటంలో కేంద్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయి. దాని ఫలితంగా ఇప్పుడు దేశంలోని విద్యావంతులకు కూడా మాతృభాష రాదు, పర భాష ఇంగ్లీషూ రాదు. వారివారి నేపథ్యాన్ని బట్టి, పట్టుదల బట్టి కొందరికి తప్ప!

ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం విద్యారంగంలో కొన్ని మౌలికమైన మార్పులు చేస్తే మిగితా పథకాల లాగా దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది మన రాష్ట్రం. ఈ సమూల మార్పులు ప్రాథమిక దశ నుంచీ పరిశోధనా దశ దాకా చేయవలసి ఉన్నది. అన్ని స్థాయిలలో అవసరమైన మార్పులు చేస్తే విద్యార్థులలో కింది స్థాయి నుంచీ ఆలోచనా బలం, భావనా పటిమ, ఊహాశక్తి, సృజన శక్తి పెరిగి వారి విజయానికి తోడ్పడుతాయి.

ప్రాథమిక దశ: ఇది పై స్థాయిలలో విజయానికి పునాది వంటిది. 5వ తరగతి పూర్తయ్యేసరికి 10, 11ఏండ్ల వయస్సు వచ్చే విద్యార్థులకు స్వభావం, ఆలోచనా సరళి, చిత్తవృత్తులు, భావాలు, ప్రపంచం, చుట్టుపక్కల మనుషుల పట్ల ప్రవర్తన మొదలైనవన్నీ ఏర్పడిపోతాయి. ఈ సమయంలో వారు ఆహ్లాదకరమైన వాతావరణంతో, ప్రేమాభిమానాలు చూపించే మనుషుల మధ్య పెరిగితే జీవితం పట్ల, ప్రపంచం పట్ల సకారాత్మక భావాలు, మానవీయత ఏర్పడి క్రమంగా పెరుగుతాయి. దీనికితోడు శారీరకంగా సున్నితంగా ఉంటారు కాబట్టి రక్షణ కూడా వారికి చాలా అవసరం. మనసుమీద, బుద్ధి మీద ఒత్తిడి కలిగించని వాతావరణం ఉండాలి.

తెలంగాణలో స్వయం పాలన మొదలయ్యాక అంగన్‌వాడీలు బలపడ్డాయి. 1వ తరగతిలో ప్రభుత్వ పాఠశాలలో చేరేవరకు చిన్నపిల్లలు రెండేండ్ల నుంచి ఈ అంగన్‌వాడీల్లో ఉంటారు. ఈ సెంటర్లలో 10వ క్లాసు, ఇంటర్ అంతకంటే పైకి చదివిన వారెవరైనా ఉంటే వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి 3 నుంచి 5 ఏండ్ల పిల్లలకు మాటలు, కథలు చెప్పటం వంటివి చేస్తే చిన్న పిల్లలకు ఏకాగ్రత, ఇతరులు మాట్లాడినవి విని అర్థం చేసుకునే నైపుణ్యాలు అలవడుతాయి. ఇతర పిల్లలతో స్నేహంగా, సఖ్యంగా ఉండటం నేర్పించాలి. అది వారు పెరిగాక సామాజిక జీవితంలో పనికివస్తుంది. వారువాడే వస్తువుల, చూసే జంతువుల, చెట్ల బొమ్మలేయడం, వాటికి రంగులేయడం నేర్పిస్తే వారి పరిశీలనాశక్తి, కళా నైపుణ్యాలు పెరుగుతాయి. తమ గురించి వారు ఆలోచించడం మొదలుపెడుతారు. ఈ రకమైన నైపుణ్యాలు పెంచడం వల్ల వారు తర్వాతి స్థాయి అయిన 1వ తరగతికి వెళ్లినప్పుడు స్పష్టంగా ఆలోచించటం, మాట్లాడటం వచ్చేస్తుంది. ఇలా శిక్షణ సాగటానికి బోధించేవారికి ప్రత్యేకంగా శిక్షణనివ్వాలి. పిల్లలు ఇంటి నుంచి బరువులేమీ తేకూడదు. ప్రతి పిల్లవానికి ఒక నోటు పుస్తకాన్ని పెట్టి వారు రోజూ నేర్చుకుంటున్నవి అందులో బోధకులే రాయాలి. ఇక ఈ పిల్లలకు 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ఈ ఆటలు పాటల ద్వారా బోధన పూర్తిచేసి, బోజనానంతరం 2 నుంచి 4 దాకా నిద్రపుచ్చి, 4 నుంచి 5.30 దాకా ఆడిస్తే పనులకు వెళ్లే వారి తల్లిదండ్రులకు సౌకర్యంగా ఉంటుంది.

ఇక దీనికి పైస్థాయి అయిన ప్రాథమిక దశ 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగుతుంది. ఈ స్థాయిలో పిల్లలకు భాషలు నేర్చుకునే శక్తి అధికంగా ఉంటుంది. కాబట్టి మూడు భాషలు (మాతృభాష, రాష్ట్ర భాష, ప్రపంచ భాష వాటితో పాటు లెక్కలు బోధించాలి. మాతృభాష తెలుగు అయితే రాష్ట్ర భాష హిందీ ఉండాలి. బంజారా, కోయ, గోండు వారికి వారి వారి మాతృభాషలు నేర్చుకునే వెసులుబాటు కల్పించాలి. హిందీ బదులు తెలుగు ఉండాలి. దీని వల్ల రెండు లాభాలున్నాయి. ప్రతి విద్యార్థికి తమ మాతృభాష చదివే అవకాశం, ప్రభుత్వ ఉద్యోగం కోసం కావలసిన తెలుగు/ ఉర్దూ కూడా చదువుకోవడం. 6వ తరగతి నుంచి తెలుగు/ఉర్దూతో పాటు తమ మాతృభాషతో పాటు హిందీ కూడా బోధించవచ్చు.

భాషా బోధన ప్రాథమిక దశలో రకరకాల కథల ద్వారా చేసే ప్రక్రియను అభివృద్ధి చెందిన దేశాలైన నార్వే, ఫిన్‌లాండ్, స్వీడన్, స్విట్జర్‌లాండ్, డెన్మార్క్ ఉపయోగిస్తాయి. దినచర్యకు సంబంధించిన సంభాషణలు ఉపయోగిస్తూ చిన్న పిల్లలకు ఆయా భాషలు సులువుగా వచ్చేటట్టు చేస్తారు. కథలు చెప్పటం ద్వారా వినికిడి, ఆ తర్వాత వాటిని వారి అవగాహన బట్టి రాయించటం ద్వారా ఊహాశక్తి, పదాలు, వాక్యాల కూర్పు అలవడుతాయి. భాషలు ఎప్పుడూ అవసరాన్ని బట్టి నేర్చుకోవటం, వాటిని రోజూ వాడటం ద్వారా వస్తాయి, వృద్ధి చెందుతాయి. ఈ కథలు కూడా నిడివి పెంచుతూ చెప్పడం వల్ల తేలికగా చదువటం అలవాటవుతుంది. ఇలా ఐదేండ్లు మూడు భాషలు నేర్చుకోవటం, ఉపయోగించటం వల్ల ఆయా భాషల నిపుణత్వాలన్నీ పట్టుబడుతాయి. చిన్నతనంలోనే వారేమైనా తప్పులు చేస్తే దిద్దటం వల్ల సరైన భాషా ప్రయోగాలు అలవడుతాయి. ఇక 6వ తరగతి నుంచి ఏ మాధ్యమంలో ఆ విద్యార్థులు చదువు కొనసాగించినా, సామాన్య, సామాజిక శాస్త్రాల వంటివి తేలికగా అర్థం చేసుకోవడమే గాక, రాయగలుగుతారు. అందుకే 5వ తరగతి దాకా పాఠ్యాంశాలు ఏవి ఉన్నా భాష మీదే ఉపాధ్యాయులు దృష్టిపెడితే పై స్థాయిల్లో చదువు తేలికవుతుంది.

ఇక ఐదు క్లాసులకీ కూడా మూడు భాషలు, లెక్కలు 9 గంటల నుంచి 1గంట దాకా గంట చొప్పున బోధించి భోజన సమయమయ్యాక ఇతర నైపుణ్యాలు, మానసిక పెరుగుదల మీద దృష్టిపెట్టాలి. ఈ స్థాయిలో 2 నుంచి 3 దాకా రెండురోజులు ఒక భాషలో వారి స్థాయి కథలు చదివించాలి. వారు విన్న కథలైనా చదివే అలవాటు చేయాలి. 3 నుంచి 4 గంటల దాకా సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి లలిత కళలు నేర్పాలి. ఇవి కూడా రెండు రోజులు ఒకటి చొప్పున నేర్పి అభ్యాసం చేయించాలి. కళా దృష్టి పెరుగుతున్న కొద్దీ మనిషిలో కరుకుదనం, నేర ప్రవృత్తి తగ్గుతుందని శాస్త్రీయ పరిశోధనల ద్వారా నిరూపితమైంది. పైగా రోజంతా చదువే కాకుండా పిల్లలకు ఇతర అంశాల పట్ల కూడా అవగాహన, ఉత్సుకత పెరుగుతాయి. తర్వాత 4 నుంచి 5.30 దాకా ఆటలు ఆడిస్తే మానసిక ఉల్లాసంతో పాటు వారి ఆరోగ్యం, శరీర దారుఢ్యం బాగుంటాయి. ఎదుగుదల బాగుంటుంది. ఇక అసలు సమస్య స్కూల్ బ్యాగు బరువు. దీనికి చాలా తేలిక పరిష్కారం ఉంది. పిల్లల టెక్స్ట్ పుస్తకాలు, క్లాసు పుస్తకాలు వారి వారి క్లాసుల్లోనే ఉంచి కేవలం హోంవర్కు పుస్తకాలు 4, ఒక స్కూల్ డైరీ ఇంటికి పంపించాలి. హోంవర్క్ కూడా పుస్తకాల్లో ఉన్నదే చూసి రాసేటట్టు కాకుండా విన్న అంశాలకు ఊహాశక్తి జోడించి జవాబులు రాసేటట్టు ఇస్తే వారిలోని నైపుణ్యాలు బయటకు వస్తాయి. స్వయంగా ఆలోచించి రాయటం అలవాటవుతుంది.ఈ రకమైన బోధన నేడు జరుగకనే విద్యార్థులకు కంఠస్థం చేయటం అలవాటవుతుంది. ఎప్పుడైతే కేవలం జ్ఞాపకశక్తి మీదే ఆధారపడుతారో, అప్పుడు వారి భావనాశక్తి దెబ్బతిని సృజనాత్మకత అంతరిస్తుంది. ఇది లేకనే ఇప్పుడు మన పట్టభద్రుల్లో కూడా కావలసిన నైపుణ్యాలు కొరవడుతున్నాయి. గుర్తుపెట్టుకోవడం మాత్రమే కాదు, నేర్చుకున్న అంశాలు జీవితంలో ఉపయోగించగలిగిన నైపుణ్యాలు సంతరించుకోవటమే విద్య. చదివింది జ్ఞానంగా వారి జీవితానికి ఉపయోగపడేదే అసలైన విద్య. ప్రాథమిక దశలో భాషలు మాత్రమే నేర్పించాలన్నది రెండు శాస్త్రీయ సిద్ధాంతాల మీద ఆధారపడి చెప్పడం జరిగింది. ఒకటి: భాషలు నేర్చుకునే నైపుణ్యం చిన్నతనంలో ఎక్కువగా ఉండి 14 ఏండ్ల నుంచి క్రమంగా తగ్గుతుంది. అందుకే భవిష్యత్తులో కావలసిన భాషలు (ముఖ్యంగా మాతృభాష, ఇంగ్లీషు) చిన్నప్పుడే నేర్పించాలి. రెండు: భాషా పటిమ లేని విద్యార్థులకు (5వ తరగతి కంటే ముందు) వస్తు సంబంధమైన సామాన్య, సామాజిక శాస్త్రాలు నేర్పకూడదు. విన్న విషయం అర్థం చేసుకొని రాయగలిగినప్పుడే అవి బోధించాలి.

చదువు అన్నది ఒత్తిడి కలిగించకుండా ఉల్లాసంగా సాగాలి. అప్పుడు పిల్లలకు తమంతట తామే చదువాలన్న ఉత్సాహం, చదివే శక్తి కలుగుతాయి. ముఖ్య విషయం ఏమంటే విద్యారంగంలో ఎన్ని వసతులు, సేవలు, హంగులు అమర్చినా రెండే అంశాలు అతి ముఖ్యం. బోధించేవారి నిబద్ధత, నేర్చుకునేవారి ఉత్సుకత. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ అందించి, సరైన పాఠ్యాంశాలు కూర్చగలిగితే ఈ రెండు అంశాలు సాధ్యమే! ప్రముఖ అమెరికన్ భాషా వేత్త నోమ్ చామ్‌స్కీ ఇలా అంటాడు. 'మనిషిలో అన్ని నైపుణ్యాలనీ నిర్ణయించేది అతని భాషా నైపుణ్యమే!' ప్రాథమిక దశలో విద్యార్థులకు ఇది అందించగలిగితే ప్రతి విద్యార్థి ఇతర అన్ని నైపుణ్యాలు కూడా సంతరించుకుంటాడు.

> చదువు అన్నది ఒత్తిడి కలిగించకుండా ఉల్లాసంగా సాగాలి. అప్పుడు పిల్లలకు తమంతట తామే చదువాలన్న ఉత్సాహం, చదివే శక్తి కలుగుతాయి. ముఖ్య విషయం ఏమంటే విద్యారంగంలో ఎన్ని వసతులు, సేవలు, హంగులు అమర్చినా రెండే అంశాలు అతి ముఖ్యం. బోధించేవారి నిబద్ధత, నేర్చుకునేవారి ఉత్సుకత. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ అందించి, సరైన పాఠ్యాంశాలు కూర్చగలిగితే ఈ రెండు అంశాలు సాధ్యమే!

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, మర్రి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పీ రాములు



జామాడకు చేరిన గంగాజల యాత్ర

నార్నూర్: మెస్రం వంశీయుల గంగాజల సేకరణ యాత్ర శుక్రవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం జామాడకు చేరుకున్నది. గ్రామానికి చేరుకున్న మెస్రం వంశీయులకు ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి భోజనాలు ఏర్పాటు చేసి.. వారికి కానుకలు అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో ఫిబ్రవరి 4న నాగోబా జాతర ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ జాతరలో భాగంగా నిర్వహించే మహాపూజకు ఉపయోగించే పవిత్రమైన గంగా జల సేకరణకు మెస్రం వంశీయులు 16న పాదయాత్ర ప్రారంభించారు. మెస్రం వంశీయులు కాటోడ హన్మంత్‌రావు, కోసు కాటోడ, జాడియాల్ పోల్లు, వాడే జంగు, కోత్వాల్ రవి తదితరులు పాదయాత్ర నిర్వహిస్తున్నారు.



నామకరణోత్సవంలో పాల్గొన్న టీఆర్ఎస్ నాయకులు

అభిమానం చాటుకున్న టీఆర్ఎస్ నాయకుడు

కుమారుడికి 'తారకరామ'గా నామకరణం

ముస్తాబాద్: టీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు తన కుమారుడికి 'తారకరామ'గా నామకరణం చేసి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్‌కు చెందిన టీఆర్ఎస్ నాయకుడు, కేటీఆర్ వీరాభిమాని అయిన తినేటి దినేశ్‌రెడ్డికి ఇటీవల కుమారుడు జన్మించాడు. శనివారం నామకరణోత్సవం నిర్వహించడంతో తన కుమారుడికి కేటీఆర్ పేరు స్ఫురించేలా తారకరామారెడ్డిగా పేరు పెట్టారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఏనుగు విజయరామారావు, టీఆర్ఎస్ నాయకులు నేవూరి పోచిరెడ్డి, నిమ్మ రాజిరెడ్డి, తినేటి అంజిరెడ్డి, గంత అంజయ్య పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా ఊట్కూరు మండలం పులిమామిడిలో సర్పంచ్ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి మద్దతుగా ప్రచారంలో మాట్లాడుతున్న మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం



నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు



నల్లగొండ జిల్లా కమలాపురంలో మాట్లాడుతున్న దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ప్రగతికే పట్టంకట్టండి

- టీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించండి
- పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ నాయకుల వినతి

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: స్థానిక పోరులో ప్రగతికే పట్టం కట్టాలని ఎమ్మెల్యేలు, టీఆర్ఎస్ నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొదటి విడుత ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన శనివారం పలుచోట్ల ప్రచారం నిర్వహించారు. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గాజీపూర్, బుద్దారం, బండపల్లి, తాండూరు మండలం అంతారం, కోటబాస్పల్లి గ్రామాల్లో శనివారం మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో తండాలు పంచాయతీలుగా ఏర్పడ్డాయన్నారు. 'మా తండా, మా పాలన' అన్న నినాదం త్వరలో నెరవేరబోతున్నదన్నారు. తొలివిడతగా ఎన్నికలు జరుగుతున్న తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని రెండు నియోజకవర్గాల్లో కలిపి 200కు పైగా సర్పంచ్ స్థానాల్లో టీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందుతారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం రుద్రసముద్రం, గుడిగండ్ల, నర్వ మండల కేంద్రంతోపాటు పెద్ద కడుమూర్, లంకాల, రాయికోడ్, ఊట్కూరు మండలం పులిమామిడి, కొల్లూరు



వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి

గ్రామాల్లో టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతుగా మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ప్రచారం చేశారు. రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం రావాలంటే టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల, బల్మూరు మండలాల్లో అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను చూసి పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో

గ్రామ స్వరాజ్యం

అధికారంలో ఉన్న టీఆర్ఎస్ మద్దతుదారులకు ఓటేయాలని అభ్యర్థించారు. తన నియోజకవర్గంలో 42 పంచాయతీలు ఏకగ్రీవం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కమలాపురంలో టీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి రేపని ఇద్దయ్య, పడ్మట్‌పల్లి సర్పంచ్ అభ్యర్థి కొమ్ము రామస్వామి, కొమ్మేపల్లి అభ్యర్థి చింతపల్లి సంధ్యాసుభాష్, ఇద్దంపల్లి అభ్యర్థి లోకసాని సరిత శ్రీనివాస్ రెడ్డి తరపున నిర్వహించిన ప్రచారంలో దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగిరేలా ఓటర్లు టీఆర్ఎస్ అభ్యర్థులను ఆదరించాలని కోరారు. సీఎం కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని, టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిస్తే ఆయా గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

సర్పంచ్ బరిలో పిన్న వయస్కులు

రెండు గ్రామాల్లో పోటీలో నిలిచిన యువతులు



అనూష



లలిత

చివ్వెంల/ కనగల్: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని రెండు పంచాయతీలకు ఇద్దరు యువతులు చిన్న వయసులోనే సర్పంచ్‌లుగా బరిలో నిలిచారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆసక్తికరమైన పోటీ నెలకొన్నది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం వట్టి ఖమ్మంపహాడ్ పంచాయతీ ఎస్సీ మహిళకు రిజర్వేషన్ కావడంతో గోగుల అనూష (21) సర్పంచ్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. గ్రామంలో అత్యధికుల మద్దతు తనకే ఉన్నదని అనూష ధీమా వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కనగల్ మండలకేంద్రానికి చెందిన పాలకూరి లలిత (22) గురువారం సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. లలిత తండ్రి సైదులు టీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శిగా కొనసాగుతున్నారు. రిజర్వేషన్లలో భాగంగా కనగల్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో బీటెక్ పూర్తిచేసిన లలిత సర్పంచ్ అభ్యర్థిగా తండ్రి ప్రోత్సాహంతో బరిలో నిలిచారు.

సర్పంచ్ పోటీలో ఓయూ గోల్డ్‌మెడలిస్ట్

సంగారెడ్డి జిల్లా వావిలాల నుంచి బరిలో సుశాంతి



పట్లోళ్ల సుశాంతి

జిన్నారం: సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం వావిలాల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఓయూ గోల్డ్ మెడలిస్ట్ పట్లోళ్ల సుశాంతి పోటీచేస్తున్నారు. 1997-99 సంవత్సరంలో ఆమె ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీని పూర్తిచేసి గోల్డ్‌మెడల్ సాధించారు. ప్రస్తుతం హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. సుశాంతి భర్త నవనీత్‌రెడ్డి గత పంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా గెలుపొంది, వావిలాల ఉపసర్పంచ్‌గా పనిచేశారు. గ్రామ సమస్యలపై పూర్తి అవగాహనతో ఉన్నదని.. సర్పంచ్‌గా గెలిపిస్తే ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సుశాంతి చెప్పారు.

భార్య సర్పంచ్.. భర్త వార్డు సభ్యుడు

బోజేర్వులో దంపతుల ఏకగ్రీవం





దంపతులు విజయ, భిక్షపతి

చెన్నారావుపేట: వరంగల్ రూరల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోజేర్వు గ్రామంలో భార్య సర్పంచ్, భర్త వార్డు సభ్యుడిగా ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడో విడుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా భార్య, భర్తలిద్దరూ నామినేషన్ వేశారు. శుక్రవారం నామినేషన్లకు చివరి రోజు కావడంతో సర్పంచ్ అభ్యర్థిగా పిండి విజయ, 3వ వార్డు నుంచి పిండి భిక్షపతి సింగిల్ నామినేషన్ వేశారు. దీంతో వీరిద్దరి ఎన్నిక ఏకగ్రీవమైంది. అటు భార్య విజయ సర్పంచ్‌గా ఇటు భర్త భిక్షపతి 3వ వార్డు సభ్యుడిగా ఎన్నిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంకారంలో నాలుగోవార్డుకు నామినేషన్లు నిల్

చెన్నూర్, నమస్తే తెలంగాణ: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం సంకారం గ్రామ పంచాయతీలోని నాలుగో వార్డుకు ఒక్కరు కూడా నామినేషన్ వేయలేదు. దీంతో ఆ వార్డుకు ఎన్నికలు జరగడం లేదు. ఈ గ్రామ పంచాయతీకి రెండో విడుతలో ఎన్నికలు జరుగుతున్నాయి. 4వ వార్డు(ఎస్టీ జనరల్) మినహా సర్పంచ్, మిగితా వార్డులకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సర్పంచ్ పదవితోపాటు మిగితా 7వార్డులకు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే నాలుగో వార్డుకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంతో ఇక్కడ ఎన్నిక జరగడం లేదు. ఖాళీగా ఉన్న ఈ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడకు చెందిన 50 మంది శనివారం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వీరికి భువనగిరి ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - మర్రిగూడ



నిజామాబాద్ నగరంలో శనివారం టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ రాంకిషన్‌రావు సమక్షంలో గాంధీనగర్‌కు చెందిన 100 మంది కాంగ్రెస్ నాయకులు టీఆర్ఎస్‌లో చేరారు. - నవీపేట

పల్లెపోరులో కలిసికట్టుగా..

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఐక్యతారాగం
- రెండు విడుతల్లో 254 పంచాయతీలు ఏకగ్రీవం
- మూడో విడుతలో 74 జీపీలకు సింగిల్ నామినేషన్లు

యాతాలం చిన్నారెడ్డి, నిర్మల్ నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాల జోరు కొనసాగుతున్నది. ఇందుకోసం పల్లెలు, గూడేలు ఏకమయ్యాయి. ప్రభుత్వం నుంచి వచ్చే రూ.10లక్షల ప్రోత్సాహక నిధులతోపాటు స్థానిక ఎమ్మెల్యేలు కూడా ఎన్ఆర్ఈజీఎస్ నిధులను నజరానాగా ప్రకటించడంతో అభివృద్ధి కోసం పంచాయతీలన్నీ ఏకగ్రీవాల బాటపట్టాయి. ఇందులో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మొదటి రెండు విడుతల్లో 254 చోట్ల ఏకగ్రీవం కాగా మూడో విడుతలో 74 జీపీలకు సింగిల్ నామినేషన్లు దాఖలయ్యాయి. పూర్వ ఆదిలాబాద్‌లో గతంలో 866 గ్రామ పంచాయతీలు ఉండగా.. కొత్త పంచాయతీల ఏర్పాటుతో వీటి సంఖ్య 1,508కి చేరింది. రెండు విడుతల్లో ఎన్నికలు జరిగే గ్రామ పంచాయతీల్లో 254 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మూడో విడుతలో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. గతం కంటే ఈసారి ఏకగ్రీవాల సంఖ్య భారీగా పెరిగింది. క్రితంసారి 866 గ్రామ పంచాయతీలకు.. 78 చోట్ల మాత్రమే ఏకగ్రీవమయ్యాయి.

మూడో విడుతలో..

మూడో విడుతలో ఉమ్మడి జిల్లాలో 74పంచాయతీలకు సింగిల్ నామినేషన్లు వచ్చాయి. ఆసిఫాబాద్ జిల్లాలో 17, మంచిర్యాలలో రెండు, ఆదిలాబాద్‌లో 49, నిర్మల్ జిల్లాలో 6 గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ పదవులకు ఒకే నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

నిర్మల్ జిల్లాలో..

రెండు విడుతల్లో కలిపి నిర్మల్ జిల్లాలో 82 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. పెంబిలో 20, మామడలో 13, సారంగాపూర్‌లో 11, ఖానాపూర్‌లో 10, కడెంలో 9, నిర్మల్‌లో 5, లక్ష్మణచాంద, లోకేశ్వరంలో 4 చొప్పున, సోన్‌లో 3, దస్తురాబాద్, నర్సాపూర్(జి), కుంటాలలో ఒక్కొక్కటి చొప్పున గ్రామ పంచాయతీలున్నాయి.

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో..:

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 37 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. కాగజ్‌నగర్‌లో 9, తిర్యాణిలో 8, బెజ్జూర్‌లో 7, దహెగాం, కౌటాల, పెంచికల్ పేట్‌లో మూడు చొప్పున, సిర్పూర్(టి), రెబ్బెన, ఆసిఫాబాద్, చింతలమానేపల్లిలో ఒక్కొక్కటి చొప్పున ఏకగ్రీవమయ్యాయి.

మంచిర్యాలలో..: మంచిర్యాల జిల్లాలో 21గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం చేశారు. కోటపల్లిలో 6, చెన్నూర్‌లో 4, తాండూర్, జైపూర్‌లో 3 చొప్పున, భీమారం, బెల్లంపల్లి, కాసిపేట, భీమిని, కన్నెపల్లిలో ఒక్కొక్కటి చొప్పున ఏకగ్రీవమయ్యాయి.

ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ జిల్లాలో 114 గ్రామ పంచాయతీలను ఏకగ్రీవం చేసుకున్నారు. నేరడిగొండ, తలమడుగులో 16 చొప్పున భీంపూర్‌లో 15, ఆదిలాబాద్ రూరల్, బోథ్‌లో 12 చొప్పున, బజార్‌హత్నూర్‌లో 11, బేల, గుడిహత్నూర్‌లో తొమ్మిది చొప్పున, తాంసిలో 8, జైనథ్‌లో 6, గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.



విద్యార్థుల మృతదేహాలవద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గుత్తా, ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కన్నీటి వీడ్కోలు..

డిసెంబర్ 24న అమెరికాలో మరణించిన ముగ్గురు విద్యార్థులు

గుర్రపుతండాలో వారి అంత్యక్రియలు పూర్తి

నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రముఖులు

దేవరకొండ, నమస్తేతెలంగాణ: క్రిస్మస్ వేడుకల సందర్భంగా డిసెంబర్ 24న అమెరికాలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన సాత్విక(18), సుహాస్(15), జయసుచిత(13)ల అంత్యక్రియలు శనివారం వారి స్వగ్రామమైన నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం గుర్రపుతండాలో ముగిశాయి. వారిని కడసారి చూసేందుకు జనం భారీగా తరలివచ్చారు. అమెరికా నుంచి తీసుకొచ్చిన విద్యార్థుల భౌతికకాయాలను ఊరేగింపుగా చింతపల్లి, మాల్, కొండమల్లేపల్లి, దేవరకొండ పట్టణాల మీదుగా శుక్రవారం రాత్రి గుర్రపు తండాకు తరలించారు. బంధువులు, గ్రామస్థుల సందర్శనార్థం వారి పార్థివదేహాలను అలేతియా బంజార స్కూల్ ఆవరణలో ఉంచారు. శనివారం నల్లగొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, జెడ్పీ చైర్మన్ బాలునాయక్, టీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యవతి రాథోడ్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ప్రభుత్వం తరపున హాజరైన హైదరాబాద్ మైనార్టీ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బీ శంకర్‌లుకే, నల్లగొండ డీఎండబ్ల్యూవో వెంకటేశ్వర్లు, దేవరకొండ ఆర్డీవో గుగులోతు లింగ్యానాయక్ విద్యార్థుల మృతదేహాలపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అలేతియ సంస్థకు చెందిన అమెరికా ప్రతినిధులు, పాస్టర్లు సైతం తరలివచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విద్యార్థుల పార్థివదేహాలను పాఠశాల భవనం పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో క్రైస్తవ సంప్రదాయ రీతిలో శవపేటికలో ఉంచి ఖననం చేశారు.

దేశ రాజకీయాల్లో కీలకశక్తిగా మారనున్న కేసీఆర్

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



కొల్లాపూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నమస్తే తెలంగాణ: జాతీయ రాజకీయాల్లో సీఎం కేసీఆర్ సేవలు అవసరమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుపేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ద్వారా దేశరాజకీయాల్లో కేసీఆర్ కీలకశక్తి అవుతారని తెలిపారు. రైతుబిడ్డ, సుదీర్ఘ అనుభవం ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని స్పీకర్‌గా ఎంపికచేయడం పట్ల సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో శనివారం ఆయన కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎడ్మకిష్టారెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్రకార్యదర్శి బైకాని శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మూడు రాష్ట్రాల్లో ఓడిపోతే తెలంగాణలో టీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని గుర్తుచేశారు.

బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ నర్సింగ్ ఫలితాలు విడుదల

పోచమ్మ మైదాన్ (వరంగల్): బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ నర్సింగ్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షాఫలితాలను వరంగల్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు శనివారం విడుదల చేశారు. 2018 అక్టోబర్/నవంబర్‌లో రెగ్యులర్, రిఫర్డ్ బ్యాచ్ విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. ఈ ఫలితాల్లో బీఎస్సీ నర్సింగ్ మొదటి ఏడాది రెగ్యులర్ విద్యార్థుల్లో 115 మంది డిస్టింక్షన్, 858 మంది ఫస్ట్ క్లాస్, 306 మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాదిలో 90 మంది డిస్టింక్షన్, 742 మంది ఫస్ట్ క్లాస్, 267 మంది సెకండ్‌క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారని కాళోజీ రిజిస్ట్రార్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. పోస్ట్ బేసిక్ నర్సింగ్ కోర్సులో మొదటి ఏడాది రెగ్యులర్ విద్యార్థుల్లో ఇద్దరు డిస్టింక్షన్, 38 మంది ఫస్ట్ క్లాస్, 22 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. రెండో ఏడాది ఒకరు డిస్టింక్షన్, 22 మంది ఫస్ట్ క్లాస్, 11మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులయ్యారు.

'ఆటా' అధ్యక్షుడిగా భీంరెడ్డి పరమేశ్వర్‌రెడ్డి



పరమేశ్వర్‌రెడ్డి

తిమ్మాజిపేట: నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లికి భీంరెడ్డి పరమేశ్వర్‌రెడ్డి 2019-20 సంవత్సరానికి అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా)అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కొండారెడ్డి, నారాయణమ్మ దంపతుల కుమారుడు భీంరెడ్డి పరమేశ్వర్‌రెడ్డి దాదాపు 25 ఏండ్ల క్రితం అమెరికా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. ఆయన పోతిరెడ్డిపల్లిలో ప్రాథమిక విద్య, కొందుర్గు, హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ స్కూల్‌లో పాఠశాలవిద్య, భాగ్యనగర్ కళాశాలలో ఇంటర్మీడియట్, డక్కన్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తిచేసి ఎంఎస్ కోసం అమెరికా వెళ్లారు. గత కొన్నేండ్లుగా తెలుగు అసోసియేషన్‌లో కీలకపాత్ర పోషిస్తున్నారు.

మహాపురస్కారానికి పెద్దపల్లి వేదపండితుడు

నేడు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా..



రామాచార్యులు

కలెక్టరేట్: వేద పండితుల సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం అందజేస్తున్న మహా పురస్కారానికి పెద్దపల్లి జిల్లా కేంద్రానికి చెందిన కొండపాక రామాచార్యులు ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా విశిష్ట సేవలందించిన 108 మంది పండితులను శ్రీవేద ధార్మిక సేవా సమితి రాష్ట్రసంఘం ఆధ్వర్యంలో మహాపురస్కారానికి ఎంపిక చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా రామాచార్యులు పురస్కారాన్ని అందుకోనున్నారు.

తనిఖీల్లో రూ. 2.60 లక్షలు పట్టివేత

ఉట్నూర్, నమస్తే తెలంగాణ/వేములవాడ రూరల్: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని ఎక్స్‌రోడ్ వద్ద శనివారం పోలీసులు, ఎన్నికల అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రూ.2. 60 లక్షల నగదు పట్టుబడింది. నిజామాబాద్‌కు చెందిన మదన్ అనే మేకల వ్యాపారి వద్ద నగదు దొరికిందని.. ఎటువంటి పత్రాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల అధికారి మహేశ్ తెలిపారు.

మల్లారంలో 20 చీరెల పట్టివేత: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మల్లారంలో అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 20 చీరెలు పట్టుబడ్డాయి. గ్రామంలో ఓటర్లకు చీరెలను పంపిణీ చేస్తున్నారని కొందరు ఫిర్యాదు చేయడంతో తనిఖీలు చేపట్టి స్వాధీనం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు.



సీఎం కేసీఆర్ నిర్వహించనున్న మహారుద్రసహిత సహస్ర చండీ యాగానికి సీనియర్ జర్నలిస్టు స్వామి పొన్నాల గౌరీశంకర్ ఉత్తరాఖండ్ రుషికేశ్ హరిద్వార్ బ్రహ్మకుండం నుంచి పవిత్ర గంగాజలాలను తీసుకొచ్చి శనివారం గజ్వేల్‌లో సిద్దిపేట, గజ్వేల్ మున్సిపల్ చైర్మన్లు రాజనర్సు, భాస్కర్‌కు అందించారు.
- గజ్వేల్, నమస్తే తెలంగాణ

కోరుట్ల మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

23 మంది కౌన్సిల్ సభ్యుల మద్దతు

కోరుట్లటౌన్: జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ చైర్మన్ శీలం వేణుగోపాల్‌పై టీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ప్రిసైడింగ్ అధికారి గౌతమ్ పాత్రూ నేతృత్వంలో ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్‌కు 23 మంది కౌన్సిలర్లు హాజరుకాగా.. వారందరూ అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. దీంతో మున్సిపల్ అధ్యక్షుడు వేణుగోపాల్‌పై అవిశ్వాసం నెగ్గినట్టు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. అవిశ్వాస తీర్మాన పత్రాన్ని ఎన్నికల సంఘానికి పంపించనున్నట్టు కమిషనర్ వాణిరెడ్డి తెలిపారు. నిబంధనల మేరకు తదుపరి అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని చెప్పారు.



నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు
...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు



భాగ్యలక్ష్మీ రెడ్డి మ్యాట్రిమోని
రెడ్డి వధూవరులకు ప్రత్యేకముగా చూడబడును
తార్నాక, షాప్ నెం.48, హుడాకాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
Cell: 9246960888
Whatsapp: 9866044439
bhagyalakshmireddymatrimoni@gmail.com




వధువు కావలెను
★రెడ్డి డాక్టర్: 28Yrs, 5'8", MBBS, PG, Doctor, USA వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి: 27Yrs, 5'10", B.Tech, MS, SWE, USA, 150K PA, 10 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి: 26Yrs, 5'11", MS, SWE, USA, 80K PA, 4 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి: 29Yrs, 5'9", MS, SWE, USA, 90K PA, 9 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999
★రెడ్డి: 30Yrs, 5'11", B.Tech (VIT), MBA (GMAT), SWE, USA, 167K PA, 2 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి: 26Yrs, 5'11", B.Tech, MS, SWE, USA, 6L PM, 15 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★రెడ్డి: 27Yrs, 5'3", MS, SWE, USA, 80K PA, 50 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★రెడ్డి: 24Yrs, 5'5", MBA, Business, 7L PM, 250 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 7207930999
★రెడ్డి: 27Yrs, 5'11", INA, Central Govt. Job, 25L PA, 8 Crores Property గల వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★రెడ్డి రెండవ పెళ్లి: 38Yrs, 5'7", MCA, SWE, London, $55,000/- PA గల వరునికి తగిన వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను
★రెడ్డి డాక్టర్: 31Yrs, 5'4", MBBS, MD, Asst. Professor,1L PM, 30 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి డాక్టర్: 26Yrs, 5'8", MBBS, MD, Doctor, 3 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599
★రెడ్డి: 27Yrs, 5'5", B.Tech, MS, SWE, USA, 80K PA, 5 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★రెడ్డి: 25Yrs, 5'1", B.Tech, SWE, 4L PA, 2 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★రెడ్డి: 29Yrs, 5'3", B.Tech, MS, SWE, USA, 4L PA, 2 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి: 28Yrs, 5'3", M.Pharmacy, Pharmacist, 17,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599
★రెడ్డి: 24Yrs, 5'5', M.Tech, Assistant Professor, 40,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★రెడ్డి: 29Yrs, 5'6", MDS, Doctor, 40,000 PM, 2 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★రెడ్డి: 28Yrs, 5'2", B.Tech, M.Tech, Hardware Engg., 4L PA, 2 Crores Property గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★రెడ్డి రెండవ పెళ్లి: 33Yrs, 5'4", MS, SWE, USA, 100K PA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

తెలంగాణ రెడ్డీలకు మాత్రమే
కేవలం తెలంగాణలో రెడ్డి వివాహ సంబంధాలు కుదర్చగల ఏకైక వివాహ వేదిక.
కీసరి మోహన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, H.No. 3-4-340/1, Flat No. 302, IIIrd Floor, Saraswathi Apartments, Near BSNL Office, Beside RBVRR B.Pharmacy, (Sattamma College), Barktpura, Hyd ☎:040-27555006, 9246573006, 7981053739, 9348067006 E-mail:keesarimb@gmail.com, www.keesarimarriages.com
Timing: 10 am to 5.00 pm. Tuesday Holiday. Regn.No. 997/2009
మా బ్రాంచ్: B.N.రెడ్డి క్రాస్ రోడ్స్, సాగర్ రోడ్, చైతన్యనగర్, ఫేస్-2, రోడ్ నం.4, హైదరాబాద్.
Native Place: తిరుగండ్లపల్లి (గ్రా), మర్రిగూడ (మం), నల్గొండ (జి)

వధువు కావలెను
★రెడ్డి:28/5'11"/BE/MS/H1/100K/Full Time/2Cr * 32/ 5'11"/ BE/ MS/ 100K/20 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 29/6'0"/BE/MBA/120K/USA/H1/6Cr * 31/5'9"/BE/MS/USA/140K/H1/15 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:29/6'0"/BE/USA/Citizen/100K/10 Cr * 32/ 6'0"/BE/MS/120K/ H1/ 50Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 27/ 5'9"/ BE/ MBA / 1Cr P/A 60 Cr * 29/ 5'11"/ BBA/ MBA/ 10 Cr. P/A/100 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:32/ 6'0"/ BE/ MBA/ 16L P/A 3 Cr * 27/ 5'8"/ BE/ MBA/5L P/A/ 10 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 28/ 5'5"/ B.Com/ Business 100 Cr.* 32/ 5'9"/ BE/ 8L P/A/ 50 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:29/5'11"/BE/ Builder/ 200 Cr * 39/ 5'9"/ MBA/5L P/A 8 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 33/ 5'8"/ MBBS/12L P/A/ 30 Cr *40/5'11"/MD/Radiology/ 13L P/A/ 15 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:32/5'7"/BE/MBA/Australia/ 60K/3Cr* 31/5'10"/ B.Com/MS/ Australia/80K/4Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి రెండవ పెళ్లి: 33/ 5'11"/ MBBS / 6L P/A/ 2 Cr * 32/ 5'10"/ BE/ MBA/20L P/A/ 10 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.

వరుడు కావలెను
★రెడ్డి:25/5'4"/BE/MS/USA/ 5 Cr * 31/ 5'6"/ BE/MS/ USA/ H1/ 100K/ 2 Cr సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 27/ 5'4"/ BE/ MS/ 100K/ 1Cr * 25/ 5'5"/ BE/ MS/ 60K/H1/2Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:32/5'3"/BE/MS/USA H1/100K/20Cr *23/5'4"/BE/MS/ USA 15 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 24/5'4"/BE/5L P/A/20 Cr *25/5'4"/BE/Civils Prepared/ 4 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 27/ 5'3"/BE/MBA/ 15Cr. * 25/ 5'4"/ B.Com/ LA/ 10L P/A/5 Cr సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 23/ 5'5"/ BE/ MS/Singapore/Hyd/ 30 Cr * 26/ 5'4"/ BE/MBA/5L P/A/10Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 28/ 5'5"/ MS/ Gynacology/ 2 Cr * 29/ 5'2"/ BDS/MDS 5L P/A/50 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి:29/5'5"/MBBS/Govt. Job/ 5L P/A/3 Cr. * 27/ 5'2"/ Residency Doctor/ USA/ 2Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి: 23/ 5'2"/MBBS/Only One/ Rich Family * 26/ 5'7"/ MS/ Gynacology/ 2 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.
★రెడ్డి రెండవ పెళ్లి: 25/ 5'2"/ BE/2Cr * 31/5'2"/M.D/ Anesthesia/1 Cr. సం॥ కీసరి మోహన్ రెడ్డి. Ph: 9246573006.



కళ్యాణ వేదికలు
★ T.Bhoom Reddy Marriage Bureau for Local, Abroad Matches. Cont: H-13/1, Near Ahobilamutt, D.D. Colony, Hyd. Ph: 040-27425273, 8790123939, 9347225273
★శ్రీశ్రీశ్రీ కొమురవెల్లి మల్లన్న వివాహ వేదిక: ప్రత్యేకముగా యాదవులకు, కురుమలకు, లేట్, 2వ & ఇతర కులాలవారికి సంబంధాలు చూడబడును. Hyd. 9701552985, Whats App: 7680857955
★ శ్రీ వేములవాడ రాజన్న మ్యారేజ్ బ్యూరో: యాదవ స్పెషల్ మరియు SC మాల, మాదిగ వారికి సంబంధాలు చూడబడును. రాంనగర్, హైదరాబాద్. ఫోన్: 9494227957
★ మేరు (దర్జి) కులస్తులకు మాత్రమే చూడబడే ఏకైక సంస్థ మొదటి, రెండవ, లేట్ మ్యారేజెస్, Dr. Eng.Govt,Degree, మ్యాచెస్ ఉన్నాయి. సంప్ర: 9494252545
★ V.R.Reddy మ్యారేజ్ బ్యూరో:20 సం.ల అనుభవం. Local & Abroad మ్యాచెస్ చూడబడును. Drop Your Bio-Data & Photo to:Venkat_reddy8911@yahoo.com సంప్ర: నార్సింగి, Hyd. Ph: 8790493109
★ అన్ని కులముల వారికి ఫ్రీ రిజిస్ట్రేషన్: తెలంగాణ అన్నిజిల్లాలలో, Govt. Job, Software Job, 1వ, 2వ, లేట్. సంప్ర: 8185811429 www.goodlifemarriage.com
★ పద్మశాలి కులబాంధవులకు శుభవార్త! గత కొన్ని దశాబ్దాలుగా నామ మాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు వారి ఆధ్వర్యములో పద్మశాలి పరిణయ పరిచయ వేదికను తేది: 17-02-2019 ఆదివారం రోజున 1 PM నుండి 5 PM వరకు నిర్వహిస్తున్నాము. సంప్ర: పద్మశాలి భవన్, నారాయణగూడ, హైదరాబాద్. ఫోన్ నెం. 040-24765557/8/9
★SCమాల మాదిగ వివాహ సంబంధాలకై ఫోటో మరియు వివరాలను7981782162 నంబర్‌కు వాట్సాప్ పంపగలరు. వివరాలకు సంప్రదించండి. "హిమశ్రీ మ్యారేజెస్" రామ్‌నగర్ క్రాస్ రోడ్, ముషీరాబాద్, హైదరాబాద్. 7981782162
★మున్నూరు కాపు అబ్బాయికి రెండోపెళ్లి కులం పట్టింపు లేదు. వయస్సు: 45 సం.లు, ఎత్తు: 5.5, నెలకు జీతం: 40 వేలు, అందమైన అమ్మాయి కావలెను. G. యాకస్వామి-7893805975. యాదాద్రి జిల్లా, పల్లేపహాడ్ (V), ఆత్మకూర్ (M).

www.avinashreddy.com
రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి: 690, RoadNo.3, BanjaraHills, Hyd.
Tuesday Holiday, Timings: 10 AM to 5 PM, avinash11818@gmail.com
93933 11818


వధువు కావలెను
★ Reddy BE(IIT), MBA, 26, 5'10", 150 K, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, M.Tech, 29, 6'1", SWE, 3 Crores, Handsome.Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy UK, BE, MS, 33, 5'5", SWE, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy Rayalseema, BE, MS, 26, 5'10", USA, 120 K. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy Construction, BE, MBA, 26, 5'11", Rich, Hyderabad. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, 29, 6', 34 L P/A, Hyd, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

వరుడు కావలెను
★ Reddy BE, 26, 5'3" 16 L P/A, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy MBBS, USMLE, 26, 5'4", fair & slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 26, 5'1" , Manager, 17L P/A, fair & slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy MBA, 25, 5' 8", Sr Analyst, 12 L P/A, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, USA, 24, 5' 4", 15 Crores, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 24, 5'5", 10 Crores, Software, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
తెలంగాణ రెడ్డి
వివాహ సంబంధాలకు సంప్రదించండి
D.V. Koti Reddy
690, Road No-3, BanjaraHills HYDERABAD
98480 11818

★ Reddy Residency Doctor, 32, 5'10" USA, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 29, 5' 11", H1, 100K, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, MBA 27, 5'9", Manager, Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 26, 5'11", 90K, 2 Crores, SWE, USA. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS 27, 5'11", 85 K, 8 Crores, H1, USA, Handsome . Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy Business, BBA, 25, 5'10", Handsome. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy 100 Crores, 27, 6', Handsome, BE, MS. Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy PhD, 30, 5' 9", 230 K, USA, Handsome, Cont:Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 27, 5'3", 9 Crores, SWE, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BArch, 27, 5'7", Fair & Slim, Hyderabad. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy MBBS, MD, 26, 5'6", Doctor, Hyderabad. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 28, 5'5", 3 Crores, H1, USA. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy Rayalseema, BE, MS, 26, 5'6", USA, Software,120K.Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy MBA, 27, 5' 3", Hyd, 2.5 Crores, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy BE, MS, 24, 5'4", SWE, 65 K, USA, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com
★ Reddy Accenture, BE,MBA, 27, 5'6", Rich, Software. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

భవాని రెడ్డీస్ మ్యారేజ్ బ్యూరో


ONLY REDDY'S SPECIALIST
అడ్రస్: Old Alwal, Near Indira Gandhi Statue
Cont: S. BHOOPAL REDDY
Ph: 9912387047, 9177356106
e-mail: bpl.reddy1971@gmail.com
SBH A/c. No. 62263103630 Medchal Branch

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో
TM EST: 1995
గౌడ, ఈడిగ, శెట్టిబలిజ 1st, 2nd, దేశ, విదేశ సంబంధాలకై సంప్రదించండి.
ఎస్. శారదా గౌడ్
లింగాల కాంప్లెక్స్, DSNR, HYD.
24150704/9490479371
Email: subhamastu_saradagoud@yahoo.co.in



వధువు కావలెను
★మేరు:29/5'6"/టైలర్/ 15,000/- PM, Hyderabad, వేములవాడలో సొంత ఇల్లు కలిగిన అబ్బాయికి అమ్మాయి కావలెను. సంప్రదించండి: 9010150541
★కులంతో పని లేదు లెక్చరర్ 5'9", Fair, 47 Yrs, తగిన వరుడికి తోడు గల వధువు కావలెను. 6304088272



వరుడు కావలెను
★రెడ్డి:33, విడో మరియు రెడ్డి 55, విడో Govt. Employee వధువులకు తగిన రెడ్డి వరులు కావలెను. ST/ 31 వధువుకు తగినవరుడు కావలెను. పెన్షనర్స్ కూడా OK. 9603309135/7981322231
★మాదిగ: రెండవ పెళ్లి అమ్మాయి D/B. 18-06-1987 Ht: 5'.0" అర్హత: P.G., Job, Private Teacher (15,000) పిల్లలు ఉన్నా OK, Ph: 9666371592 (Direct)
★SC మాదిగ, Age: 30, Ht.5".4, చామనఛాయ, Govt. Jobనకు Hydలో జాబ్ చేసే తెలంగాణ వరుడు కావలెను. సెల్: 8074518809, 6300364563

గమనిక: "కళ్యాణమస్తు" ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించిన హామీలకు పత్రిక బాధ్యత వహించదు. ప్రకటనల అన్ని విషయాలలో వధూ వరులు, పెండ్లి పెద్దలే నిర్ణయాలు తీసుకోవాలి. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

కళ్యాణమస్తు
8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 Banjara Hills, Hyderabad - 500034.
80966 77819

కుమ్మరి కళ్యాణ వేదిక
కుమ్మరి కులస్తుల పెళ్లి సంబంధాల కోసం సంప్రదించండి
దేవరుప్పల యాదగిరి కుమ్మరి
బడంగ్‌పేట్, హైదరాబాద్ జిల్లా
Cell: 9640972206

కురుమ-యాదవ ప్రత్యేకం


కురుమ-యాదవ విదేశీ, ఇంజనీర్స్, SWE, డాక్టర్స్, Govt/PVT., బిజినెస్ మరియు 2వ సంబంధాలకై సంప్ర: కులజులు ఆదరిస్తున్న విశ్వసనీయమైన నెం.1 సంస్థ
www.kurumapellipandhiri.com
కోశిక శ్రీనివాసరావు కురుమ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
కురుమ పెళ్లి పందిరి, DSNR, HYD.
9396649499, 9393001666
6303994641

శక్తి శ్రీ రెడ్డి మ్యారేజ్ హెల్ప్ లైన్


రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి
Flat No. 201, 2nd Floor, Sheshadri Heights Apartment
Opp: SLMS Hospital, Nagole "X" Road, Hyd.
Cell: 73968 91999 / 9398618816
దేశిరెడ్డి శోభారెడ్డి
రైతు బిడ్డలకు ప్రత్యేకం

వధువు కావలెను
★రెడ్డి: 29Yrs, 6'0", B.Tech, SWE, USA: 130K P.A 5CR Property గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 30Yrs, 5,9" MS SWE, USA: 140 KP.A 20 Cr Property, H1B; గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 28Yrs, 5,7" MS SWE, USA: 110K; 6Cr, H1B గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 29Yrs, 5,11" MS SWE, USA: 100K; 3Cr, H1B Fair గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: MBBS, MS, Neurologist, 28Yrs, 5'8" 10Cr Property, Fair, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 27Yrs, 5,8" B.Tech, MBA, MANAGER, 80K, 5Cr, Fair, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 53Yrs, 5,9" MA, MANAGER, 50K, 4Cr, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: 30Yrs, 6,00F, Fair, Business, PG, 8 CR, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: Govt Job: LDC, 35Yrs, 5'5", Fair, 50K గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999
★రెడ్డి: MBBS, డాక్టర్: 32 Yrs Fair 5,6" 5Cr, గల వరుడికి తగిన వధువు కావలెను. 7396891999

వరుడు కావలెను
★రెడ్డి: 2nd Marriage: 31Yrs, 5'5", Fair, 100K, Chemist, USA: గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: H1B, Software(SWE), USA, MS, 24, 5'2", Fair, 100K, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: SWE, USA, MS, 28Yrs, 5'4" Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: MCA, 30Yrs, 5'5" Fair, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: Govt Job: 2nd Marriage: 33Yrs, 5'2", Fair, 65,000 PM, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: Degree: 26Yrs, 5'3" Fair, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: Govt Job, MCR: 30Yrs 5'4" Fair, 43000 PM, గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: SWE, B.Tech, 23yrs, 100 Cr Property, 5'3", fair: 30K గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి: SWE, M.Tech, 26yrs, 5'7", Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816
★రెడ్డి. డాక్టర్: MBBS, 28yrs, 5'5" Fair గల వధువుకి తగిన వరుడు కావలెను. 9398618816

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో
అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.
తార్నాక, షాప్ నెం.48, హుడా కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
President: Telangana Marriage Links.
Cell: 9246960888
Whatsapp: 9866044439



వధువు కావలెను
★బ్రాహ్మణ్స్: 32Yrs, 6'1", B.Tech, MS, Asst Manager, 1 LPM వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★వైశ్య: 31Yrs, 5'10", B.Tech, MBA, Business, 60,000 PM, Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★కాపు: 31Yrs, 5'10", MBA, SWE, 30,000 PM Well Settled వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★మున్నూరు కాపు: 29Yrs, 6'2", B.Tech, MBA, Own Company 60,000 PM Well Settled వరునికి తగిన వధువు కావలెను. 7207930999
★పద్మశాలి: 27Yrs, 5'6", B.Tech, Senior Data Scientist, 2 LPM వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★గౌడ్స్: 30Yrs, 5'7", BA, Business, 12 LPA వరునికి తగిన వధువు కావలెను. 9246960888
★ముదిరాజ్: 32Yrs, 5'11", MCA, SWE, 8 LPA, వరునికి తగిన వధువు కావలెను. 9248064777
★మాల: 30Yrs, 6'1", MBA, Government Employee, 1 LPM, 10 Crores Property వరునికి తగిన వధువు కావలెను. 7207930999
★మాదిగ: 26Yrs, 5'9", B.Tech, Finance Assistant, 60 KPM వరునికి తగిన వధువు కావలెను. 9030315599
★కమ్మ: 37Yrs, 5'9", M.Sc, Lecturer, 80,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను
★కాపు: 27Yrs, 5'3", B.Tech, SWE, 1 LPM, వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★మున్నూరుకాపు: 25Yrs, 5'5", MBA, Private Employee, 12,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599
★పద్మశాలి: 25Yrs, 5'1", M.Tech, Bank Employee, 40,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★గౌడ్స్: 26Yrs, 5'2", B.Tech, Central Government Employee, 40,000 PM, గల వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★ముదిరాజ్: 32Yrs, 5'4", MBA, Account Officer, 20,000 PM వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★విశ్వబ్రాహ్మణ్: 32Yrs, 5'2", MBA, HR, Deputy Manager, 7.6 LPA, వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599
★రజక: 29Yrs, 5'4', MS, Physiology, Physiotherapist, 70,000 PM USA గల వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777
★మాల: 32Yrs, 5'6", M.Sc, Ph.D, Government Lecturer, 60,000 PM వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999
★మాదిగ: 27Yrs, 5'4", M.Tech, SWE, 30,000 PM గల వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888
★కాపు రెండవ పెళ్లి: 26 Yrs, 5'2", B.Tech, Pvt Job, 14,000 PM వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥
రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, abroad Matches Fast Settlement: (For Reddy's Only) (Telangana) Cont:K.C. Reddy, Address: 106, A.K. Enclave, Phase-II, 8-2-350, Road No.3, Banjara Hills (Near A.P.Furniture Mall), Hyd.
Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను
★ Reddy/MBA/Builder/ Bangalore/ V.Smart boy/ only Son/ 50 Cr.Prop/ 29/6'/ Cont K.C. Reddy- Hyd. Ph:9849321309/ 9347807015
★ Reddy/MBBS/ Res-Doc-USA/ Fellowship/ Haematology/ 31/6' * Onchology/ 31/ 5'8" * Surgeon/ 29/6'/ 50 Cr * Cont K.C. Reddy/ Hyd. Ph:9849321309.
★ Reddy/MBA/ Good Business/ 27/ 5'11"/ V. Smart/ 350 Cr * MS/ 28/ 6'/ 200 Cr/ Hyd. * 29/6' 300 Cr * 30/6'/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/B.Tech/MS/ 29/ 5'10"/ 100 Cr * MS/ 30/ 5'8"/ 100 Cr * MBA/ 31/ 5'11"/ 350 Cr/ Hyd * 25/ 5'10"/ 100 Cr * 29/ 6'/ 50 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.Tech/ H1/ USA/ 230K/ Microsoft/ 29/ 5'8" *MS/ 28/5'11"/ 20Cr *30/5'11"/ 200K *28/5'10"/ 140K/ * Cont: K.C. Reddy - Hyd. Ph:9849321309.
★ Reddy/ Divorcee/ B.Tech/MS/ Business/ Hyd/ Royal family/ 33/6'/ V.Smart/ 100 Cr +(Prop) Hyd *Cont K.C. Reddy-Hyd. Ph: 9849321309
★ Reddy/ MBA/ V. Smart Boy/ Business/ 27/5'11"/ 350 Cr/ Hyd * MS/ 27'6"/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.Tech/ MBA/ 25/ 5'10"/ 100 Cr - Only Son * 28/ 6'/ 50 Cr/ Only Son * 29/ 5'11"/ Only Son/ 100 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.
★ Reddy/ B.Tech/ MS/ H1/ USA/ V. Smart 26/6'/ 120K/ 30 Cr * B.Tech/ Business/ 28/ 6'/ 300 Cr * 29/ 5'11"/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ Business/ B.Tech/ MS/ 27/ 5'9"/ 75 Cr * 31/ 5'9"/ 200 Cr * 26/ 5'6"/ 50 Cr * 28/ 5'9"/ 100 Cr * 29/ 6'/ 200 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ Business/ B.Tech/ 31/ 5'10"/ 150 Cr * 30/ 5'10/ 300 Cr * 33/ 5'10/ 200 Cr/ MBA * MBA/ 40/ 6'/ 100 Cr * Cont K.C. Reddy- B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ BE(BITS)/ * VIT/ NIT * 28/ 5'10/ 40L/Yr * 28/ 5'11"/ USA/ 120K * 28/ 5'8"/ Bang/ 30 Cr * 29/ 5'11"/ 31L/Yr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.Tech/ VIT/ MBA/ USA/ 200K/ 30/ 5'11"/ H1/ USA * 30/ 5'9"/ 26L/ Yr * 28/ 5'8" * B.Tech/ Pilot/ 34/ 5'11"/ 3L/M * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ MBBS/ PG * 29/ 5'7"/ 50 Cr * MS/ Sur/ 28/ 5'11" * GM/ 29/ 5'7" * Ortho/ 29/6'/ 75 Cr * Ort/ 26/ 5'10" * Rad/ 28/ 5'8" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.
★ Reddy/ MBBS/ PG/ Sur/ 25/ 5'8" * GM/ 30/ 5'11"/ 25 Cr * Opt/ 31/ 5'10" * Pad/ 30/ 5'9" * GM/ 29/ 5'11 * Anes/ 29/ 5'10" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.Tech/ MS/ H1/ USA/ * 28/ 5'11"/ 120K * 28/ 5'9"/ 120K * 27/ 5'11"/ 120K * 28/ 5'7"/ 50 Cr * 28/ 5'9"/ 90K/ 10 Cr * 29/ 6'/ 125K/ 30 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.S/ USA/ CITIZEN * 28/ 5'11"/ 20 Cr * 30/ 5'11"/ 100K * Doctor/ 28/ 6'/ 50 Cr/ Surgeon * 44/ 6'/ Doc * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ Divorcee/ Aus/ CITIZEN/ 37/ 5'7"/ 25 Cr (Prop) Hyd/ 92K/ B.Tech/ MS * Cont K.C. Reddy-B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ Divorcee/ India * M.Sc/ 35/ 5'11"/ 200 Cr * 29/ 5'10"/ 40 Cr * USA/ Doc/ 36/ 5'8" * MBBS/ MD/ 30/ 5'9"/ DM/ 15 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309.
★ Reddy/ B.Tech/ MS/ Now Business/ 29/ 5'9"/ 300 Cr * M.Sc/ Navy/ Lieutenant/ 27/ 5'11" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

వరుడు కావలెను
★ Reddy/ (Divercee) MBBS/MD/DM/ 31/5'6"/Hyd-Rich★ 30/5'5"/ MD/ 10Cr. Cont K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/9347807015
★ Reddy/ MBA/ 28/ 5'3"/ Beautiful/ 40 Cr(Share) Prop/ Hyd *Cont K.C. Reddy -Mar- Bureau-B.hills - Hyd. Ph:9849321309/ 9347807015
★ Reddy/ B.Tech/MS/USA/ H1/ Beautiful/ 130K/ 30Cr(Share) Prop- Hyd *Cont K.C. Reddy -B.hills - Hyd. Ph:9849321309/ 9347807015
★ Reddy/B.Tech/MBA/28/5'3"/ Father Very Big (Noted) Builder, Hyderabad Huge Prop. *Cont:K.C. Reddy- Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/MBBS/MS/(Gynec) *28/5'5"*26/5'5"*29/5'1"*Cont:K.C. Reddy-Road, No.3, Banjara Hills, Hyd. Ph:9849321309/9347807015.
★Reddy/(Divorcee)/B.Tech/31/5'2 1/2" 10Cr*26/5'3"/10Cr*32/5'6"/20Cr*35/5'3"/ 10Cr*29/5'5"/5Cr* 30/5'5"/10Cr *Cont: K.C. Reddy- Hyd. Ph:9849321309
★Reddy/ MBA/ 26/ 5'4"/ 300 Cr * 27/ 5'6"/ 100 Cr * 24/ 5'6"/ 150 Cr * 23/ 5'6" * 60 Cr * 28/ 5'3"/ 50 Cr * 28/ 5'5"/ 50 Cr * 30/ 5' 2 1/2"/ 100 Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309.
★Reddy/ MBBS/ 22/ 5'3"/40 Cr * 22/ 5'5"/ 30 Cr * MS/ 31/ 5'4"/ 50 Cr * MD/ 30/ 5'8"/ 500 Cr * Cont K.C. Reddy-Road No.3- B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/ B.Tech/ 28/ 5'3"/ 20 Cr * 28/ 5'3"/ 10 Cr * 25/ 5'6"/ 50 Cr *27/ 5'8"/ 50 Cr * 26/ 5'5"/ 50 Cr * 23/ 5'3"/ CA/ 20 Cr * 26/ 5'4"/ 10 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/ B.Tech/ MS (USA) Ph.D/ 33/ 50 Cr Needs India or USA Proposals * Cont K.C. Reddy-Road No.3- B.Hills-Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/ MBBS/ USA Res-doc * 26/ 5'7"/ 50 Cr * 26/ 5'5"/ 50 Cr * 29/ 5'5"/ 200K/ 10 Cr * 28/ 5'6" * Cont K.C. Reddy- Road No.3- B.Hills-Hyd. Ph:9849321309.
★Reddy/ B.Tech/ MS/ H1/ USA * 24/ 5'3"/ 10 Cr * 26/ 5'7"/ 30 Cr * 28/ 5'4"/ 30 Cr * 25/ 5'4"/ 25 Cr * 26/ 5'5"/ 10 Cr * 26/ 5'3 1/2"/ 40 Cr * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/ B.Tech IIT/ BITS/ MS/ H1/ USA * 25/ 5'7" 240K * 26/ 5'6"/ 105K * 30/ 5'5"/200K * 29/ 5'3"/ 200K * 28/ 5'4" * Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.
★Reddy/ B.Tech/ M.Tech/ 25/ 5'6"/ 60 Cr * 25/ 5'4"/ 20 Cr * 31/ 5'4"/ 70 Cr * 28/ 5'3"/ 10 Cr * 29/ 5'3"/ 50 Cr * 26/ 5'5"/ 10 Cr * Cont K.C. Reddy- Hyd. Ph:9849321309/ 9347807015.
★ Reddy/ B.Tech/ M.Tech/ Working/ India *24/5'5"/15Cr *26/5'6"/ 15Cr *28/5'3"/ 10Cr *28/5'5"/ 50Cr *27/5'5"/ 20Cr *Cont K.C. Reddy - Hyd. Ph: 9849321309, 9347807015
★ Reddy/ B.Tech/ MBA/27/ 5'3'/ 10Cr *28/5'3"/ 20Cr *26/5'6"/ 15Cr *26/ 5' 6"/ 7Cr *Cont K.C. Reddy -Mar-Bureau- Bhills - Hyd. -Hyd. Ph: 9849321309, 9347807015
★ Reddy/(IIT)/B.Tech/ MS/H1/ USA *BITS) 25/5'3'/ 240Cr *26/5'6"/ 110K *30/5'5"/ 200K *26/ 5' 2"/ 145K *29/5'4"/200K *Cont K.C. Reddy -Hyd. Ph: 9849321309
★Reddy/ B.Tech/ MBA/ Most beautiful/ 26/5'5"/ 50Cr (her share) (Prop) *Cont : K.C. Reddy -Mar- Bureau-Hyd. Ph: 9849321309/ 9347807015.
★Reddy/ Rich/ Beautiful/ B.Tech/ 24/ 5'3"/ 50Cr *26/ 5'3 1/2/ 40Cr *30/5'2 1/2/ 100Cr *27/ 5'3"/ 40Cr *28/5'6"/ 100Cr *Cont : K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015.
★Reddy/ B.Tech/ MS/ H1/ USA/ 26/5'3"/ 50Cr *26/5'7"/ 30Cr *26/5'3"/ 40Cr *Cont : K.C. Reddy -Mar-Bureau-B.Hills- Hyd. Ph: 9849321309/ 9347807015.

భగ్గుమంటున్న ఇంధన ధరలు

లీటర్ పెట్రోల్‌పై 19 పైసలు, డీజిల్‌పై 21 పైసల వడ్డన • పది రోజుల్లో రూ.2.50 పెరిగిన పెట్రోల్, రూ.3.20 అధికమైన డీజిల్



హైదరాబాద్, జనవరి 19: సామాన్యుడి జేబుకు మళ్లీ చిల్లు పెడుతున్నాయి ఇంధన ధరలు. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు రోజు రోజుకు పెరుగుతుండటం, మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తగ్గుతుండటంతో ధరలు పెంచుతున్నాయి ప్రభుత్వరంగ ఇంధన విక్రయ సంస్థలు. శనివారం కూడా లీటర్ పెట్రోల్ ధరను 19 పైసలు పెంచిన సంస్థలు..డీజిల్‌పై 21 పైసలు వడ్డించాయి. దీంతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.75.03కి చేరుకోగా, డీజిల్ రూ.70.84కి చేరుకున్నది. గడిచిన పది రోజుల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.2.50 పెరుగగా, డీజిల్ మరో రూ.3.20 ఎగబాకింది. గతేడాది అక్టోబర్ 9న రికార్డు స్థాయికి చేరుకున్న ధరలు ఆ తర్వాత తగ్గుముఖం పట్టాయి. కానీ ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తిని రోజుకు 10 లక్షల బ్యారెళ్లు తగ్గిస్తున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా అలజడికి కారణమైంది. అక్టోబర్ 4న రూ.89.06కి చేరుకున్న పెట్రోల్.. ఈ నెల 6న కనీస స్థాయి రూ.72.44కి తగ్గింది. అలాగే అక్టోబర్ 19న రూ.82.33 పలికిన డీజిల్ ధర ఈ నెల 9న రూ.67.66కి తగ్గింది. మిగతా నగరాల విషయానికి వస్తే దేశ రాజధాని న్యూఢిల్లీలో 17 పైసలు పెరిగిన పెట్రోల్ రూ.70.72కి చేరుకోగా, డీజిల్ మరో 19 పైసలు అందుకొని రూ.65.16కి చేరుకున్నది.

రూ.82 లక్షల కోట్లు

మోదీ హయాంలో 50 శాతం పెరిగిన ప్రభుత్వ అప్పులు • కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 19: గడిచిన నాలుగున్నరేండ్లలో దేశ రుణ భారం దాదాపు 50 శాతం పెరిగిపోయింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ సర్కారు పాలనలో దేశానికున్న రుణ భారం రూ.82 లక్షల కోట్లను దాటిపోయింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ అప్పులపై ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. ఎనిమిదో ఎడిషన్ స్టేటస్ పేపర్ ప్రకారం గతేడాది సెప్టెంబర్ నాటికి మొత్తం కేంద్ర ప్రభుత్వ రుణాలు రూ.82,03,253 కోట్లను చేరుకున్నాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరిన జూన్ 2014లో రూ.54,90,763 కోట్లుగానే ఉన్నాయి. దీంతో మోదీ హయాంలో సర్కారీ రుణాలు మరో రూ.27,12,490 కోట్లు పెరిగాయన్నమాట. దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానన్న నమో.. అప్పుల సేకరణకున్న ఏ అవకాశాన్నీ విడిచిపెట్టకపోవడం గమనార్హం. కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి రాకముందు గోల్డ్ బాండ్ల ద్వారా సమీకరించిన రుణాలేమీ లేవు. అయితే ఇప్పుడు ఆ మార్గంలో అందుకున్న అప్పుల విలువ రూ.9,089 కోట్లుగా ఉన్నది. ఇక మార్కెట్ ఆధారిత రుణాలూ గతంతో పోల్చితే 47.5 శాతం పెరిగి రూ.52 లక్షల కోట్లకుపైగా పేరుకుపోయాయి.

ద్రవ్యలోటు లక్ష్యాలకు దెబ్బ

ప్రభుత్వ ఆదాయానికి, వ్యయానికి మధ్య అంతరం తారాస్థాయికి చేరుతుండటంతో ద్రవ్యలోటు లక్ష్యాలు దెబ్బతింటున్నాయి. ఆదాయం కంటే ఖర్చులు పెరిగిపోతుండటంతో పాలనాపరమైన నిర్వహణలో భాగంగా ప్రభుత్వం అప్పుల బాట పడుతున్నది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లను ఆకట్టుకోవడంలో భాగంగా సంక్షేమ పథకాల కేటాయింపులను పెంచుతుండటం కూడా ఆర్థిక క్రమశిక్షణకు భంగం వాటిల్లుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ద్రవ్యలోటును దేశ జీడీపీలో 3.3 శాతానికి (రూ.6.24 లక్షల కోట్లు) కట్టడి చేస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18)లో ద్రవ్యలోటును 3.5 శాతానికే కట్టడి చేశారు. అయితే గతేడాది నవంబర్‌తో ముగిసిన ఎనిమిది నెలల కాలంలోనే ద్రవ్యలోటు రూ.7.17 లక్షల కోట్లకు చేరింది. ఇంకా నాలుగు నెలలు మిగిలి ఉండగానే 114.8 శాతంగా నమోదు కావడం ప్రభుత్వాన్ని కలవరపెడుతున్నది.

నెరవేరని పెట్టుబడుల ఉపసంహరణ

ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా ఖజానాకు రూ.80,000 కోట్ల నిధులను తరలించాలని మోదీ సర్కారు లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే ఇప్పటిదాకా రూ.34,000 కోట్లకుపైగానే సమీకరించింది. ఓ వైపు పెరుగుతున్న రుణ భారం.. మరోవైపు నెరవేరని పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం.. ఇంకోవైపు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తదితర మార్గాల ద్వారా పడిపోతున్న ఆదాయం.. మోదీ సర్కారుపై ముప్పేట దాడినే చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వ సంస్థల నుంచి డివిడెండ్లపై ఆశలు పెట్టుకున్న ప్రభుత్వం.. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మిగులు నిల్వలపై కన్నేసింది. ఆ సొమ్ముతో పాత పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో ఏర్పడిన ఇబ్బందులనేగాక, ఐఎల్అండ్ఎఫ్ఎస్ రుణ సంక్షోభం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో కలిగిన సమస్యలనూ అధిగమించవచ్చునని భావించింది. అది కుదరకపోవడంతో ఆర్బీఐ నుంచి మధ్యంతర డివిడెండ్‌ను మోదీ సర్కారు కోరుతున్న విషయం తెలిసిందే.

ఆకట్టుకున్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ3లో 20 శాతం పెరిగిన లాభం

న్యూఢిల్లీ, జనవరి 19: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.5,585.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు ప్రముఖ ప్రైవేట్ రంగ సంస్థయైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రకటించింది. నికర వడ్డీ ఆదాయం అధికమవడం వల్లనే లాభాల్లో 20.3 శాతం పెరుగుదల కనిపించిందని బ్యాంక్ ఒక ప్రకటనలో వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికిగాను రూ.4,642.6 కోట్ల లాభాన్ని గడించింది. ఆదాయం విషయానికి వస్తే రూ.24,450.44 కోట్ల నుంచి రూ.30,811.27 కోట్లకు ఎగబాకింది. సమీక్షకాలంలో నికర వడ్డీ ఆదాయం 21.9 శాతం పెరిగి రూ.12,576.8 కోట్లకు చేరుకోవడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.38 శాతానికి పెరుగగా, నికర ఎన్‌పీఏ 0.42 శాతానికి పరిమితమైంది. అయినప్పటికీ మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు మరింత పెరిగి రూ.2,211.53 కోట్లకు చేరుకున్నాయి. ఇతర మార్గాల ద్వారా బ్యాంకుకు రూ.4,921.01 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలంలో రూ.85,393.5 కోట్ల ఆదాయంపై రూ.15,193 కోట్ల నికర లాభాన్ని గడించింది. డిసెంబర్ 31 నాటికి బ్యాంక్ బ్యాలెన్స్ షీట్ రూ.11,68,556 కోట్లకు చేరుకున్నది. అలాగే డిపాజిట్లు 22 శాతం పెరిగి రూ.8,52,502 కోట్లకు చేరుకోగా, అడ్వాన్స్‌లు 24 శాతం ఎగిసి రూ.7,80,951 కోట్లకు ఎగబాకాయి.



ఎల్ అండ్ టీకి సెబీ షాక్

■ **రూ.9 వేల కోట్ల బైబ్యాక్‌కు నిరాకరణ**

న్యూఢిల్లీ, జనవరి 19: దేశంలో అతిపెద్ద మౌలిక రంగ సంస్థ లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్ అండ్ టీ)కి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గట్టి షాకిచ్చింది. రూ.9 వేల కోట్ల షేర్ల బైబ్యాక్ అనుమతికి నిరాకరించింది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అందించిన సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. బైబ్యాక్ ప్రతిపాదన సెబీ, కంపెనీల చట్టంలో ఉన్న నిబంధనలకు అనుగుణంగా లేకపోవడం వల్లనే తిరస్కరించినట్లు సంస్థ వెల్లడించింది. 6.1 కోట్ల షేర్లను తిరిగి కొనుగోలు చేయాలని కంపెనీ భావించింది. ఒక్కో షేరుకు రూ.1,475 చొప్పున మొత్తం రూ.9 వేల కోట్ల నిధులను ఇందుకోసం వెచ్చించనున్నది. అక్టోబర్ 15 నాటికి కంపెనీ షేర్లు కలిగివున్న వారికి మాత్రమే దీనికి అర్హులు.

ఇద్దరు పీఎన్‌బీ ఈడీలపై వేటు

చెన్నై, జనవరి 19: బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద కుంభకోణానికి కారణమైన పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)కి చెందిన మరో ఇద్దరి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లపై వేటు వేసింది కేంద్ర ప్రభుత్వం. వీరిలో సంజీవ్ శరన్, కే వీరా బ్రహ్మాజీ రావులు ఉన్నారు. వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ బ్యాంకును రూ.13,500 కోట్ల రుణం తీసుకొని దొంగచాటున విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇద్దరు ఈడీలపై కేంద్రం వేటు వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు, సీనియన్ ఉద్యోగుల చేతివాటం లేకుండా ఇలాంటి కుంభకోణాలు జరుగవని ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు. ఇలా సీనియర్ ఉద్యోగులపై వేటువేయడం 1970 తర్వాత ఇదే తొలిసారని ఆయన వ్యాఖ్యానించారు. గతేడాది జూలై 3న వీరిద్దరికి కేంద్రం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిద్దరిపై వేటు వేయడం మంచిదే కానీ, ఈ మోసంలో మరింత మంది సీనియర్ అధికారులు ఉన్నారని, వీరిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఓబీసీ టౌన్ హాల్ సమావేశం

హైదరాబాద్, జనవరి 19: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ).. శనివారం ఇక్కడ టౌన్ హాల్ సమావేశాన్ని నిర్వహించింది. బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ అల్సే ఎస్ నేతృత్వంలో ఓ ప్రముఖ హోటల్‌లో జరిగిన ఈ సమావేశానికి హైదరాబాద్, విజయవాడ సర్కిల్ ఆఫీసులు, శాఖల్లోని సిబ్బంది అంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ జ్యోతి ప్రజ్వలనం చేసి సమావేశాన్ని ప్రారంభించగా, హైదరాబాద్ సర్కిల్ అధిపతి అరుణ్ కుమార్ అగర్వాల్ స్వాగతోపన్యాసం ఇచ్చారు. ఇన్నేండ్ల బ్యాంక్ ప్రయాణాన్ని తెలియజేశారు.

రెరాలో ఫిర్యాదులు మొదలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మోసపూరిత ప్రమోటర్ల నుంచి రక్షించే 'రెరా' యంత్రాంగానికి కొనుగోలుదారుల నుంచి ఫిర్యాదులు మొదలయ్యాయి. రెరా కార్యాలయం ప్రారంభమైన నాటి నుంచి కొందరు వృద్ధులు స్వయంగా కార్యాలయానికి వచ్చి, పలువురు ప్రమోటర్లపై ఫిర్యాదు చేస్తున్నారని తెలిసింది. వీరంతా రియల్టర్లు మోసం చేసిన తీరును అక్కడి ఉన్నతాధికారులకు వివరిస్తున్నారని సమాచారం. అయితే అధిక శాతం మంది 2017 జనవరి 1 కంటే ముందు ప్రారంభమైన ప్రాజెక్టుల మీదే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తున్నారని రెరా సిబ్బంది చెబుతున్నారు. అలాగే ఈ-మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు. కాగా, ప్రమోటర్లు చేసే మోసాలపై ఇటీవల హెచ్ఎండీఏ రెరాకు ఫిర్యాదు చేయడం తెలంగాణ నిర్మాణ రంగంలో చర్చనీయాంశంగా మారింది. శామీర్‌పేట్‌లోని తుర్కపల్లిలో చంద్రా గ్రూప్ అనే సంస్థ యాభై మూడు ఎకరాల్లో అక్రమ లే-అవుట్ వేసిందని రెరా విభాగానికి హెచ్ఎండీఏ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు హైదరాబాద్‌లో అధిక శాతం డెవలపర్లు సకాలంలో ఫ్లాట్లను అందించడానికే ప్రయత్నిస్తున్నారని, ఒకట్రెండు సంస్థలు చేసే పొరపాట్లను మొత్తం నిర్మాణ రంగానికి ఆపాదించడం సరికాదని పలు నిర్మాణ సంఘాలు అంటున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రెరా పోర్టల్‌లో 170కి పైగా ప్రాజెక్టులు నమోదయ్యాయి. వాటిలో ఏమైనా ఫిర్యాదులుంటే పరిష్కరిస్తామని తెలంగాణ రెరా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రమోటర్ మున్సిపాలిటీల్లో ఒక లే-అవుట్‌కు అనుమతి తీసుకుంటే.. దాన్ని రెండేండ్లలోపు అభివృద్ధి చేయాలన్నది రెరా నిబంధన. అదే కార్పొరేషన్లలో మూడేండ్లలోపు అప్పగించాలి.

ఏడాదిలోగా 200 'పేటూ' రెస్టారెంట్లు



హైదరాబాద్, జనవరి 19: త్వరితగతంగా రెస్టారెంట్ సేవలు అందించే 'పేటూ' హైదరాబాద్‌లో మరో అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. ఇప్పటికే మూడు రెస్టారెంట్లను ఏర్పాటు చేసిన సంస్థ..తాజాగా తన 4వ అవుట్‌లెట్‌ను శనివారం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సంస్థకు ఇది 43వ రెస్టారెంట్. ఈ సందర్భంగా కంపెనీ ఫౌండర్ రితేష్ మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశీయంగా 200 రెస్టారెంట్లను ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. గడిచిన రెండేండ్లకాలంలోనే సంస్థ 200 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది.

రాష్ట్రంలో మరో రెండు చేనేత శిక్షణ కేంద్రాలు

■ **వరంగల్, సిద్దిపేటలో ఏర్పాటు చేయనున్న మైక్రోసాఫ్ట్**

హైదరాబాద్, జనవరి 19: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు టెక్నాలజీ పరంగా శిక్షణ ఇవ్వడానికి మరో రెండు సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్. ఇప్పటికే పోచంపల్లి, నారాయణపేట్, రాజోల్, చౌటుప్పల్ వద్ద శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, త్వరలో వరంగల్, సిద్దిపేటలలో కూడా అలాంటివే ఏర్పాటు చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ చిత్రా సూద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్, నెఫ్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కేంద్రాల ద్వారా మూడు నెలల పాటు 1,500 మందికిపైగానే శిక్షణ పొందారని, వీరిలో 140 మందికి సర్టిఫికేట్‌ను అందచేయడం జరిగిందన్నారు. ప్రధానంగా ఈ శిక్షణ కార్యక్రమం.. టెక్నాలజీ రంగం ద్వారా చేనేత కార్మికులను చైతన్య పరుచడంతోపాటు డిజైనింగ్‌లో మెలకువల్ని, వినియోగదారులతో నేరుగా అనుసంధానం కావడానికి దోహదం చేస్తున్నది. ఈ చేనేత సాధికారత సెంటర్ల ద్వారా శిక్షణ పొందిన వారి ఆదాయం సగటున 20-25 శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా వీరికి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.



ప్రత్యేక ఈ-కామర్స్ పోర్టల్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఐటీ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మైక్రోసాఫ్ట్ ఉన్నతాధికారులు

ప్రత్యేక ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్

చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను నేరుగా విక్రయించేందుకుగాను మైక్రోసాఫ్ట్ ఇండియా నూతన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేసింది. దాతృత్వ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన 'రీవేవ్' వెబ్‌సైట్‌ను రాష్ట్ర ఐటీ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ శనివారం ప్రారంభించారు. చేనేత కళాకారులకు అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ఈ పోర్టల్.. తాము నేసిన బట్టలను నేరుగా వినియోగదారుడికి విక్రయించేందుకు నేతన్నలకు సహాయపడనున్నది. ప్రధానంగా ఈ వెబ్‌సైట్‌లో సంప్రదాయ డిజైన్ బట్టలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. నేత కార్మికులకు అందిస్తున్న శిక్షణ ద్వారా భవిష్యత్తులో కొత్త డిజైన్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన నేతన్నలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటున్నదని, ఇప్పటికే పలు రాయితీలు, వడ్డీలేని రుణాలు అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 43 లక్షల మంది నేత కార్మికులు ఉన్నారన్నారు.



ఫెదరర్‌తో విరుష్క జోడీ

ద్వైపాక్షిక వన్డే సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించిన భారత కెప్టెన్ విరాట్‌కోహ్లీ ఆస్ట్రేలియాలో ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాడు. వీలు చిక్కినప్పుడల్లా భార్య అనుష్కశర్మతో కలిసి ఎంజాయ్ చేస్తున్నాడు. శనివారం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విరుష్క జోడీ తళుక్కుమంది. తమ అభిమాన ఆటగాడు, స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌ను రాడ్ లీవర్ ఎరీనాలో కలిసి కొద్దిసేపు సరదాగా గడిపారు. ముగ్గురు కలిసి ఫొటోలకు ఫోజిచ్చారు. ఫెదరర్‌తో దిగిన ఫొటోను కోహ్లీ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. 'ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరిచిపోలేని రోజు. ఆస్ట్రేలియా సమ్మర్‌ను విజయవంతంగా ముగించడం చాలా సంతోషంగా ఉంది. ఆసీస్ ఓపెన్ ఎప్పటికీ గ్రేట్‌ఫుల్' అని రాసుకొచ్చాడు. మరోవైపు ఆస్ట్రేలియన్ ఓపెన్ అధికారిక ట్విట్టర్ 'ముగ్గురు దిగ్గజాలు ఒక ఫొటోలో' అని ట్వీట్ చేసింది. శనివారం రాడ్ లీవర్ ఎరీనాలో సెర్బియా టెన్నిస్ కింగ్ నోవాక్ జొకోవిచ్, డెనిస్ షపలోవ్ మ్యాచ్‌తో పాటు సెరెనా విలియమ్స్ పోరును విరుష్క జోడీ ప్రత్యక్షంగా వీక్షించింది. భగభగ మండుతున్న ఎండలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను ఆస్వాదిస్తూ గడిపింది.

వెళ్లడానికి వీలులేదు..

- ఫెదరర్‌ను అడ్డుకున్న భద్రతా సిబ్బంది

రోజర్ ఫెదరర్..టెన్నిస్‌పై అవగాహన ఉన్న ప్రతి ఒక్కరి నోళ్లలో నానే పేరు. లెక్కకు మిక్కిలి టైటిళ్లతో టెన్నిస్‌కు సరికొత్త సొబగులు అద్దిన ఫెదరర్ అంటే ఎవరో తెలియని వారు ఉండకపోవచ్చు. ఈ ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా..అతన్ని గుర్తుపట్టని వాళ్లు ఉండరు. కానీ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఫెదరర్‌కు ఊహించని అనుభవం ఎదురైంది. ప్రాక్టీస్ కోసం లాకర్ రూమ్ దగ్గరకు చేరుకున్న రోజర్‌ను అక్కడి భద్రతా సిబ్బంది అడ్డుకుని లోపలికి వెళ్లేందుకు అనుమతించలేదు. టోర్నీ గుర్తింపు కార్డు ఉంటేనే లోనికి అనుమతి ఉంటుందంటూ సిబ్బంది చెప్పడం అక్కడి సీసీ టీవీ ఫుటేజిలో స్పష్టంగా కనిపించింది. దీంతో భద్రతా సిబ్బందితో గొడవకు దిగకుండా తన తప్పును గ్రహించిన స్విస్ గ్రేట్ కొద్దిసేపు అక్కడే ఉండిపోయాడు. తన సహాయక సిబ్బంది వచ్చిన తర్వాత అతనితో కలిసి లోపలికి వెళ్లాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ నిర్వాహణ ఏర్పాట్లపై అభిమానులతో పాటు అందరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భారత్-ఎ జట్టులో పంత్

- రహానేకు సారథ్య బాధ్యతలు


రిషబ్ పంత్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ లయన్స్‌తో తలపడతే భారత్-ఎ జట్టును శనివారం ప్రకటించారు. ఈనెల 23 నుంచి ఐదు మ్యాచ్‌ల సిరీస్ జరుగనుంది. ఇందులో భాగంగా తొలి మూడు, తర్వాతి రెండు వన్డేలకు వేర్వేరుగా జట్లను ప్రకటించారు. అజింక్యా రహానేకు సారథ్య బాధ్యతలు అప్పగించారు. ఈనెల 29, 31న జరిగే చివరి రెండు వన్డేల్లో వికెట్ కీపర్ రిషబ్ పంత్ బరిలోకి దిగుతాడు. ఆ తర్వాత వచ్చే నెల 6 నుంచి జరిగే టీ20 సిరీస్ కోసం న్యూజిలాండ్‌కు బయలుదేరి వెళ్తాడు. హైదరాబాదీ హనుమ విహారి, శ్రేయాస్ అయ్యర్, శార్దూల్ ఠాకూర్, క్రునాల్ పాండ్యా జట్టులో చోటు దక్కించుకున్నారు. చివరి రెండు మ్యాచ్‌లకు మహారాష్ట్ర బ్యాట్స్‌మన్ అంకిత్ బావ్నే కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఫిబ్రవరి 7 నుంచి వాయనాడ్‌లో లయన్స్‌తో రెండు నాలుగు రోజుల మ్యాచ్ కూడా జరుగనున్నాయి.

తొలి మూడు వన్డేలకు జట్టు: రహానే (కెప్టెన్), అన్మోల్‌ప్రీత్, రితురాజ్, శ్రేయాస్, విహారి, అంకిత్ బావ్నే, ఇషాన్ కిషన్, క్రునాల్ పాండ్యా, అక్షర్ పటేల్, మయాంక్ మర్కండే, జయంత్ యాదవ్, సిద్ధార్థ్ కౌల్, శార్దూల్ ఠాకూర్, దీపక్ చాహర్, నవ్‌దీప్ సైనీ.

4, 5 వన్డేలకు జట్టు: బావ్నే (కెప్టెన్), రితురాజ్, అన్మోల్‌ప్రీత్, రికీ భుయ్, సిద్ధేశ్ లాడ్, హిమ్మత్ సింగ్, పంత్, దీపక్ హుడా, అక్షర్ పటేల్, రాహుల్ చాహర్, జయంత్ యాదవ్, నవ్‌దీప్ సైనీ, ఆవేశ్ ఖాన్, దీపక్ చాహర్, శార్దూల్.

లంకతో టెస్టులకు హాజిల్‌వుడ్ దూరం

మెల్‌బోర్న్: వెన్ను నొప్పి కారణంగా ఆసీస్ పేసర్ హాజిల్‌వుడ్.. శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో రిచర్డ్‌సన్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఇంగ్లండ్‌లో జరిగే వన్డే ప్రపంచకప్ వరకు హాజిల్‌వుడ్ పూర్తిస్థాయిలో కోలుకుంటాడని క్రికెట్ ఆస్ట్రేలియా ఫిజియోథెరపిస్ట్ డేవిడ్ బీక్లీ ఆశాభావం వ్యక్తం చేశాడు. 'వెన్నులో నొప్పి వస్తుందని గత కొన్ని రోజులుగా హాజిల్‌వుడ్ బాధపడుతున్నాడు. కింది భాగంలోని వెన్నుపూసలపై ఒత్తిడి పడుతున్నదని స్కానింగ్‌లో తేలింది' అని బీక్లీ పేర్కొన్నాడు.

ప్రిక్వార్టర్స్‌లో ముఖాముఖి పోరు
జొకోవిచ్, నిషికోరి ముందంజ
ఆస్ట్రేలియన్ ఓపెన్

సెరెనా X హాలెప్



సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రోజులు మారుతున్నా కొద్ది పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. భానుడి భగభగల మధ్య గెలుపు కోసం ఆటగాళ్లు అహరహం శ్రమిస్తున్నారు. పాయింట్ పాయింట్‌కు ప్రత్యర్థి ఎత్తులకు పైఎత్తులు వేస్తూ పట్టుసాధిస్తున్నారు. టైటిల్ ఫేవరేట్లుగా బరిలోకి దిగిన సెరెనా విలియమ్స్, సిమోనా హాలెప్ ప్రిక్వార్టర్స్‌లో ముఖాముఖి తలపడబోతున్నారు. వీనస్ విలియమ్స్‌పై విజయమందుకున్న హాలెప్..సెరెనాతో పోరుకు సై అంటున్నది. పాపకు జన్మనిచ్చినా..తనలో చేవ తగ్గలేదని నిరూపిస్తూ అమెరికా టెన్నిస్ క్వీన్ రికార్డు గ్రాండ్‌స్లామ్ వేటలో దిగ్విజయంగా దూసుకెళుతున్నది. గాయం నుంచి తేరుకుని ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్న హాలెప్ ఈసారైనా టైటిల్ ఒడిసిపట్టుకోవాలన్న పట్టుదలతో ఉన్నది. దీంతో ఇరువురి మధ్య ప్రిక్వార్టర్స్ పోరు ఫైనల్‌ను తలపించేలా కనిపిస్తున్నది. తనకు ఎదురేలేదన్నట్లుగా సెర్బియా టెన్నిస్ స్టార్ జొకోవిచ్ దూసుకెళుతుండగా, జపాన్ యోధుడు నిషికోరి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు.



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మ్యాచ్‌లు యుద్ధాన్ని తలిపిస్తున్నాయి. ఆటగాళ్లు ప్రతి పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో అభిమానులకు పసందైన విందు అందిస్తున్నాయి. పోటీలకు ఆరో రోజైన శనివారం మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హాలెప్..సెరెనా విలియమ్స్, గార్బైన్ ముగురుజా, ప్లిస్కోవా, మ్యాడిసన్ కీస్, నవోమీ ఒసాకా ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో నోవాక్ జొకోవిచ్, రవోనిక్, కియి నిషికోరి, మెద్వదేవ్ ప్రిక్వార్టర్స్ పోరులో నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత్, ఆస్ట్రేలియా ద్వయం లియాండర్‌పేస్, సమంతా స్టోసర్ 6-4, 7-5 తేడాతో నెదర్లాండ్స్, చెక్ రిపబ్లిక్ జోడీ వెస్లె కూల్ఫ్, క్వెటా పెస్చ్కెపై విజయంతో ప్రిక్వార్టర్స్‌లో నిలిచారు.

అక్కపై గెలిచి..

గతేడాది తృటిలో టైటిల్ చేజార్చుకున్న రొమేనియా టెన్నిస్ స్టార్ సిమోనా హాలెప్ ఈసారి ఎలాగైనా తన కలను సాకారం చేసుకోవాలన్న పట్టుదలతో కనిపిస్తున్నది. కాయియా కనేపి, సోఫియా కెనిన్‌లను ఓడించిన జోరులో శనివారం వీనస్ విలియమ్స్‌తో మ్యాచ్ బరిలోకి దిగిన హాలెప్ 6-2, 6-3 తేడాతో అలవోక విజయం సాధించింది. గతేడాది ఆగస్టు నుంచి విజయమెరుగని హాలెప్ వరుస సెట్లలో మ్యాచ్ గెలువడం ఇదే తొలిసారి. వెన్నునొప్పి గాయం నుంచి తేరుకుని ఎలాంటి అంచనాలకు లేకుండా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అడుగుపెట్టిన ఈ రొమేనియా స్టార్ ఒక్కో అడ్డంకిని అధిగమిస్తూ ముందుకెళుతున్నది. ఆదిలో వీనస్‌కు దీటైన పోటీనివ్వడంలో తడబడ్డ హాలెప్ ఐదో గేమ్‌లో పుంజుకుని 3-2 తో ఆధిక్యం కనబరిచింది. తొలి సెట్ కైవసంతో దూకుడు కనబరిచిన రెండో గేమ్‌లో నాలుగు బ్రేక్‌పాయింట్లను దక్కించుకుని పూర్తి పట్టు సాధించే ప్రయత్నం చేసింది. మరోవైపు వీనస్ పుంజుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. ఓ దశలో 3-3తో స్కోరు సమమైనా వీనస్ అనవసర తప్పిదాలు ఆమె కొంప ముంచాయి. వీనస్ బలహీనతలను సొమ్ముచేసుకుంటూ హాలెప్ సంధించిన షాట్లకు సరైన సమాధానం లేకపోయింది. అప్పటికే ఒకింత ఒత్తిడిలోకి వెళ్లిన వీనస్..రెండు డబుల్ ఫాల్ట్స్‌తో మ్యాచ్‌ను జారవిడ్చుకుంది. కండ్లుచెదిరే ఫోర్‌హ్యాండ్ షాట్‌తో హాలెప్ మ్యాచ్ గెలిచి విజయనాదం చేసింది.

సర్వీస్ కోల్పోకుండా..

సెరెనా విలియమ్స్ తన రాకెట్ పవరేంటో మరోమారు చూపించింది. బిడ్డకు తల్లి అయినా తనలో దూకుడు తగ్గలేదని నిరూపిస్తూ వరుస విజయాలతో దూసుకెళుతున్నది. రికార్డు స్థాయిలో ఎనిమిదో ఆస్ట్రేలియన్ టైటిల్‌తో సహా అత్యధిక గ్రాండ్‌స్లామ్ టోర్నీలను దక్కించుకోవాలన్న కసితో సెరెనా ముందుకెళుతున్నది. ఈ క్రమంలో శనివారం డయానా యస్త్రమెస్కాపై 6-2, 6-1తో విలియమ్స్ సునాయాస విజయం సాధించింది. గంటా ఏడు నిమిషాల పాటు జరిగిన ఏకపక్ష పోరులో సెరెనా ఒక్క సర్వీస్ గేమ్ కూడా కోల్పోలేదు. తన సుదీర్ఘ అనుభవాన్నంతా రంగరిస్తూ 18 ఏండ్ల ఉక్రెయిన్ ప్లేయర్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించింది. తొలి సెట్‌లోనే వరుసగా నాలుగు గేమ్‌లను దక్కించుకున్న ఈ అమెరికా స్టార్..వెనకకు తిరిగి చూడలేదు. కండ్లు చెదిరే స్పీడ్‌తో సెరెనా సంధించిన సర్వ్‌లకు ప్రత్యర్థి నుంచి సమాధానం లేకపోయింది. ఇదే అదునుగా మరింత జోరు పెంచిన సెరెనా ఉక్రెయిన్ ప్లేయర్‌కు ఏ దశలోనూ అవకాశమివ్వలేదు. మ్యాచ్ ముగిసిన తర్వాత భావోద్వేగానికి లోనైన డయానాను సెరెనా ఓదార్చిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈనెల 21న జరిగే ప్రిక్వార్టర్స్ పోరులో ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హాలెప్‌తో సెరెనా తలపడుతుంది.


డయానా

జొకోవిచ్ జోరు



టైటిల్ ఫేవరెట్లలో ఒకడైన సెర్బియా టెన్నిస్ స్టార్ నోవాక్ జొకోవిచ్ ప్రిక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన ఆఖరి రౌండ్ పోరులో జొకోవిచ్ 6-3, 6-4, 4-6, 6-0 తేడాతో డెనిస్ షపలోవ్(కెనడా)పై విజయం సాధించాడు. దీంతో తిరిగి ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. తొలి సెట్ నుంచే దూకుడు కనబరిచిన జొకో..19 ఏండ్ల కెనడా ఆటగాడు డెనిస్‌ను ఓ ఆటాడుకున్నాడు. తన 14 గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల అనుభవంతో మైదానంలో చెలరేగుతూ కీలక పాయింట్లు కొల్లగొట్టాడు. పదునైన సర్వ్‌లకు తోడు బ్యాక్‌హ్యాండ్, బేస్‌లైన్ గేమ్‌తో ప్రత్యర్థికి చుక్కలు చూపెట్టాడు. మెరుపు వేగంతో జొకో కొట్టిన సర్వీస్‌లకు డెనిస్ పోటీనివ్వలేకపోయాడు. తొలి రెండు సెట్లను అలవోకగా దక్కించుకున్న ఈ సెర్బియా స్టార్‌కు మూడో సెట్‌లో అనుకోని ప్రతిఘటన ఎదురైంది. నిర్వాహకులు ఫ్లడ్‌లైట్లు వేయడంతో జొకోవిచ్ ఒకింత ఆగ్రహానికి గురయ్యాడు. ఏకాగ్రత దెబ్బతినేలా ఎందుకిలా చేస్తున్నారంటూ నిర్వహకులపై జొకో గట్టిగా అరిచాడు. చీకటి కావడానికి ఇంకా నాలుగు గంటల సమయమున్నా..లైట్లు వేయాల్సిన అవసరం ఏమొచ్చిందంటూ ఆగ్రహంతో ఊగిపోయాడు. అయినా వెనకంజ వేయకుండా నాలుగో సెట్‌ను 6-0తో దక్కించుకుని మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. ఈనెల 21న రష్యా 15వ సీడ్ ఆటగాడు డానిల్ మెద్వదేవ్‌తో జొకో తలపడుతాడు. ఒకవేళ ఇందులో గెలిస్తే..సెమీస్‌లో రఫెల్ నాదల్‌ను ఎదుర్కొవాల్సి ఉంటుంది. మిగతా మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ 6-3, 6-3, 6-2తో బోల్ట్‌పై, రవోనిక్ 6-4, 6-4, 7-6(10-6)తో హెర్బర్ట్‌పై, కారెనో బుస్టా 6-2, 6-4, 2-6, 6-4తో ఫొగ్నినిపై, నిషికోరి 7-6, 6-1, 6-2తో సొసాపై విజయాలు సాధించారు.

పతకాల్లో తెలంగాణ టాప్

హోరాహోరీగా జాతీయస్థాయి కరాటే పోటీలు



కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జాతీయస్థాయి కరాటే పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో పోటీలు అభిమానులకు ఆసక్తి కల్గిస్తున్నాయి. పోటీలకు ఆతిథ్యమిస్తున్న తెలంగాణ రాష్ట్రం 86 పతకాలతో టాప్‌లో దూసుకెళుతున్నది. రాష్ర్టానికి చెందిన కరాటే క్రీడాకారులు కుమిటీ, కటా, స్పారింగ్ విభాగాల్లో పతకాల పంట పండిస్తున్నారు. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పతకాలు ఒడిసిపట్టుకుంటున్నారు. రెండో రోజు పోటీల్లో తెలంగాణతో పాటు హర్యానా, ఏపీ, తమిళనాడు, పంజాబ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ క్రీడాకారులు పోటీపడ్డారు. దక్షిణాఫ్రికాలో గ్రూప్ ఆఫ్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న దినేశ్‌నాయుడు, సాధిక్ పాషా శనివారం పోటీలను సందర్శించారు.




ఉమేశ్ (5/23)

రంజీ సెమీస్‌లో సౌరాష్ట్ర

భారీ లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా రికార్డు
హార్విక్ దేశాయ్ సెంచరీ

లక్నో: రంజీ ట్రోఫీలో సౌరాష్ట్ర జట్టు సంచలనం సృష్టించింది. హార్విక్ దేశాయ్ (259 బంతుల్లో 116; 16 ఫోర్లు) కెరీర్‌లో తొలి ఫస్ట్‌క్లాస్ సెంచరీ నమోదు చేయడంతో.. శనివారం ముగిసిన క్వార్టర్‌ఫైనల్లో సౌరాష్ట్ర 6 వికెట్ల తేడాతో ఉత్తరప్రదేశ్‌పై గెలిచింది. యూపీ నిర్దేశించిన 372 పరుగుల లక్ష్యాన్ని సౌరాష్ట్ర రెండో ఇన్నింగ్స్‌లో 115.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. దీంతో రంజీ చరిత్రలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన తొలి జట్టుగా రికార్డులకెక్కింది. 2008-09 సీజన్‌లో అస్సాం.. సర్వీసెస్‌పై 371 పరుగుల లక్ష్య ఛేదనే ఇప్పటివరకు అత్యుత్తమం. 195/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు ఆట కొనసాగించిన సౌరాష్ట్ర బ్యాట్స్‌మెన్ నిలకడగా ఆడారు. ఓ ఎండ్‌లో హార్విక్ స్థిరంగా ఆడగా, ఓవర్‌నైట్ బ్యాట్స్‌మన్ కమలేశ్ మక్వానా (7) తొందరగా ఔటయ్యాడు. ఈ దశలో స్నేల్ పటేల్ (72), చతేశ్వర్ పుజార (67 నాటౌట్), షెల్డన్ జాక్సన్ (73 నాటౌట్) వీరోచితంగా పోరాడటంతో కొండంత లక్ష్యం మంచులా కరిగిపోయింది. దేశాయ్ ఔటైన తర్వాత యూపీ కొత్త బంతితో ఇబ్బందిపెట్టినా.. పుజార, జాక్సన్ సమయోచితంగా ఆడుతూ కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. దేశాయ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

ఉమేశ్ దూకుడు..

మరో క్వార్టర్‌ఫైనల్లో ప్రస్తుత చాంపియన్ విదర్భ ఇన్నింగ్స్ 115 పరుగుల తేడాతో ఉత్తరాఖండ్‌ను ఓడించి సెమీస్ బెర్త్‌ను దక్కించుకుంది. పేసర్ ఉమేశ్ యాదవ్ (5/23), ఆదిత్య సర్వేటి (5/55) బౌలింగ్‌లో విజృంభించడంతో ఉత్తరాఖండ్ రెండో ఇన్నింగ్స్‌లో 65.1 ఓవర్లలో 159 పరుగులకే కుప్పకూలింది. 274 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో.. 152/5 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం ఆట కొనసాగించిన ఉత్తరాఖండ్.. 7 పరుగుల తేడాతో చివరి ఐదు వికెట్లను చేజార్చుకుంది. కర్ణవీర్ కౌశల్ (76) మినహా అందరూ విఫలమయ్యారు. విదర్భ పేసర్ల దెబ్బకు 8 మంది సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు.

సైనా ఓటమి

కౌలాలంపూర్: వరుస విజయాలతో హోరెత్తించిన భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు.. మలేషియా మాస్టర్స్‌లో కళ్లెం పడింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్‌లో నాలుగోసీడ్ కరోలినా మారిన్ (స్పెయిన్) 21-16, 21-13తో సైనాను ఓడించి ఫైనల్లోకి ప్రవేశించింది. 40 నిమిషాల పాటు సాగిన పోరాటంలో.. సైనా రెండుసార్లు స్కోర్లు సమం చేసినా స్పెయిన్ స్టార్ దూకుడు ముందు నిలబడలేకపోయింది. తొలి గేమ్ ఆరంభంలో మెరుగ్గా ఆడిన హైదరాబాదీ 5-2తో ముందంజ వేసినా... మారిన్ వరుసగా ఏడు పాయింట్లు గెలిచి బ్రేక్ వరకు 11-9 ఆధిక్యంలోకి వెళ్లింది. మరో రెండు పాయింట్లు నెగ్గి 13-9తో ఆధిక్యాన్ని పెంచుకున్న దశలో సైనా అద్భుతంగా పోరాడింది. చకచకా పాయింట్లు సాధిస్తూ 14-14తో స్కోరును సమం చేసింది. కానీ నెట్ వద్ద మారిన్ సూపర్ డ్రాప్స్‌తో వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్ పాయింట్ వద్ద నిలిచింది. ఈ దశలో సైనా కొట్టిన ఫోర్‌హ్యాండ్ షాట్‌ను అద్భుతంగా రిటర్న్ చేసి 20 నిమిషాల్లోనే గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో మరింత భిన్నంగా ఆడిన మారిన్ 6-1, 11-6తో దూసుకుపోయింది. పుంజుకునేందుకు సైనా చేసిన ప్రతి ప్రయత్నం విఫలంకావడంతో ప్రతి దశలో మారిన్ ఓ అడుగు ముందే ఉన్నది. అదే క్రమంలో క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో చెలరేగిన మారిన్.. 8 మ్యాచ్ పాయింట్లను సాధించింది. ఈ దశలో సైనా డీప్ కార్నర్‌లో ఓ మ్యాచ్ పాయింట్‌ను కాపాడుకున్నా.. తర్వాత స్పెయిన్ ప్లేయర్ నేరుగా కొట్టిన రిటర్న్ షాట్ సైనాను కట్టిపడేయడంతో ఓటమి తప్పలేదు.



రాహుల్, పాండ్యాలపై సస్పెన్షన్ ఎత్తివేయండి!

విచారణ పూర్తయ్యేదాకా ఆడుకోనివ్వాలన్న సీకే ఖన్నా



న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన క్రికెటర్లు కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యాలపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సీకే ఖన్నా.. పరిపాలన కమిటీ (సీవోఏ)కి విజ్ఞప్తి చేశాడు. విచారణ పూర్తయ్యే వరకు వాళ్లను టీమ్‌ఇండియాలోకి తీసుకోవాలని సూచించాడు. 'ఈ కేసు సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లింది. ధర్మాసనం వచ్చే వారం విచారణ కూడా చేపట్టనుంది. ఈ సమయంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎమ్) ఏర్పాటు చేసి క్రికెటర్ల అంశాన్ని చర్చించలేం. రాహుల్, పాండ్యా తప్పు చేశారు. వారిద్దర్ని సస్పెండ్ కూడా చేశారు. చేసిన తప్పుకు క్షమాపణలు కూడా చెప్పారు. కాబట్టి విచారణ పూర్తయ్యేలోపు వాళ్లను జట్టులోకి తీసుకుంటే బాగుంటుంది. వీలైనంత త్వరగా కివీస్‌తో సిరీస్‌కు వాళ్లను పంపిస్తే మంచిది' అని సీవోఏ చీఫ్ వినోద్ రాయ్‌కు రాసిన లేఖలో ఖన్నా పేర్కొన్నాడు. మరోవైపు ఇద్దరు క్రికెటర్ల భవితవ్యాన్ని తేల్చేందుకు అంబుడ్స్‌మన్‌ను నియమించాలని సీవోఏ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. అయితే ఇప్పటికిప్పుడు అంబుడ్స్‌మన్‌ను నియమించలేమన్న సుప్రీం.. ఆటగాళ్లపై చర్యలు తీసుకునే తుది అధికారం బోర్డుకే ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో 10 రోజుల్లోగా ఎస్‌జీఎమ్‌ను ఏర్పాటు చేయాలని దాదాపు 14 రాష్ట్ర సంఘాలు ఖన్నాను కోరాయి. తాత్కాలిక కోశాధికారి అనిరుధ్ చౌదరి కూడా అంబుడ్స్‌మన్‌ను నియమించాలని లేఖ రాశాడు. దీనిపై స్పందించిన ఖన్నా.. సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న అంశాలపై బోర్డు సమావేశం ఏర్పాటు చేయడం తగదని, అలా చేస్తే కోర్టు ధిక్కరణకు వస్తుందని స్పష్టంగా వివరించాడు. క్రికెటర్ల అంశాన్ని సీవోఏ, బీసీసీఐ అధికారులు వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నాడు. 'పాండ్యా, రాహుల్ అనుచితంగా మాట్లాడారు. ఇది పూర్తిగా తప్పే. అయితే వీళ్లిదర్ని దోషులుగా, చట్టాలను వ్యతిరేకించేవారిగా చూడొద్దని నా వ్యక్తిగత అభిప్రాయం. కీలకమైన వరల్డ్‌కప్‌నకు ముందు వీళ్లకు మ్యాచ్ ప్రాక్టీస్ అవసరం. నాలుగు నెలల సమయమే ఉంది. ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న క్రికెటర్లు.. నైతికంగా వాళ్లను వాళ్లు సరిదిద్దుకునే అవకాశాన్ని మనం కల్పించాలి' అని ఖన్నా వ్యాఖ్యానించాడు.

కేరళలో జరిగే జాతీయ హాకీ టోర్నీ కోసం శనివారం హైదరాబాద్‌లో ప్రకటించిన రాష్ట్ర జూనియర్ మహిళల జట్టు



పట్నంలో పల్లెఓటర్ల వేట

ప్రసన్నం చేసుకోవడానికి పంచాయతీ అభ్యర్థుల ప్రయత్నాలు

పలు గ్రామాల్లో వలస ఓటర్లే కీలకం ▪ పోటీపడి ఓటర్లను సంప్రదిస్తున్న అభ్యర్థులు

రంగారెడ్డి జిల్లా/ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే. ఊళ్లో ఉన్న ఓటర్లే కాదు.. పొట్టకూటికోసం వలస వెళ్లిన ఓటర్లూ అభ్యర్థుల గెలుపు, ఓటములను ప్రభావితం చేయనున్నారు. దీంతో సర్పంచ్ పదవికి పోటీపడుతున్న అభ్యర్థుల చూపంతా పట్నంలో ఉన్న పల్లె ఓటర్లవైపు మళ్లింది. అభ్యర్థులు ఇప్పుడు వారిని మచ్చిక చేసుకునే పనిలోపడ్డారు. ఎప్పటికప్పుడు ఫోన్లు చేసి 'నేను సర్పంచ్‌గా పోటీలో ఉన్నా.. నాకే ఓటు వేయాలి' అని కోరుతున్నారు. సోమవారం తొలివిడుత పంచాయతీ పోలింగ్ జరుగనున్నది. ఓటర్లకు ఖర్చుల కింద డబ్బులతోపాటు సకల మర్యాదలు చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లాలో వలస ఓటర్లే అధికం

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన పల్లెఓటర్లు ఎక్కువమంది హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ మండలాల ఓటర్లు అధికంగా లంగర్‌హౌస్, ఆర్మీమైసమ్మ, బండ్లగూడ, సన్‌సిటీ, శంషాబాద్, రాజేంద్రనగర్, నార్సింగ్, మణికొండ, పుప్పాలగూడ, గచ్చిబౌలి, మాదాపూర్‌లో.. శంకర్‌పల్లి ఓటర్లు పటాన్‌చెరు, బీడీఎల్, కూకట్‌పల్లి, మియాపూర్‌లలో ఉంటున్నారు. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిభట్ల ప్రాంతాల ఓటర్ల కర్మన్‌ఘాట్, ఎల్బీనగర్, బైరామల్‌గూడ, హయత్‌నగర్, వనస్థలిపురం, సంతోష్‌నగర్‌లో, కందుకూరు డివిజన్‌లోని అమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల ఓటర్లు ఎక్కువగా హైదరాబాద్ శివారులోనే జీవిస్తున్నారు.

ఫలితాన్ని శాసించేస్థాయిలో వలస ఓటర్లు

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఫలితాన్ని శాసించేస్థాయిలో వలస ఓటర్లు ఉన్నారు. దీంతో ఆయా గ్రామాల అభ్యర్థులు వలసదారుల ప్రసన్నానికి ప్రయత్నాలు చేస్తున్నారు. యాచారం మండలం నజ్దిక్ సింగారం పంచాయతీ ఎన్నికల్లో పట్నంలో స్థిరపడిన ఓటర్లు ఫలితాన్ని శాసించే స్థాయిలో ఉన్నారు. ఇక్కడి 50 శాతానికిపైగా ఓటర్లు బైరామల్‌గూడ, ఎల్బీనగర్ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నజ్దిక్ సింగారం జనరల్‌కు కేటాయించారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులంతా ప్రతిరోజు బైరామల్‌గూడలో ఉన్న తమ గ్రామానికి చెందిన సుమారు 300 మంది ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలోఉన్నారు.

అభ్యర్థుల్లోనూ ఎక్కువశాతం వలసదారులే

పంచాయతీ బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది నగరంలో స్థిరనివాసమున్నవారే ఉన్నారు. ఉదయం గ్రామానికి వచ్చి ప్రచారం నిర్వహించి రాత్రికి నగరానికి చేరుకుంటున్నారు. తమను గెలిపిస్తే తిరిగి స్వగ్రామాలకు వస్తామని కూడా అభ్యర్థులు ఓటర్లకు హామీఇస్తున్నారు.



గ్రామ స్వరాజ్యం




కల్వకుర్తి ఎమ్మెల్యే కుమార్తె సర్పంచ్‌గా ఏకగ్రీవం

తలకొండపల్లి: కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ కుమార్తె సంగీత సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ సర్పంచ్‌గా సంగీత, ఉప సర్పంచ్‌గా అజీజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు శనివారం ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంపీడీవో శ్రీనివాసాచార్యులు వీరికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, తావ్‌ర్యానాయక్, నారాయణ, జంగయ్య, రవి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సోపానం

సర్పంచ్ నుంచి డీడీసీ చైర్మన్ దాకా

▪ **లోక భూమారెడ్డి ప్రస్థానం**



ఆదిలాబాద్ / నమస్తే తెలంగాణ ప్రతినిధి: రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ (డీడీసీ) చైర్మన్ లోక భూమారెడ్డి సర్పంచ్‌గానే రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన లోక భూమారెడ్డి.. 1981, 1992లలో సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1992 నుంచి 1995 వరకు డీసీసీబీ చైర్మన్‌గా, 1995 నుంచి 1999 వరకు డీసీసీబీ డైరెక్టర్‌గా సేవలందించారు. 2011 నుంచి 2017 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా, 2017 నుంచి టీఆర్‌ఎస్ రాష్ట్రకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. 2017 ఫిబ్రవరిలో తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులయ్యారు.

రేపే తొలివిడుత పంచాయతీ పోరు

3,701 గ్రామ పంచాయతీల్లో ముగిసిన ప్రచారం

బరిలో 12,202 మంది సర్పంచ్ అభ్యర్థులు

28,976 వార్డుస్థానాలకు 70,094 మంది అభ్యర్థులు పోటీ

పోలింగ్‌కు సర్వం సిద్ధం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలివిడుత పోలింగ్ సోమవారం జరుగనున్నది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండగా, తొలివిడుత పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం సిద్ధంచేసింది. పోలింగ్‌కు 44 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలతో శనివారం సాయంత్రం 5 గంటలకు మైకులు మూగబోయాయి. తొలివిడుతలో 4,479 గ్రామాల్లో ఎన్నికలు జరుగాల్సి ఉండగా, రిజర్వేషన్లు కలిసిరాకపోవడం, కోర్టు కేసుల నేపథ్యంలో తొమ్మిది గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడంలేదు. ఈ విడుతలో మొత్తం 769 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 3,701 గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుండగా, సర్పంచ్‌స్థానాలకు 12,202 మంది అభ్యర్థులు బరిలోనిలిచారు. 39,822 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగాల్సి ఉండగా, కోర్టు కేసులు, రిజర్వేషన్లు అనుకూలంగా లేకపోవడంతో 192 వార్డుల్లో ఎన్నికలు వాయిదాపడ్డాయి. 10,654 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో 28,976 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, 70,094 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

మధ్యాహ్నం ఒంటిగంటవరకే పోలింగ్

తొలివిడుత పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇప్పటికే ఓటర్లకు స్లిప్పులు పంపిణీచేశారు. టీపోల్ యాప్‌తో డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. పోలింగ్‌ను సోమవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించి మధ్యాహ్నం ఒంటిగంటవరకే నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలనుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ముందుగా వార్డుస్థానాలు, ఆ తర్వాత సర్పంచ్‌స్థానాల ఓట్లను లెక్కిస్తారు. తొలివిడుత ఎన్నికల నిర్వహణకు 1,48,033 మంది పోలింగ్ సిబ్బందిని వినియోగిస్తున్నారు. 26 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నారు. వీరికి ఇప్పటికే పలు దఫాల్లో శిక్షణఇచ్చారు. తొలివిడుతలో పోలింగ్ జరిగే ప్రాంతాల అధికారులతో ఎన్నికల సంఘం అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో ఎస్ఈసీ నాగిరెడ్డి పర్యటించి, ఏర్పాట్లను పరిశీలించారు. తొలివిడుత ప్రచారం శనివారం ముగియగా, అభ్యర్థుల తరఫున పార్టీల ప్రజాప్రతినిధులు ప్రచారంచేశారు. ఓటర్లను ప్రలోభపెట్టకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్లు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఓటర్లను ఇబ్బందులకు గురిచేసేవారిపై నిఘాపెట్టారు. మద్యం, నగదు పంపిణీ జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపట్టారు.

మూడోవిడుతలో 1.19 లక్షల నామినేషన్లు

- **సర్పంచ్ స్థానాలకు 26,106.. వార్డులకు 93,518**
- **నేడు అభ్యంతరాల స్వీకరణ.. 22న తుది జాబితా**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పంచాయతీ ఎన్నికల మూడో విడుతలో మొత్తం 1,19,624 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 18వరకు నామినేషన్లను స్వీకరించారు. మొత్తం 4,116 గ్రామాల్లో ఎన్నికలు జరుగుతుండగా సర్పంచ్‌స్థానాలకు 26,106 మంది అభ్యర్థులు నామినేషన్లు, 36,729 వార్డులకు 93,518 నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం రాత్రివరకు వీటిని పరిశీలించి అర్హత సాధించిన నామినేషన్లను ప్రకటించారు. అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 21,444 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం నామినేషన్లపై అభ్యంతరాలను స్వీకరించి పరిశీలిస్తారు. ఈ నెల 22న తుదిజాబితా విడుదలచేసి గుర్తులు కేటాయించనున్నారు.

రూ.8.69 లక్షల విలువైన మద్యం సీజ్

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీల్లో రూ.8,69,100 విలువైన మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. రూ.1.34 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.1.20 లక్షలు, రూ.4,380 విలువైన మద్యం, జగిత్యాల జిల్లాలో రూ.3,180 విలువైన మద్యం, మెదక్ జిల్లాలో రూ.6,769 విలువైన మద్యం, వికారాబాద్ జిల్లాలో రూ.57,020 విలువైన మద్యం, నల్లగొండ జిల్లాలో రూ.14 వేలు, సూర్యాపేట జిల్లాలో రూ.4,75,020 విలువైన మద్యం, కరీంనగర్ జిల్లాలో రూ.2.58 లక్షల విలువైన మద్యం, రామగుండం కమిషనరేట్ పరిధిలో రూ.7,100 విలువైన మద్యం, రాచకొండ కమిషనరేట్ పరిధిలో రూ.58,140 విలువ చేసే మద్యాన్ని సీజ్‌చేశారు. నల్లగొండ జిల్లాలో నగదు తరలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు, సూర్యాపేట జిల్లాలో మద్యం తరలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు, రామగుండం కమిషనరేట్ పరిధిలో మద్యం తరలిస్తున్న బీఎస్పీ నాయకుడిపై కేసు నమోదు చేసినట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. తొమ్మిది మందిపై చర్యలు తీసుకున్నట్టు పేర్కొన్నారు.

సిమ్ స్వాప్ చేసి.. బ్యాంకు ఖాతాల్లోంచి చోరీ

- **మెయిల్స్ హ్యాక్ చేసి ఆన్‌లైన్ దోపిడీ**
- **నకిలీపత్రాలతో రిజిస్టర్డ్ సిమ్‌లు**
- **నైజీరియా నుంచి ఆపరేషన్.. పశ్చిమ బెంగాల్‌లో కార్యాచరణ**
- **గుట్టురట్టు చేసిన సైబరాబాద్ పోలీసులు**





సిమ్ స్వాప్‌తో నగదు తస్కరిస్తూ పట్టుబడిన ముఠా సభ్యులు. ఆన్‌లైన్ దోపిడీ తీరును పరిశీలిస్తున్న సీపీ సజ్జనార్

హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ: కంపెనీలు, కార్పొరేట్ సంస్థల మెయిల్స్ హ్యాక్ చేయడం.. వాటి నుంచి ఇంటర్నెట్ బ్యాంకింగ్ సమాచారం పొందటం.. దాని ఆధారంగా సిమ్ స్వాప్ చేసి ఓటీపీ సహాయంతో లక్షలు కాజేస్తున్న ఓ అంతరాష్ట్ర ముఠాను శనివారం సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నైజీరియా నుంచి ఈ తతంగం నడుపుతున్నట్టు నిర్ధారించారు. హైదరాబాద్ చింతల్‌కు చెందిన పంతం వెంకటకృష్ణ ఎలిమ్, షాలోమ్ కెమికల్ ఇండస్ట్రీస్ నిర్వహిస్తున్నారు. డిసెంబరు 15న (శనివారం) రాత్రి అతని ఫోన్ నంబరు డిస్‌కనెక్ట్ అయ్యింది. సోమవారం అతని ఇండస్ట్రీ బ్యాంక్ ఖాతాల నుంచి రూ.9 లక్షలు డ్రా అయినట్టు గుర్తించారు. మొబైల్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి డిస్‌కనెక్ట్‌పై ఫిర్యాదు చేశారు. తన పేరున గుర్తుతెలియని వ్యక్తులు కొత్త సిమ్ తీసుకొన్నట్టు తెలుసుకొని పోలీసులకు ఫిర్యాదుచేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసుల ఈ మోసానికి పాల్పడింది నైజీరియాలో ఉంటున్న ఎబిగ్‌బో ఇన్నోసెంట్ అని తేల్చారు. పశ్చిమ బెంగాల్‌లో ఉంటూ అతడికి సహకరిస్తున్న నైజీరియన్ ఓడాఫే హెన్రీ, సంతోష్‌బెనర్జీ, అంకన్‌సాహా, రజత్‌కుండ్, చందన్‌వర్మ, సంజీబ్‌దాస్‌ను అరెస్టు చేసి వారి నుంచి 17 మొబైల్స్, ల్యాప్‌టాప్, పాసుపోర్టు, రబ్బర్ స్టాంప్‌లు, చెక్‌బుక్‌లు, డెబిట్, ఆధార్, పాన్‌కార్డులు, లామినేషన్ మెషిన్లను స్వాధీనం చేసుకొన్నారు. ప్రధాన సూత్రధారి ఇన్నోసెంట్‌ను పట్టుకొనేందుకు ఆ దేశ రాయబార కార్యాలయానికి సమాచారం ఇచ్చినట్టు సీపీ సజ్జనార్ చెప్పారు.

సిమ్ స్వాపింగ్ ఇలా

నైజీరియాలో ఉంటున్న ఇన్నోసెంట్ ఇండియాలోని పలు కార్పొరేట్ సంస్థలు, కంపెనీల మెయిల్స్ హ్యాక్ చేసి.. వాటి ద్వారా ఇంటర్నెట్ బ్యాంకింగ్ లావాదేవీలు, ఖాతాలను అనుసంధానంగా ఉన్న మొబైల్ నంబర్లు సేకరిస్తున్నారు. వాటిని పశ్చిమబెంగాల్‌లో ఉన్న అనుచరులకు పంపి నకిలీపత్రాలు సృష్టించి డూప్లికేట్ సిమ్‌లు పొందుతారు. శనివారం సాయంత్రం ఒరిజినల్ సిమ్‌ను డీయాక్టివేట్ చేసి.. ఆన్‌లైన్ బాంకింగ్ లావాదేవీల్లో రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని వినియోగించి నగదును తస్కరిస్తారు. ఇలా 20 కంపెనీలకు టోకరా ఇచ్చినట్టు పోలీసులు తేల్చారు. డూప్లికేట్ సిమ్‌లు జారీ చేయటంలో టెలికామ్ సర్వీస్ ప్రొవైడర్ల నిర్లక్ష్యం ఉన్నదని పోలీసులు చెప్తున్నారు. పత్రాలు పరిశీలించకుండా సిమ్‌కార్డులు జారీచేసిన సర్వీసు ప్రొవైడర్లపై కేసులు నమోదు చేయనున్నట్లు, ఇలాంటి కేసు దేశంలోనే మొదటిదని సీపీ సజ్జనార్ వివరించారు.

మీడియా పాయింట్

టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి: ఎమ్మెల్సీ కర్నె



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేండ్లలో అభివృద్ధి, సంక్షేమంలో ఎంతో పురోగతి కనిపించిందని, ఇదే విషయాన్ని గవర్నర్ తన ప్రసంగంలో ప్రస్తావించారని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ చెప్పారు. శనివారం అసెంబ్లీలోని మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ మాదిరిగా భావిస్తూ.. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన సీఎం కేసీఆర్, వచ్చే ఐదేండ్లలో హామీఇచ్చిన అన్ని పనులను పూర్తిచేసే దిశగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. తెలంగాణను ప్రగతిపథంలో నడిపిస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

హామీలన్నీ నెరవేర్చింది టీఆర్‌ఎస్సే: ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్



ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చింది ఒక్క టీఆర్‌ఎస్ పార్టీయేనని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. గతంలో గవర్నర్ ప్రసంగం సమయంలో దాడులు, పుస్తకాలు చించడం చూశామని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలతో వెనకబడినవర్గాలకు ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. కులవృత్తులను ఆదుకొనేందుకు గొర్రెలు, చేపల పంపిణీ వంటి పథకాలను అమలుచేశామని, అందుకే గవర్నర్ ప్రసంగాన్ని ఎవరూ అడ్డుకోలేదని అభిప్రాయపడ్డారు.

అభివృద్ధి జరిగింది: ఎమ్మెల్యే రాజాసింగ్

సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి పనులు చేశారని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మెచ్చుకొన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చేయాలన్నా, బంగారు తెలంగాణ సాధించాలన్నా ప్రజల మనోభావాలను గుర్తించాలని కోరారు.

భట్టితో కలిసి పనిచేస్తాం: ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సీఎల్పీ నేతగా మల్లు భట్టివిక్రమార్కను ఎంపికను సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. ప్రజా సమస్యలను పరిష్కరించే అంశంపై అసెంబ్లీలో భట్టితో కలిసిపనిచేస్తామని తెలిపారు.

సమావేశాలను పొడిగించాలి: ఎమ్మెల్సీ పొంగులేటి

ప్రజా, రైతు సమస్యలపైనా చర్చించాల్సిన అవసరం ఉన్నదని, అసెంబ్లీ సమావేశాలను రెండు లేదా మూడు రోజులు పొడిగించాలని ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్‌చేశారు. సత్తుపల్లిని జిల్లా చేయాలన్న డిమాండ్ ఎప్పటినుంచో ఉన్నదని, సీఎం కేసీఆర్ సానుకూలనిర్ణయం తీసుకోవాలని కోరారు.

అంతర్రాష్ట్ర బదిలీలు పూర్తిచేయండి

ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు వైసీపీ అధినేత జగన్ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అంతర్రాష్ట్ర బదిలీల ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్షనేత, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. రాష్ట్ర విభజన తర్వాత అంతర్రాష్ట్ర బదిలీల దరఖాస్తులు అనేకం పెండింగ్‌లో ఉన్న కారణంగా 2019, జూన్ 30 వరకు గడువును రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పొడిగించాయి. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు ఏపీ ప్రతిపక్ష నేత జగన్ శనివారం లేఖరాశారు.

లోక్‌సభ ఎన్నికల ఖర్చు పర్యవేక్షణకు అధికారుల నియామకం

▪ **ఉత్తర్వులు జారీచేసిన సీఈవో రజత్‌కుమార్**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు వివరాలు పర్యవేక్షించేందుకు నోడల్ ఆఫీసర్లను నియమిస్తూ శనివారం సీఈవో రజత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఖర్చు పర్యవేక్షణ అధికారులుగా బుద్ధా ప్రకాశ్‌జ్యోతి, సంజయ్‌కుమార్‌జైన్, సోమేశ్‌కుమార్, ఇరుకుల సతీశ్‌కుమార్.. నోడల్ అధికారులుగా జితేందర్ (శాంతిభద్రతలు), టీ రవికిరణ్ (ఓటింగ్ అవగాహన), బీ కిషన్‌రావు (ఈవీఎంలు), బీ శైలజ (దివ్యాంగులు), బీ యాదగిరి (పరిశీలకుడు), బీ సూర్యభాస్కర్ (శిక్షణ)లను నియమించారు.

మార్గదర్శిగా రైతుబంధు

▸ మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశంసించారు. రైతుబంధు పథకం దేశం మొత్తానికీ మార్గదర్శనం కావాలని ఆకాంక్షించారు. పంటపెట్టుబడిగా ఎకరాకు రూ. ఐదు వేలు ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. వ్యవసాయ, రైతాంగ సంక్షోభానికి పరిష్కారం చూపడంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరు అభినందనీయమని పేర్కొన్నారు. కేంద్రం కూడా ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు. కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారవేత్తలపై ఉన్న శ్రద్ధ రైతు సమస్యలపై లేదని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. విశ్వనాథన్ కమిటీ సిఫారసులను అమలుచేస్తున్నట్లు కేంద్రం అబద్ధాలు చెప్తున్నదని, అదే నిజమైతే రైతులెందుకు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం రైతులకు ఆశాజనకంగా ఉందని స్పష్టం చేశారు. వ్యవసాయాభివృద్ధికోసం నీరు, నీటి కోసం ప్రణాళిక అవసరమన్నారు. నీరు, ప్రణాళిక, మార్కెటింగ్ వసతులు కల్పించినప్పుడే రైతుల జీవితాలు బాగుపడతాయని అభిప్రాయపడ్డారు. కానీ రైతులను పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో రైతులకు అండగా నిలువడం గొప్ప విషయమని కొనియాడారు.

లోక్‌పాల్‌పై 30 నుంచి అన్నా హజారే నిరాహారదీక్ష

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేండ్లు గడుస్తున్నప్పటికీ లోక్‌పాల్‌ను నియమించకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 30వ తేదీనుంచి నిరాహారదీక్ష చేపట్టనున్నట్టు అన్నా హజారే ప్రకటించారు. లోక్‌పాల్, లోకాయుక్త బిల్లును ఆమోదిస్తే ప్రజల చేతుల్లోకి అధికారం వస్తుందనే కారణంగా ఏ పార్టీ కూడా ఈ చట్టం అమలుకు సుముఖత చూపలేదని విమర్శించారు. 2011లో ప్రజలంతా లోక్‌పాల్, లోకాయుక్త బిల్లు ఆమోదించాలని డిమాండ్ చేయగా.. 2013లో చట్టరూపం దాల్చిందన్నారు. తాము అధికారంలోకి రాగానే లోక్‌పాల్‌ను నియమించి అవినీతిని అంతమొదిస్తామని 2014 జనవరిలో బీజేపీ ప్రధాని అభ్యర్థి నరేంద్రమోదీ ప్రకటించారని, కానీ అధికారంలోకి వచ్చి ఏండ్లు గడుస్తున్నా లోక్‌పాల్‌ను నియమించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ విషయంపై కేంద్రానికి 32 సార్లు లేఖలు రాసినా సమాధానం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టాన్ని అమలుచేయాలని సుప్రీంకోర్టు ఎన్నోసార్లు ఆదేశించినా కేంద్రం పట్టించుకోవడం లేదని, బిల్లు చట్టసభల్లో ఆమోదం పొందినా, రాష్ట్రపతి సంతకం చేసినా ఖాతరుచేయకుండా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టాన్ని అమలుచేస్తే రాఫెల్ డీల్ వంటి కుంభకోణాలు బట్టబయలవుతాయనే కేంద్ర ప్రభుత్వం దాటవేస్తున్నదన్నారు. ఈ చట్టం అమల్లోకి వస్తే కేంద్ర ప్రభుత్వమైనా సామాన్య ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని తెలిపారు. తన జీవితంలో 19 సార్లు దేశంకోసం అహింసామార్గంలో నిరాహారదీక్షలు చేశానని, దేశ, సమాజ హితమే తన లక్ష్యమని పేర్కొన్నారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టం అమలు చేసేవరకు నిరాహార దీక్ష కొనసాగిస్తానని తెలిపారు.



శనివారం టీఎస్‌పీఎస్సీ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ గంటా చక్రపాణి

ఉద్యోగులతో సర్కారు స్నేహ బంధం

▪ **టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉద్యోగులతో ప్రభుత్వం స్నేహపూర్వక బంధాన్ని కొనసాగిస్తున్నదని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి చెప్పారు. శనివారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి.. ఉద్యోగుల పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు చంద్రావతి, ఖాద్రీ, రామ్మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మన్మథరెడ్డి, కార్యదర్శి వాణీప్రసాద్, టీజీవో హైదరాబాద్ అధ్యక్షుడు డాక్టర్ గండూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి పవన్‌గౌడ్, కోశాధికారి శివకుమార్, నేతలు సురేఖ, యశోద, ఆంజనేయులు, సరిత, సయాదొద్దీన్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, మజీద్‌ఖాన్, అలేఖ్య, లీలారాణి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.



ఖైరతాబాద్‌లో రోజాపూల మొక్కల ప్రదర్శనను తిలకిస్తున్న దృశ్యం

రోజాపూల మొక్కల పెంపకానికి ప్రాధాన్యం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోజా పూలమొక్కల పెంపకానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. శనివారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్‌లో జరిగిన 37వ ఆలిండియా రోజాపూల ప్రదర్శన, సదస్సులో ఆయన మాట్లాడుతూ నగరంలో రోజా మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధంచేస్తామన్నారు. ఈ రంగంలో రాణిస్తున్న అహ్మద్ ఆలంఖాన్, ఏపీ సింగ్‌లకు బంగారు పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఇండియా రోజ్ ఫెడరేషన్ అధ్యక్షుడు సురేశ్ పింగల్, ఉపాధ్యక్షుడు విజయ్‌కాంత్, హైదరాబాద్ రోజ్ సొసైటీ అధ్యక్షుడు అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

ఏపీ సర్కార్‌కు
హైకోర్టులో చుక్కెదురు
జగన్‌పై దాడి కేసును ఎన్‌ఐఏ నుంచి తప్పించాలన్న పిటిషన్ తిరస్కరణ

అమరావతి (విజయవాడ), నమస్తే తెలంగాణ: విశాఖ విమానాశ్రయంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురయింది. దాడికేసు విచారణను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) నుంచి తప్పించాలంటూ ఏపీ ప్రభుత్వం హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని విచారించేందుకు ధర్మాసనం శనివారం తిరస్కరించింది. ఈ పిటిషన్‌కు అత్యవసరంగా విచారించాల్సిన అవసరంలేదని స్పష్టంచేసింది. ఈ తీర్పుతో ఎన్‌ఐఏ విచారణను అడ్డుకోవాలని భావించిన చంద్రబాబు సర్కారు ప్రయత్నాలకు బ్రేక్ పడింది. హౌస్ మోషన్ పిటిషన్‌తో ఏపీ ప్రభుత్వం దొడ్డిదారిన ఆర్డర్ తెచ్చే ప్రయత్నం చేసిందని, కుట్ర బయటపడుతుందనే చంద్రబాబు విచారణ అడ్డుకొంటున్నారని జగన్ తరపు న్యాయవాది సుజాతశర్మ తెలిపారు.



శనివారం తెలంగాణ అర్చక సమాఖ్య డైరీని ఆవిష్కరిస్తున్న టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

అర్చకులకు సీఎం కేసీఆర్ అండ
తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉమ్మడి పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ఆలయాలను, అర్చకులను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆదుకొని అండగా నిలిచారని తెలంగాణ అర్చక సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. తెలంగాణ అర్చక సమాఖ్య డైరీని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం కేటీఆర్‌కు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కే తారకరామారావు చెప్పడం సంతోషకరమన్నారు. అర్చకులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడు గట్టు శ్రీనివాసాచార్యులు, కరుణాకరాచార్యులు, రాజేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' దరఖాస్తులకు
అధిక చార్జీలు వద్దు
ఆపరేటర్లకు సూచించిన మీ సేవ కమిషనర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం ప్రభుత్వానికి సమర్పించే దరఖాస్తులకు అధిక చార్జీలు వసూలుచేసే మీ సేవ కేంద్రాలపై కఠినచర్యలు తప్పవని మీసేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లకు దరఖాస్తుల యూజర్‌చార్జీ రూ.35 వసూలుచేయాలని, కొన్ని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎక్కువ వసూలుచేస్తున్నట్టు దృష్టికి వచ్చిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కువ వసూలు చేసే కేంద్రాలపై డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) విజయభాస్కర్ (9701308181), స్టేట్ ప్రాజెక్ట్ మేనేజర్ బీ నరసింహారావు (8008022188)కు ఫిర్యాదు చేయాలన్నారు.

సండే స్పెషల్



మీ పిల్లలేం తింటున్నారు?

లంచ్‌బాక్సుల్లో ఉన్నది పౌష్టికాహారమేనా! ● హడావుడిలో అందని సమతుల్య ఆహారం.. కాస్తంత శ్రమిస్తే పిల్లలకు పరిపూర్ణ లంచ్‌బాక్స్

అన్నం, కూర కలుపుకొని తినటం నేర్పాలి ● బయటి స్నాక్స్ బదులు.. ఇంట్లోనే తయారుచేయాలి ● వైద్యులు, స్వచ్ఛంద సంస్థల సూచనలు

శిరందాస్ ప్రవీణ్‌కుమార్, నమస్తే తెలంగాణ:

సాయంత్రం దాకా స్కూల్లో గడిపే పిల్లలకు పోషకాహారం అందుతున్నదా? బాక్సులు ఎందుకు ఖాళీ అవటంలేదు? అసలు ఆ బాక్సుల్లో ఏం ఉంటున్నాయి? కూరతో అన్నాన్ని కలిపి ఒక బాక్సు.. తింటే పెరుగుతో మరొకటి! మధ్యలో తినటానికంటూ మూడునాలుగు బిస్కెట్లు.. ఓ రెండు చాక్లెట్లు! మహా అయితే జామ్ పూసిన బ్రెడ్డు.. కొన్ని చిప్స్! ప్రైమరీ స్కూలు పిల్లలైనా.. హైస్కూలు పిల్లలైనా పెద్ద తేడా లేదు! సంపన్న కుటుంబాల పిల్లల బాక్సుల్లోనూ ఇదేతీరు! కాకపోతే.. వారి బాక్సుల్లో ఏ పిజ్జాలో బర్గర్లో! అదీ లేకుంటే స్కూలు ఆవరణలో కొని తినేందుకు కొంత డబ్బు! ఇవి నిజంగా విద్యార్థులకు సరిపోయే పోషకపదార్థాలేనా? ఏమైనా ప్రత్యేకంగా వండిపెట్టేందుకు అవకాశం లేదా? ఇదే ప్రశ్నను కొందరు తల్లిదండ్రులను 'నమస్తే తెలంగాణ' అడిగితే.. 'మామూలు వంటకే టైమ్ సరిపోతున్నది.. ఇంకా ప్రత్యేకంగా ఏం వండుతాం?' అంటూ బాధతో నిట్టూర్చారు! వాస్తవానికి ఈ ఆహార అలవాట్లే పిల్లలను అనారోగ్యాలకు గురిచేస్తున్నాయని వైద్యులు చెప్తున్నారు. మలబద్ధకం, పరీక్షల భయం, నిస్సత్తువకు లంచ్‌బాక్స్ తగినవిధంగా సిద్ధంకాకపోవటమే కారణమని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు తెచ్చేందుకు భారతీయం, బాధ్యత ఫౌండేషన్, సేవ్ ఆర్గనైజేషన్ వంటి స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నిస్తున్నాయి.

ఎందుకిలా..?

20 ఏండ్లక్రితం మీరు స్కూలుకు లంచ్ బాక్సులు తీసుకెళ్లిన విషయాలు గుర్తున్నాయా? మూడు బాక్సుల క్యారియర్! ఒకదాంట్లో అన్నం.. మరోదాంట్లో కూర.. మిగిలిందాంట్లో పెరుగన్నం! ఇంటర్వెల్‌లో పటపటలాడించటానికి జేబులో ఉలవలు, బొబ్బర్లు, పల్లీలు, పల్లీపట్టీలు, బొంగుల ముద్దలు, పుట్నాల ముద్దలు, నువ్వుల లడ్డు, సున్నుండలు.. ఇలా ఏదో ఒక చిరుతిండి! స్కూలు బయట అమ్మే జామకాయలో మామిడి ముక్కలో జేబ్లో కొనుక్కునేందుకు కొంత చిల్లర! లంచ్ బెల్లు మోగగానే బాక్సులన్నీ తెరిచి.. చక్కగా అన్నం కూర అప్పటికప్పుడు కలుపుకొని.. పెరుగన్నం తినిమరీ లేచిన సందర్భాలు! మరిప్పుడు బాక్సులు ఎలా ఉంటున్నాయి? బాక్సులో ఏంపెడితే తోటి పిల్లలు ఏమనుకుంటారోనన్న సంశయం! గుడ్డుపెడితే తిన్న తర్వాత చేయి వాసన వస్తుంది.. అందుకే గుడ్డు మాయం! తిన్నంతే పెట్టాలనే 'సలహా'తో లంచ్‌బాక్స్ సగానికి సగం తగ్గిపోతున్నది. పిల్లలకు కలుపుకోవడం రాదనుకుంటాం కాబట్టి బాక్సు కట్టేటప్పుడే అన్న, కూర కలిసిపోతున్నాయి. దాంతో రుచీపచీ లేకుండా తయారవుతున్నది. పండ్లు ముక్కలు కోసి పెడుతుండటంతో తినేసమయానికి మెత్తపడిపోతున్నాయి. అందుకే అవి అలానే తిరిగొస్తున్నాయి. మంచినీళ్లు తాగితే పదేపదే వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుందని పిల్లలు నీళ్లు తాగటం తగ్గించేశారు. తగిన తిండి, నీళ్లు శరీరానికి అందకపోవడంతో మలబద్ధకం, డీహైడ్రేషన్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యులు చెప్తున్నారు. దీనికితోడు స్నాక్స్ పేరుతో చాక్లెట్లు, కేకులు వంటి మెత్తని పదార్థాలు పెడుతుండటంతో దంతాల సామర్థ్యం కూడా తగ్గిపోతున్నది. బఠానీలు, జామపండు లాంటివి తినాలన్నా కొరుకుడు పడని దుస్థితి! పైపెచ్చు చాలా స్కూళ్లు ఆటస్థలాలు లేనివికావటంతో శారీరక శ్రమ కూడా ఉండటం లేదు. ఇవన్నీ కలగలిసి చిన్నారిపై దండయాత్ర చేస్తున్నాయి.. దవాఖానల చుట్టూ తిప్పుతున్నాయి.



ఇలా చేయాలి.. నేర్పాలి?



- అన్నం, కూర కలపొద్దు. వాళ్లనే కలుపుకొని తినమని చెప్పాలి. కలుపుకొని తినటం నేర్పాలి.
- జామకాయ, బత్తాయి, నారింజ, దానిమ్మ వంటి పండ్లు ముక్కలు చేయటం కాకుండా.. కాయ లేదా పండు రూపంలోనే ఇవ్వాలి.
- పండ్లు కట్ చేసి పెట్టడం కంటే.. గుజ్జుగా చేసి పెరుగు కలిపి ఇస్తే ఎంతో మేలు.
- బఠానీ, పల్లీలు, పుట్నాలు చిరుతిండ్లుగా ఉంచాలి. వాత వికృతమంటూ చేసేది దుష్ప్రచారమే. నిజానికి అవి చాలా మంచివి.
- పుట్నాలు, పల్లీలు వంటి వాటిని బెల్లంతో కలిపి తినుబండారాలు చేయొచ్చు.
- సజ్జలు, జొన్నలు, కొర్రలతో అనేకరకాల తినుబండారాలను పిల్లలకు ఇష్టమైన రీతిలో తయారుచేయొచ్చు.
- ఉదయం పూట ఎక్కువ తినే అలవాటు ఆరోగ్యానికి మంచిది.
- దోస, కీర, ముల్లంగి, క్యారెట్, కొబ్బరి.. తదితర పచ్చి కూరగాయలు తినడం అలవాటు చేయాలి.
- ఫ్రీజ్ వాటర్ ఆపేయాలి. వీలైతే గోరు వెచ్చని నీళ్లు ప్రతి రోజూ రెండు గ్లాసులు తాగించేందుకు యత్నించాలి.
- పెరుగును ఇష్టపడని పిల్లలకు గట్టి పెరుగులో కాస్తంత బెల్లం కలిపి ఇస్తే పుష్కలంగా ప్రోటీన్లు లభిస్తాయి.
- పిల్లలకు ప్రాణశక్తి అవసరం ఎంతో ఉంది. హిమోగ్లోబిన్ తగినంత స్థాయిలో ఉంటేనే చురుకుదనం కనిపిస్తుంది. ఎనర్జీ, గ్రాస్పింగ్ లెవెల్స్ పెరుగుతాయి. ప్రోటీన్లు శరీరాన్ని నిర్మిస్తాయి. ఐరన్ అధికంగా ఉండే పుంటి కూర/పచ్చడి వంటివి తినిపించాలి.
- రాగి పల్లీ లడ్డు, సజ్జ అవిశ గింజల లడ్డు, వరిగ పల్లీ చెక్కలు, జొన్న కార పూస, రాగి జంతికలు, కొర్ర పాలక్ రిబ్బన్ పకోడీ, రాగి మిల్క్ షేక్, సజ్జ బాదం రోజ్ మిల్క్ షేక్, జొన్న చాట్, జొన్న ఎనర్జీ బార్, రాగి హల్వా, కొర్ర కుడుములు, రాగి క్యారెట్ కేక్, కొర్ర జీరా బిస్కట్లు, రాగి కోకోనట్ బిస్కట్లు వంటివి పిల్లలు ఇష్టపడుతారు.

ఎవరిని అడిగినా టైం లేదనే చెప్తున్నారు



పిల్లల బాక్సుల్లో ఏం పెడుతున్నారన్న అంశంపై నా దగ్గరికి వచ్చే తల్లిదండ్రులను ఆరాతీస్తే అందరూ చెప్పేది 'ఏది పెట్టినా ఖాళీగా రాదు. కాస్త మిగుల్చుకొని వస్తున్నారు. ఏదైనా చేసిపెట్టాలంటే టైం ఎక్కడిది?' అనే సమాధానాలే! అందుకే పిల్లల్లో చురుకుదనం లోపిస్తున్నది. పరీక్షలంటే భయం కనిపిస్తున్నది. మలబద్ధకం తలెత్తుతున్నది. నిల్వ పదార్థాలకు స్వస్తి పలుకాలి. లేకుంటే పిల్లల్లో మానసిక పరిపక్వత రాదు. మా దగ్గరకొచ్చే తల్లిదండ్రులకు తృణధాన్యాలతో అనేకరకాలుగా పిల్లలకు ఇష్టమైన రూపంలో చేసిపెట్టాలని చెప్తున్నాం. ఉత్తరాది రాష్ర్టాల్లో గోధుమ రొట్టెలు బాగా తింటారు. ఇక్కడ మైదాతో చేసినవాటిని పెడతాం. ప్రొటీన్లుండే పదార్థాలను తినిపించటం లేదు. కానీ ప్రొటీన్ పౌడర్లను వాడుతున్నారు.

- డాక్టర్ రమేశ్‌సాగర్, వివేకానంద మెడికల్ సెంటర్, హయత్‌నగర్

ఇన్‌స్టంట్ ఫుడ్స్ మానేయాలి



నిల్వ ఉండే పదార్థాలు, ఇన్‌స్టంట్ ఫుడ్స్ మానేయాలి. వాటిలో రుచికోసం అనేకం వాడుతున్నారు. వాటితో ప్రమాదమే. మేం సంప్రదాయ పద్ధతిలో వండే పదార్థాలనే పిల్లలకు పెట్టాలని ప్రోత్సహిస్తున్నాం. పిల్లలు వీటిని తినరు అనేది అబద్ధం. వారికి ఇష్టమైన రీతిలోనే చేసిస్తే అంతే ఇష్టంగా తింటారు. తల్లిదండ్రులు వాట్సాప్.. సోషల్ మీడియా చూసే టైంలో 10% కేటాయిస్తే చాలు. వండేటప్పుడు కూరగాయలను పసుపు, ఉప్పు కలిపిన నీటిలో ఐదు నిమిషాలు నానబెట్టిన తర్వాతే వండాలి. కోర్ల పున్నమి రోజు కుడుములు చేసేవారు. ఇప్పటితరానికి ఎవరైనా రుచి చూపించారా? అందుకే మార్పు మనతోనే మొదలుకావాలి.

- చంద్రశేఖర్, బాధ్యత ఫౌండేషన్ ప్రతినిధి

ఇష్టపడేవాటిని పెట్టాలి



పిల్లలకు స్వీట్లు అంటే ఇష్టం. పైగా కొత్తదనాన్ని కోరుకుంటారు. తల్లిదండ్రులు కూడా అదే చేయాలి. బెల్లంతో ఎన్నోరకాల పదార్థాలు చేయొచ్చు. తృణధాన్యాలను బెల్లంతో కలిపి రకరకాలుగా చేసిపెట్టాలి. చాక్లెట్లు, బిస్కట్లు మానేయమంటే మానరు. కానీ వాటినే తృణధాన్యాలతో చేసి ఇవ్వొచ్చు. ఆకు కూరలను తినని పిల్లలకు అవే ఆకుకూరలను పేస్ట్ చేసి గ్రీన్‌రైస్ వండితే చక్కగా తింటారు. ఇలా పిల్లలకు అనుగుణంగా వంటకాల్లో మార్పులు చేసుకోవాలి. బయట దొరికేవాటికంటే కాస్త కష్టపడితే వాటిని ఇంట్లోనే చేయొచ్చు.

- ఎం సురేంద్రనాథ్‌బెనర్జీ, సేవ్ ఆర్గనైజేషన్

భవిష్యత్‌లో సైబర్ యుద్ధాల ముప్పు

- ఇతర సంస్థలతోనూ పనిచేస్తాం: డీఆర్డీవో చైర్మన్ సతీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గతంలో సరిహద్దు, గగనతలం, సముద్రతలాల్లోనే యుద్ధాలు జరిగేవని.. కొత్తగా అంతరిక్ష, సైబర్ యుద్ధాలు కొత్త సవాళ్లు విసురుతున్నాయని డీఆర్డీవో సంస్థ చైర్మన్, రక్షణశాఖ ఆర్‌అండ్‌డీ కార్యదర్శి డాక్టర్ జీ సతీశ్‌రెడ్డి తెలిపారు. ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దస్‌పల్లా హోటల్‌లో 'దేశ రక్షణ రంగంలో స్వావలంబన'పై శనివారం సదస్సులో ఆయన మాట్లాడుతూ రక్షణ రంగంలో స్వావలంబన ప్రధానమని పేర్కొన్నారు. రియల్‌టైంలో నిఘా సమాచారాన్ని బలగాలకు చేర్చడంలోనే యుద్ధంలో గెలుపు ఓటములు నిర్ణయించే స్థితి వచ్చిందని చెప్పారు. రక్షణరంగ ఉత్పత్తుల తయారీలో ఇతర పరిశ్రమలతోనూ డీఆర్డీవో పనిచేస్తున్నదని, భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని చెప్పారు. సమావేశంలో చర్చించిన అన్ని అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని తెలిపారు. ప్రపంచ దేశాలకు తీసిపోని విధంగా డీఆర్డీవో పనిచేస్తున్నదని డిప్యూటీ నేషన్ సెక్యూరిటీ అడ్వైజర్, జాయింట్ ఇంటిలిజెన్స్ కమిటీ చైర్మన్ ఆర్‌ఎన్ రవి కితాబిచ్చారు. సదస్సులో రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ డీబీ శేఖత్కర్, రిటైర్డ్ మేజర్ జనరల్ ఏబీ గోర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

- అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంపై ఐకేపీ ఉద్యోగుల హర్షం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏండ్లనాటి కల నెరవేరుతున్నదని, సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని ఐకేపీ ఉద్యోగులు పేర్కొంటున్నారు. శనివారం అసెంబ్లీలో ప్రసంగించిన గవర్నర్ నరసింహన్.. ఐకేపీ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ బాధ్యతలను మహిళలకు అప్పగించి ఐకేపీ ఉద్యోగులతో పర్యవేక్షణ చేయిస్తామని ప్రకటించడంపై తెలంగాణ ప్రైవేట్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడుజగన్నాథుని ప్రవీణ్, సెర్ప్ ఉద్యోగుల జేఏసీ నేత గంగాధర్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

షర్మిలపై దుష్ప్రచారం.. ఐదుగురికి నోటీసులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వైసీపీ నాయకురాలు షర్మిలపై సోషల్‌మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్న వారిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు గుర్తించారు. ఐదుగురిని విచారించి, సీఆర్పీసీ 41 కింద నోటీసులు జారీచేశారు. పోలీసులకు షర్మిల అందించిన పోస్టుల ఆధారంగా దర్యాప్తు చేపట్టి ఎనిమిది యూట్యూబ్ చానళ్లకు నోటీసులు ఇచ్చి విచారించారు.

సాంకేతికతతో సాగును లాభసాటి చేయాలి

- మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్ కొండూరి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రానున్నది ఫుడ్ ప్రాసెసింగ్ శకమని, సాంకేతికతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాల్సిన అవసరం ఉన్నదని మైక్రోసాఫ్ట్ యూఎస్ డైరెక్టర్ శివకుమార్ కొండూరి అన్నారు. శనివారం జయశంకర్ అగ్రివర్సిటీలో 'వ్యవసాయంలో అధునాతన డిజిటల్ టెక్నాలజీ వినియోగం'పై ఆయన మాట్లాడుతూ అందుబాటులో ఉన్న వనరులతో అధికోత్పత్తి సాధించడంలో టెక్నాలజీ కీలక పాత్రపోషిస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను తీర్చేందుకు అనుగుణంగా వర్సిటీలు కొత్త కోర్సులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో వీసీ ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టెమ్రిస్ కార్యదర్శికి కువైట్ ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టెమ్రిస్) సెక్రటరీ బీ షఫీఉల్లాకు సోషియో ఎకనామిక్స్ అండ్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ముస్లిం ఆధ్వర్యంలో కువైట్‌లో 18 నుంచి 20 వరకు నిర్వహించే సదస్సులో పాల్గొనడానికి ఆహ్వానం అందింది. రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం, విద్యాసంస్థల ఏర్పాటు వంటి అంశాలపై షఫీఉల్లా సదస్సులో మాట్లాడనున్నారు.

సీఎంను ఆకర్షించిన పాలమూరు

- ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులకింద 1100-1200 చెరువులకు జలకళ
- యాసంగి సాగుకు రెండోసారి నింపుతున్న అధికారులు
- కాళేశ్వరంతోనూ తొలి ఫలితం ఇలాగే ఉండాలన్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పాలమూరు పచ్చబడింది.. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పరిధిలోని చెరువులకు జలకళ సంతరించుకోవటంతో రైతాంగం పండుగ చేసుకొంటున్నది. ఒకటి.. రెండు కాదు.. ఏకంగా 1100-1200 చెరువులు మత్తడి దుంకి అలుగుపారాయి. దీంతో ఆ చెరువులను మరోమారు యాసంగికీ నింపుతుండటం విశేషం. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా చెరువులను నింపుతుండటం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బాగా ఆకట్టుకుంది. తాను ముందు నుంచి చెప్తున్నట్టుగానే.. చెరువులను నింపడం ద్వారా పాలమూరు ఎలా పచ్చగా మారిందో.. రాష్ట్రంలోని అన్నిప్రాజెక్టుల కింద ఇదే దృశ్యాలు కనిపించాలని అధికారులను ఆదేశించారు. రెండురోజుల కిందట ప్రగతిభవన్‌లో సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షలో సీఎం కేసీఆర్ ఈ అంశంపైనే అధికారులకు దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. పాత పాలమూరు జిల్లా పరిధిలో అమలవుతున్న సాగునీటి విధానంపై చర్చించారు. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారానే ఏకంగా 800 చెరువులను నింపడం విశేషం. దీనితోపాటు కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టుల ద్వారా మరో 300-400 చెరువులను నింపినట్టు అధికారులు తెలిపారు. ఇలా మొత్తం 1100-1200 చెరువులను నింపారు. రైతులు వానకాలం పంటలను బాగా సాగు చేసుకోగా యాసంగి కోసమూ చెరువులు నింపుతుండటం విశేషం. సీఎం కేసీఆర్ ఈ విషయాన్ని ప్రస్తావించి సంతోషం వ్యక్తంచేసినట్టు తెలిసింది. కాళేశ్వరం కింద వచ్చే తొలిఫలితం చెరువులను నింపడం ద్వారానే రావాలని సూచించినట్లు సమాచారం.

పెద్దవాగు నీటి వినియోగంపై అధ్యయనం

ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఉండే పెద్దవాగు నీటి వినియోగంపైనా సమీక్షలో సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా చర్చించారు. వాగులో ఏటా 40-50 టీఎంసీల నీటిలభ్యత ఉంటుందని తెలిపారు. పెద్దవాగుపై ఇప్పటివరకు నిర్మించిన కుమ్రం భీం ప్రాజెక్టు ద్వారా గరిష్ఠంగా పది టీఎంసీలు, దాని దిగువన ఉన్న జగన్నాథ్‌పూర్ ద్వారా కేవలం 0.5 టీఎంసీల వరకు నీటిని వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 30 టీఎంసీల వరకు ఇంకా వాడుకునే వెసులుబాటు ఉందన్న సీఎం కేసీఆర్.. అందుకోసం వరుస చెక్‌డ్యాంల నిర్మించి నేరుగా ఆయకట్టుకు మళ్లించడం.. లేదా చెరువులు నింపే అంశాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తద్వారా పెద్దవాగు నీటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోగలుగుతామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టంచేశారు.

అంపశయ్య నవీన్‌కు లోక్‌నాయక్ పురస్కారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ నవలారచయిత అంపశయ్య నవీన్‌కు ప్రతిష్ఠాత్మక లోక్‌నాయక్ పురస్కారం లభించింది. శనివారం విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో జరిగిన లోక్‌నాయక్ ఫౌండేషన్ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ అవార్డు కింద రూ.1.25 లక్షల నగదుతోపాటు సర్టిఫికెట్, జ్ఞాపికను అందజేశారు. ఆయనతోపాటు శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతన చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ నన్నపనేని మంగాదేవి, ప్రముఖ సాంస్కృతికవేత్త, వంశీ ఇంటర్నేషనల్ అధినేత వంశీరామరాజుకు కూడా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌నాయక్ ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎంపీ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ పాల్గొన్నారు.




విశాఖపట్నంలో నవలారచయిత అంపశయ్య నవీన్‌కు లోక్‌నాయక్ పురస్కారం అందజేసి సన్మానిస్తున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

ఫ్లైయాష్‌తో అడవుల అభివృద్ధి సాధ్యం

- అటవీశాఖ జాతీయ సదస్సులో కేంద్ర అటవీ డైరెక్టర్ జనరల్ సిద్ధాంతదాస్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: థర్మల్ పవర్‌ప్లాంట్ల నుంచి వెలువడుతున్న ఫ్లైయాష్‌ను పంటల ఉత్పత్తితోపాటు అడవుల అభివృద్ధికి, నర్సరీల పెంపకానికి వాడాలని పలువురు శాస్త్రవేత్తలు, నిపుణులు సూచించారు. బూడిదపొడి ఉపయోగంపై ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరమున్నదన్నారు. శనివారం 'బూడిదపొడి-అడవుల అభివృద్ధికి వాడకం' అంశంపై దూలపల్లిలోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో ఏర్పాటుచేసిన జాతీయ సదస్సును కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంతదాస్ ప్రారంభించారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్ల నుంచి వెలువడే ఫ్లైయాష్‌తో మనుషుల ఆరోగ్యానికి ముప్పు పొంచిఉన్నదన్నారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ తిరుపతయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రాష్ట్ర అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే ఝా తదితరులు పాల్గొన్నారు.



దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో జరిగిన జాతీయ సదస్సులో మాట్లాడుతున్న కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ డైరెక్టర్ జనరల్ సిద్ధాంతదాస్



శనివారం చెన్నైలో తమిళనాడు గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ నుంచి ఉత్తమ పార్లమెంటేరియన్‌గా సంసద్ రత్న అవార్డును అందుకుంటున్న రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద్‌భాస్కర్

ఫిబ్రవరి 25న బయోఏషియా సదస్సు

- క్లీవ్‌ల్యాండ్, సౌమ్యస్వామినాథన్‌కు జీనోమ్ వ్యాలీ అవార్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రతిష్ఠాత్మక జీనోమ్ వ్యాలీ అవార్డును డాక్టర్ డాన్ డబ్ల్యూ క్లీవ్‌ల్యాండ్, డాక్టర్ సౌమ్య స్వామినాథన్‌లకు బయోఏషియా శనివారం ప్రకటించింది. 2019 ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో జరిగే బయోఏషియా సదస్సు ప్రారంభ వేడుకల్లో ఈ అవార్డులను గ్రహీతలకు ప్రదానంచేస్తారు. అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీకి చెందిన క్యాన్సర్ జీవశాస్త్రజ్ఞుడు, న్యూరోబయోలాజిస్ట్ డాక్టర్ క్లీవ్‌ల్యాండ్ జన్యు నిశ్శబ్ద సాంకేతిక అంశంలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారు. సైన్స్‌లో ఆస్కార్‌తరహా అవార్డును ఆయన గతఏడాది అందుకోవడం విశేషం. అల్జీమర్స్‌కు సంబంధించిన థెరపీలను అభివృద్ధి చేశారు. టీబీ/హెచ్‌ఐవీ వ్యాధుల విజ్ఞానాన్ని విస్తృతపర్చడంలో భారత్‌కు చెందిన డాక్టర్ సౌమ్యస్వామినాథన్ ముఖ్యభూమిక పోషించారు. సౌమ్య స్వామినాథన్ ప్రపంచ ఆరోగ్య సంస్థలో రెండో అత్యున్నత స్థానానికి చేరుకున్న వ్యక్తిగా ఖ్యాతికెక్కారు.

ఏప్రిల్ 13న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని తెలంగాణ మోడల్ స్కూళ్లలో 2019-20 విద్యాసంవత్సరంలో చేరేందుకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దరఖాస్తుల స్వీకరణ నోటిఫికేషన్ సోమవారం విడుదల చేయనున్నట్టు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ టీ విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. వివరాలకు http:// telanganams.cgg.gov.inను సంప్రదించాలని సూచించారు.

ప్రతిభా కాలేజీల్లో ప్రవేశాల గడువు 30కి పెంపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రతిభా కళాశాలల్లో 2019-20 విద్యా సంవత్సరానికి ప్రవేశాల దరఖాస్తు స్వీకరణ గడువును 30 వరకు పొడిగించారు. ఈ మేరకు గురుకులాల సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి http://www.tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

త్వరలో టాస్క్‌తో సర్వీస్ నౌ ఒప్పందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్ది కార్పొరేట్ సంస్థలకు అందించడమే లక్ష్యంగా ఏర్పాటైన టాస్క్, మరో ప్రముఖ నైపుణ్య శిక్షణసంస్థ సర్వీస్‌నౌతో ఒప్పందం చేసుకోనున్నది. తొలిదశ ప్రాజెక్టుగా చేపట్టిన శిక్షణ విజయవంతమవడంతో టాస్క్‌తో ఒప్పందం కుదుర్చుకొనేందుకు సర్వీస్‌నౌ మొగ్గుచూపుతున్నది. అకడమిక్ ప్రోగ్రామ్ పేరుతో సర్వీస్ నౌతో కలిసి టాస్క్ ఏడు ఇంజినీరింగ్ కాలేజీలను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చింది. 349 విద్యార్థులు సర్వీస్ సర్టిఫికేషన్ పరీక్ష రాయగా, 207 ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 217 మంది ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని గరిష్ఠంగా రూ.5 లక్షల వేతనం ఉంటుందని టాస్క్ సీఈవో సుజీవ్‌నాయర్ తెలిపారు. సర్వీస్‌నౌతో పూర్తిస్థాయి శిక్షణ ఒప్పందం కుదుర్చుకుంటామని చెప్పారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం 20 జనవరి 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



41యేండ్ల సినీ ప్రయాణం.. 340కి పైగా సినిమాలు.. పద్మశ్రీ పురస్కారంతో ఏడు జాతీయ అవార్డులు.. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో అంతులేని అభిమానగణం... వెరసి మోహన్‌లాల్ సినీ ప్రయాణం విజయమే సోపానంగా సాగుతున్నది. ఆరు పదుల వయసుకు చేరువైనా కూడా నవతరం కథానాయకులతో పోటీ పడి సినిమాలు చేస్తూ తనకు తానే పోటీ అని నిరూపించుకుంటున్నారు మోహన్‌లాల్. 'జిందగీ'తో ఈ విలక్షణ నటుడు చెప్పిన ముచ్చట్లివి.

అలా అనుకుంటే.. కెరీర్ అక్కడే ఆగిపోతుంది..

- **సుదీర్ఘ సినీ ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే ఏమనిపిస్తుంది? నాలుగు దశాబ్దాలుగా సక్సెస్‌ఫుల్ హీరోగా కొనసాగడం ఎలా సాధ్యమైంది?**

■ నేను సినిమాల్లో అడుగుపెట్టి నలభై ఒక్క ఏళ్లు పూర్తయ్యాయి. నా ప్రతిభ, సంకల్పబలానికి తోడు మంచి పాత్రలు, కథల వల్లే ఇన్నేళ్ల పాటు ఇండస్ట్రీలో కొనసాగగలుగుతున్నాను. కొత్తదనంతో కూడిన కథాంశాలతో సినిమాలు చేసిన ప్రతి సారీ ప్రేక్షకులు విజయాల్ని అందిస్తున్నారు. వారి ఆశీర్వాద బలమే నాలో నిరంతరం ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని నింపుతూ ముందుకు నడిపిస్తున్నది.

- **యాభై ఎనిమిదేళ్ల వయసులో రిస్కీ యాక్షన్ సన్నివేశాల్లో అలవోకగా నటిస్తున్నారు?**

■ యాక్షన్ నాకు ఇష్టమైన జోనర్. నా నట ప్రయాణంలో యాక్షన్ కథాంశాలతో చాలా సినిమాలు చేశాను. పులి మురుగన్, ఓడియన్ లాంటి కథలకు ప్రాణం పోయాలంటే యాక్షన్ సన్నివేశాల్లో నటించాల్సిందే. నటనకు వయసు అడ్డంకి కాదని విశ్వసిస్తాను. ఇప్పటికీ యాక్షన్ సినిమాలకు న్యాయం చేయగలనన్న నమ్మకం నాలో బలంగా ఉంది. అది లేని రోజు అలాంటి సినిమాలు చేయడం మానేస్తాను.

- **యువతరం హీరోలతో పోటీపడి సినిమాలు చేస్తున్నారు. ఆ తపనకు స్ఫూర్తి ఏమిటి?**

■ వృత్తిని అమితంగా ప్రేమిస్తాను. నాకు నచ్చిన సినిమాల కోసం ఇరవై నాలుగు గంటలు కష్టపడటానికి సిద్ధమే. 365 రోజుల పాటు సినిమాలు చేస్తునే ఉంటాను. ఖాళీగా ఉండడం నాకు నచ్చదు. సినిమాకు ప్యాకప్ చెప్పగానే మరో సినిమా మొదలుపెడుతాను. చేసే పనిలో ఆనందాన్ని ఆస్వాదించలేని వారు అందులో ఎక్కువ కాలం మనుగడ సాగించలేరు.

- **తెలుగుతో పాటు హిందీ, తమిళంలో సినిమాలు చేస్తున్నారు. భాషాపరమైన అవరోధాల్ని ఎలా అధిగమిస్తుంటారు?**

■ మాతృభాషలో సినిమా చేస్తున్నప్పుడు పాత్ర తీరుతెన్నులను సులభంగా ఆకళింపు చేసుకొని అందులో అలవోకగా ఒదిగిపోగలుతాం. పరాయి భాషల్లో సినిమా చేస్తున్నప్పుడు ఆ వెసులుబాటు ఉండదు. షూటింగ్ చేస్తున్నప్పుడు శిక్షకుల, సహాయ దర్శకుల సహకారంతో భాషపై పట్టు సాధించే ప్రయత్నం చేస్తాను. నా పాత్రకు సంబంధించిన డైలాగ్‌లను మళ్లీ మళ్లీ పునశ్చరణ చేసుకుంటూ భాషా పరిజ్ఞానం పెంచుకుంటాను.



- **ఈ మధ్యకాలంలో చారిత్రక కథాంశాలు, పాత్రల్లో ఎక్కువగా కనిపిస్తున్నారు?**

■ ఫలానా కథలతో సినిమాలు చేయాలని నేనెప్పుడు ప్లాన్ చేసుకోను. జోనర్‌లతో సంబంధం లేకుండా మంచి సినిమాలు చేయడానికి ప్రాధాన్యం ఇస్తాను. ప్రియదర్శన్‌తో చేస్తున్న సినిమా 'మరక్కర్ అరబిక్కడిలింతే సింహ' చారిత్రక కథాంశంతో తెరకెక్కుతున్నది. పోరాట యోధుడైన నావికాధికారిగా ఈ సినిమాలో కనిపిస్తాను.

- **నటనా పరంగా తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా?**

■ నేనో పరిపూర్ణ నటుడినని, అన్నీ తెలుసుననే భావనతో ఎప్పుడూ ఉండను. అలా అనుకుంటే కెరీర్ అక్కడితోనే ఆగిపోతుంది. నటుడిగా ఇంకా నేను చేయాల్సిన పాత్రలు, కథలు చాలా ఉన్నాయి. వినూత్నమైన పాత్రలు లభించడం ఏ నటుడికైనా అదృష్టమే. అలా నా కోసం కెరీర్ తొలినాళ్ల నుంచి దర్శకులు విలక్షణ పాత్రల్ని సృష్టించారు. నాపై వారు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తాను. మంచి పాత్రలు రావాలని మనం కోరుకుంటే సరిపోదు. దర్శకులు అలాంటి కథల్ని, పాత్రల్ని మనకోసం సృష్టించినప్పుడే వస్తాయి. అందుకే నేను దర్శకులు, నిర్మాతలకు ఎక్కువ గౌరవం, విలువ ఇస్తాను. వారి వల్లే నటుడిగా నేను ఈ స్థాయికి చేరుకున్నానని నమ్ముతాను.

- **తెలుగు ఇండస్ట్రీలో మీకు స్నేహితులు ఉన్నారా?**

■ తెలుగు ఇండస్ట్రీతో సుదీర్ఘకాలంగా అనుబంధం ఉంది. చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్‌తో పాటు ఇక్కడ మంచి స్నేహితులున్నారు. మలయాళంలో నేను నటించిన చాలా సినిమాల్ని వెంకటేష్, మోహన్‌బాబు తెలుగులో రీమేక్ చేశారు. మలయాళంలో నేను నటించిన పలు సినిమాలు తెలుగులో అనువాద రూపంలో విడుదలై పెద్ద విజయాల్ని సాధించాయి. తెలుగులో మంచి కథలు దొరికితే సినిమాలు చేస్తుంటాను. ప్రస్తుతం అవకాశాలు వస్తున్నాయి.

- **భాషాభేదాలకు అతీతంగా భారీ ఇతివృత్తాలతో సినిమాలు చేసే ధోరణి ప్రస్తుతం పెరిగింది? ఇది సినీ పరిశ్రమకు ఎంతవరకు మంచిదని అనుకుంటున్నారు.**

■ లార్జర్‌దేన్ లైఫ్ కథాంశాలు, భారీ సాంకేతిక హంగుల సమ్మిళితంగా ఉంటాయి కాబట్టే ప్రతిఒక్కరూ హాలీవుడ్ సినిమాల గొప్పతనాన్ని గురించి మాట్లాడుకుంటుంటారు. అలాంటి కథలతో మనం సినిమాలు చేస్తే భాషాపరమైన హద్దులను చెరిపివేస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించే అవకాశం ఉంటుంది. హాలీవుడ్ సినిమాల స్థాయిలో మన చిత్రాలు వసూళ్లను సాధించగలవని బాహుబలి సినిమా నిరూపించింది. ప్రస్తుతం చేస్తున్న మరక్కర్ అరబిక్కడిలింతే సింహాని భారీ హంగులతో ప్రపంచస్థాయి సినిమాగా తీర్చిదిద్దుతున్నాం. మంచి కథ, భారీ సినిమాల్ని తెరకెక్కించే శక్తిసామర్థ్యాలు, సాంకేతిక వనరులు అందుబాటులో ఉంటే అలాంటి సినిమాలు చేయడంలో తప్పు లేదు.

- **మీ అబ్బాయి ప్రణవ్ గత ఏడాది ఆది సినిమాతో హీరోగా అరంగేట్రం చేశాడు. అతడిని తెరపై చూసినప్పుడు ఏమనిపించింది?**

■ ప్రణవ్‌కు నటన కొత్తేమీ కాదు. బాలనటుడిగా చాలా సినిమాలు చేశాడు. అవార్డుల్ని అందుకున్నాడు. హీరోగా తొలి ప్రయత్నంలోనే పెద్ద విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉంది. 'ఆది' సినిమాలో అతడి నటన బాగుంది. ప్రస్తుతం మేమిద్దరం కలిసి ఓ సినిమా చేస్తున్నాం. 'మరక్కర్ అరబిక్కడిలింతే సింహ' సినిమాలో నా యుక్తవయసు నాటి పాత్రలో ప్రణవ్ కనిపించబోతున్నాడు.

- **సినిమాలకు సంబంధించి మీ తనయుడికి సలహాలు, సూచనలు ఇస్తుంటారా?**

■ ప్రణవ్ సినిమాల్లో కొనసాగుతాడో లేదో తెలియదు. మరో రెండు సినిమాలు చేసిన తర్వాత కెరీర్‌పై నిర్ణయానికి రావాలని అనుకుంటున్నాడు. దర్శకత్వ శాఖలో పనిచేశాడు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రణవ్ విజయాల్ని అందుకుంటాడనే నమ్మకం ఉంది.

... నరేష్ నెల్కి

సేవాభావం.. ఆమె వారసత్వ సంపద..

చిన్నప్రాయంలోనే శరణార్థులను చూసి చలించింది. అనాథలను అక్కున చేర్చుకుంది. అప్పుడే సొంత ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఎంతో మంది కన్నీళ్లు తుడుస్తున్నది ప్రసన్న బండారి. మహిళల, పిల్లల సంక్షేమంలో ఆమె కృషికి జమ్నాలాల్ బజాజ్ అవార్డు పొందింది.



కోల్‌కతాకు చెందిన ప్రసన్న 1934లో జన్మించింది. తండ్రి సామాజిక కార్యకర్తగా ఉండేవారు. దీంతో ఆమె చిన్నప్పటి నుంచే సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేది. అలా అమె బాల్యం గడిచింది. అప్పుడే జరిగిన బెంగాల్ విభజనలో శరణార్థుల కష్టాలు ఆమెను కలిచి వేశాయి. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులను చూసింది. సామాజిక బాధ్యతగా మరింత పని చేయాల్సి వచ్చింది. అనాథ శిశువులను, నిరాశ్రయులైన పిల్లలను చేరదీసింది. బాలికలకు, మహిళలకు, వృద్ధులకు ఎనలేని సాయం అందించింది. ప్రస్తుతం ఆమెకు 85 యేండ్లు. 55 ఏండ్లుగా సామాజిక సేవకు ఆమె అంకితమైంది. చిల్డ్రన్ హోమ్స్, ఓల్డేజ్ హోమ్స్ ఏర్పాటు చేశారు. మొదట 20 నుంచి 40 మంది పిల్లలతో స్థాపించిన చైల్డ్ హోం ప్రస్తుతం 450 మందితో నడుస్తున్నది. దీంతో వారికోసమే ఓ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేసింది. 8 నుంచి 18 యేండ్లు అనాథ పిల్లలను చేరదీసి వాళ్లకు ప్రేమను పంచింది. బాలికలకు, బాలురకు వేర్వురుగా ఆశ్రయం కల్పించి విద్యాబుద్ధులు నేర్పింది. ముఖ్యంగా మహిళలు ఎదుర్కొంటున్న గృహహింస ఆమెను కదిలించింది. దాని కోసం ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేసింది. అలా సుమారు 3500 సమస్యలను పరిష్కరించింది. ఇలా కౌన్సెలింగ్ చేసి కుటుంబాలను కలుపుతున్నది. అందరికీ అండగా ఉంటున్న ప్రసన్న తన జీవితాన్ని సేవకు అంకితం ఇచ్చినందుకు సంతోషిస్తున్నది. 'ఇతరులకు ఎలా సాయం చేయాలో అందరూ ఆలోచించాలనీ, ఒకవేళ అది సాధ్యం కాకపోతే ఇతరుల కన్నీళ్లయినా తుడువగలగాల'ని ప్రసన్న అంటున్నది.

వాచిన పెదాలతో ఇబ్బంది పడుతున్నారా?

శీతాకాలం పెదాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. వాడిపోయినట్టుగా, నిర్జీవంగా పేలగా తయారవుతాయి. కొందరికి పెదాలు వాపునకు గురవుతాయి. మరి అలాంటి వాచిన పెదాలు వెంటనే తగ్గాలంటే ఈ చిన్న చిట్కాలు పాటించండి..



- కొన్ని ఐస్‌ముక్కలను కాటన్ గుడ్డలో తీసుకోవాలి. వాటితో సున్నితంగా పెదాలపై మర్దన చేయాలి. రోజులో నాలుగైదు సార్లు ఇలా చేయటం ద్వారా ఫలితం ఉంటుంది. ఐస్‌ముక్కలను నేరుగా పెదాలకు తాకించవద్దు.
- తాజా కలబంద నుంచి టీస్పూన్ జెల్ తీసుకోవాలి. వీలయినన్ని సార్లు పెదాలకు పూస్తే వాపు తగ్గుతుంది.
- తేనెను ఉపయోగించి ఈ సమస్యకు చెక్‌పెట్టొచ్చు . ఒక టీస్పూన్ తేనెలో కాటన్ బాల్‌ను ఉంచండి. చల్లని నీటితో మొహం కడిగి ఆ బాల్‌ను పెదాలపై మర్దన చేయండి.
- ఒక స్పూన్ పసుపును, చల్లని నీటితో కలపాలి. ఈ మిశ్రమాన్ని పెదాలపై పూసి పది నిమిషాల తర్వాత కడిగేయాలి. ఒక రోజులో మూడు సార్లు చేస్తే వాచిన పెదాలు తగ్గిపోతాయి. దీంతో పాటు ఏదైన నొప్పి ఉన్నా నయం అవుతుంది.

II.
నమస్తే తెలంగాణ
సింగిడి
[కరీంనగర్]
ఆదివారం 20 జనవరి 2019

భార్యతో గొడవ పడుతున్నారా?



ఏమండోయ్.. చీటికి మాటికి మీ భార్యతో గొడవ పడుతున్నారా? అయితే మీకు షుగర్ వ్యాధి వచ్చే అవకాశాలు చాలా ఎక్కువ. తాజాగా జరిపిన ఓ పరిశోధన ఈ విషయాన్ని ధ్రువీకరించింది.

ఈ మధ్యకాలంలో చాలామందిని వేధించే సమస్య షుగర్ వ్యాధి. ఆహారపు అలవాట్లు కావొచ్చు.. మరేదైనా కావొచ్చు. ఈ వ్యాధి చిన్నవయసులోనే దాడిచేస్తుంది. తాజాగా పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీ చెబుతున్న దాని ప్రకారం.. తరచూ భార్యతో గొడవపడేవారికి షుగర్ త్వరగా వస్తుందట. అంతేకాదు, ఆర్థ్రయిటిస్ సమస్య కూడా దాడి చేస్తుందని పరిశోధకులు తెలిపారు. ఆర్థ్రయిటిస్, మధుమేహం సమస్యలు ఉన్న రెండు వర్గాల వ్యక్తుల మీద పరిశోధన జరిపారు. భార్యతో తగాదాలు పడ్డ వాళ్లకు అదే రోజున వారి ఆరోగ్య సమస్యల తీవ్రత పెరిగినట్టు చెప్పారు. కాబట్టి.. సరైన జీవనవిధానంతో జీవితభాగస్వామితో కూడా సరిగా ఉంటే ఆరోగ్యానికి మేలు అంటున్నారు.

వైరల్ గుడ్డుతో పోటీ!

ఇన్‌స్టాగ్రాంలో 'వరల్డ్ రికార్డ్ ఎగ్' వైరల్ అవుతున్నది. గోధుమ రంగులో ఉన్న ఈ గుడ్డును ఇప్పటికే 4 కోట్ల మందికిపైగా లైక్ చేశారు. దీంతో ఈ గుడ్డు ఇన్‌స్టాగ్రాంలో ఎక్కుమంది లైక్ చేసిన పోస్టుగా రికార్డు సృష్టించింది. అయితే.. ఈ పోస్టుకు కౌంటర్‌గా ఓ వ్యక్తి తన తలను గుడ్డులా మార్చుకొని పోటీకి దిగుతున్నాడు.



ఇన్‌స్టాగ్రాంలో ఈ బ్రౌన్ కలర్ ఎగ్.. ప్రస్తుతం వైరల్‌గా మారింది. అయితే, ఈ గుడ్డు ప్లేసులో మనిషి ఉండి, అతను వరల్డ్ రికార్డ్ సాధిస్తే.. ఎలా ఫీలవుతాడు? ఆ ఫీలింగ్స్ ఎలా ఉంటాయి? అనే విషయాన్ని వివరించేందుకు ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ ప్యాట్రిక్ స్టార్ ముందుకొచ్చాడు. ఇందుకు తనను తాను గుడ్డులా మార్చేసుకున్నాడు. తానే మేకప్ వేసుకొని, గుడ్డు హావభావాలు పలికిస్తూ ఓ వీడియో రూపొందించాడు. ఇప్పుడా వీడియో.. గుడ్డుతో పాటుగా లైక్స్‌ను సొంతం చేసుకుంటున్నది. ఈ వీడియోకి యూట్యూబ్ ప్రత్యేక ప్రమోషన్ ఇచ్చింది. ఇప్పటికే వైవిధ్యభరిత మేకప్‌లతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్యాట్రిక్.. ఇన్‌స్టాగ్రాం ఎగ్ వీడియోతో మరోసారి అందరినీ ఆలోచనలో పడేస్తున్నాడు. ప్రస్తుతం ప్రపంచమంతా ఇన్‌స్టాగ్రాం గుడ్డు గురించి మాట్లాడుకుంటున్నది. ఈ ఎగ్ పోస్ట్‌ని ప్రేరణగా తీసుకొని ఇన్‌స్టాగ్రాంలో వేలాదిగా ఎగ్ పోస్టులు పుట్టుకొస్తున్నాయి.

వాళ్లే పుకార్లు షేర్ చేస్తున్నారు!

సోషల్ మీడియా ప్రతి ఒక్కరికీ చేరువయ్యాక.. ఫేక్ న్యూస్‌తో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ వరకూ వచ్చిన విషయంలో నిజమెంతో, అబద్ధమెంతో తెలుసుకోకుండానే షేర్ చేస్తున్నారు. ఈ ఫేక్ న్యూస్‌ను షేర్ చేసే వాళ్లలో ఎక్కుమంది పెద్దలే.



సోషల్ మీడియా ఎంతగా యాక్టివ్ అయ్యిందో.. దాని పుణ్యమా అని ఫేక్ న్యూస్ కూడా అదేవిధంగా వైరల్ అవుతున్నది. అయితే ఫేక్‌న్యూస్‌ను ఎవరెక్కువ షేర్ చేస్తారో తెలుసా? 65 ఏళ్ల వయసు పైబడినవారేనట. ఇది తాజాగా ఓ పరిశోధనలో వెల్లడైన విషయం. దీని ప్రకారం 65 యేండ్ల పెద్దలు.. యువకులకంటే ఎక్కువగా ఫేక్ న్యూస్‌ను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నట్టు స్పష్టమైంది. 'లెస్ దెన్ యు థింక్ : ప్రివిలెన్స్ అండ్ ప్రెడిక్టర్స్ ఆఫ్ ఫేక్ న్యూస్ డిస్సిమినేషన్ ఆన్ ఫేస్‌బుక్' పేరిట న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ పరిశోధన చేశారు. ఇందులో 65 సంవత్సరాల వయసున్న వారు ఎక్కువగా ఈ ఫేక్ న్యూస్‌ను చూస్తున్నట్టు, వాటిని ఎక్కువగా తమ స్నేహితులకు షేర్ చేసేందుకు ఇష్టపడుతున్నట్టు వెల్లడైంది. యువకులు కేవలం 3 శాతం మంది మాత్రమే ఫేక్ న్యూస్‌ను షేర్ చేస్తున్నారన్నది ఈ పరిశోధన సారాంశం.

పెళ్లికి ఒప్పుకోలేదని ఒకడు.. ప్రేమ నిరాకరించిందని మరొకడు.. శారీరకంగా దక్కలేదని అక్కసుతో ఇంకొకడు.. ఆడపిల్లల జీవితాలతో చెలగాటమాడుతూనే ఉన్నారు. 'తనకు దక్కనిది వేరొకరికి దక్కకూడదు' అనే స్వార్థంతో అందమైన జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తున్నారు. తిరస్కరించినందుకు యాసిడ్ దాడులకు పాల్పడుతూ.. క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. యేటా 200 మంది మహిళలు మన దేశంలో యాసిడ్ దాడులకు గురవుతున్నారు. ఆ బాధితుల్లో కొంత మంది బలవంతంగా ప్రాణాలు తీసుకుంటే.. మరికొంతమంది ఇలా స్ఫూర్తిదాతలుగా విజయం సాధించారు.



సప్తవర్ణాల విజయగాథ!





రేషం ఖాన్

21 యేండ్ల రేషం ఖాన్ లండన్‌లో యాసిడ్ దాడికి గురైంది. అది కూడా తన 21వ పుట్టినరోజు నాడే. ఆ సమయంలో తన స్నేహితులు విరాళాలు సేకరించి కొంత వైద్యానికి అందించారు. ఆస్పత్రిలో ఉన్నప్పుడు తన బ్లాగ్‌లో దాడి జరిగిన తీరు, తన ఆరోగ్య వివరాలు, వైద్యులు స్పందిస్తున్న తీరును వివరంగా రాసేది. వీటితో పాటుగా తన తాజా ఫొటోలను కూడా పోస్టు చేసేది. అలా కొన్నాళ్లకు కోలుకున్నది రేషం ఖాన్. ప్రస్తుతం యాసిడ్ దాడి బాధితుల పక్షాన పోరాడుతూ.. స్ఫూర్తిదాయక పాత్ర నిర్వహిస్తున్నది.



లక్ష్మీ అగర్వాల్

2005లో ఢిల్లీకి చెందిన ఈ యువతి యాసిడ్ దాడిలో తన రూపురేఖల్ని పూర్తిగా కోల్పోయింది. తాను ప్రస్తుత రూపానికి రావడానికి ఎన్నో సర్జరీలు చేయించుకున్నది. కొన్నాళ్లకు ధైర్యం తెచ్చుకొని తనలాంటి బాధితుల తరపున పోరాడుతున్నది. యాసిడ్ దాడులను నిరసిస్తూ.. ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఓ టీవీ చానెల్‌లో హోస్ట్‌గా వ్యవహరించింది. 'స్టాప్ యాసిడ్ అటాక్స్' పేరుతో ఓ ఎన్జీఓను నిర్వహిస్తూ.. సమాజంలో చైతన్యం నింపుతున్నది. తాను చేస్తున్న నిస్వార్థ సేవకు గాను 'ఇంటర్నేషనల్ ఉమెన్ ఆఫ్ కరేజ్ అవార్డ్'ను అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా భార్య మిచెల్లి అందజేశారు.



రూప

15 యేండ్ల వయసులో తన పినతల్లి ద్వారా యాసిడ్ దాడికి గురైంది రూప. ఆమెకు చిన్నప్పటి నుంచి క్లాత్ డిజైనింగ్ అంటే చాలా ఇష్టం. దాడి నుంచి కోలుకున్న తర్వాత.. తన కుటుంబ సభ్యులు, ఎన్జీఓ ప్రోత్సాహంతో ఓ బొటిక్ ప్రారంభించింది. దాని కోసం ఢిల్లీ నుంచి లక్నోకు ఎన్నోసార్లు ప్రయాణించింది. ఆ తర్వాత ఆన్‌లైన్ అమ్మకాతో లాభాల బాట పట్టింది. యాసిడ్ దాడి బాధితులతో ఓ ఫ్యాషన్ షో కూడా నిర్వహించింది. అలా స్వయం శక్తితో ఎదిగి అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా 'నారీ శక్తి పుస్కారం' అందుకున్నది.





రేష్మా ఖురేషి

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ యువతి.. ముంబైకి చెందిన టాక్సీ డ్రైవర్ యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడింది. ఆ దాడి నుంచి కోలుకున్న తర్వాత 2015లో #EndAcidSale క్యాంపెయిన్‌కు అంబాసిడర్‌గా వ్యవహరించింది. విచ్చలవిడిగా యాసిడ్ అమ్మకాలను నిరసిస్తూ గొంతెత్తి నినదించింది. నేటికీ తన పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నది. అందం కోసం వాడే సౌందర్య సాధనాలు మార్కెట్‌లో విచ్చల విడిగా దొరికినట్లు.. యాసిడ్ కూడా దొరుకుతుందని, యాసిడ్ అమ్మకాలు నిలిపివేయాలని పోరాడుతున్నది. మరోవైపు తనకు ఇష్టమైన ఫ్యాషన్ ప్రపంచంలో మెళుకువలు నేర్చుకున్నది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న 'న్యూయార్క్ ఫ్యాషన్ వీక్' షోలో ర్యాంప్‌వాక్ చేసింది రేష్మా. తన చదువు అయిపోయిన వెంటనే రేడియో జాకీగా ఉద్యోగం సంపాదించింది. ఆత్మస్థైర్యానికి మించిన ధైర్యం లేదంటూ నిరూపించింది.

మమతా దేవి

2010లో మద్యానికి బానిసైన తన భర్త చేసిన యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడింది మమతా దేవి. అప్పుడు ఆమె గర్భవతి. పిల్లలు వద్దని, అబార్షన్ చేయించుకోవాలంటూ భర్త, అత్తమామలు ఒత్తిడి తేవడంతో తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. అయినా వదలని తన భర్త.. ముఖంపై యాసిడ్ పోసి, ఆమె జీవితాన్ని నరకంగా మార్చాడు. అప్పుడు 'మేక్ లవ్ నాట్ స్కార్స్' ఎన్జీఓ మమతా దేవికి అండగా నిలిచింది. దాంతో ఇంగ్లిష్, ఆర్ట్‌పై పట్టు సాధించింది. ప్రస్తుతం 'ఉడెన్ జ్యూవెలరీ' తయారు చేస్తూ.. వ్యాపారవేత్తగా ఎదిగింది.

మోనికా సింగ్

2005లో లక్నోలోని తన తల్లిదండ్రులను చూసేందుకు వచ్చిన మోనికా సింగ్‌పై యాసిడ్ దాడి జరిగింది. దీంతో తన ఆశయలన్నీ అడియాశలయ్యాయి. అయినా ధైర్యం కోల్పోకుండా ముందడుగు వేసింది. మృగాళ్ల అకృత్యాలను ప్రశ్నిస్తూ.. బాధితులకు అండగా నిలుస్తున్నది. లింగ వివక్షపై పోరాడుతున్నది. ఐక్యరాజ్య సమితి నిర్వహించిన 'ఉమెన్ గ్లోబల్ యూత్ చాంపియన్ అగైనెస్ట్ జండర్ బేసిడ్ వైలెన్స్' కార్యక్రమంలో ప్రసంగించింది. ప్రస్తుతం ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ చైతన్యం నింపుతున్నది. బాధితులను సాధికారత దిశగా ప్రోత్సహించేందుకు ఫ్యాషన్ రంగాన్ని ఎంచుకున్నది. దాని ద్వారా ఎంతోమందికి చేయూతనిస్తున్నది మెనికా సింగ్.

మరికొన్ని స్ఫూర్తిగాథలు

- 1999లో తోటి ఉద్యోగి యాసిడ్ దాడిలో త్రీవంగా గాయపడింది హసీనా హుస్సేన్. అతనితో పెండ్లికి ఒప్పుకోకపోవడంతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆ దాడి తర్వాత హసీనా 'ఎనేబుల్డ్ ఇండియా' అనే సంస్థలో చేరి దృష్టిలోపం ఉన్న చిన్నారులకు కంప్యూటర్ స్కిల్స్ నేర్పుతున్నది.
- తన బంధువైన ఓ యువకుడి యాసిడ్ దాడిలో తన రూపాన్ని కోల్పోయింది అర్చన. ఆ తర్వాత ఢిల్లీకి వెళ్లి దాదాపు 40 సర్జరీలు చేయించుకున్నది. 'మేక్ లవ్ నాట్ స్కార్స్' ఎన్జీఓ ద్వారా మృగాళ్ల అరాచకాలపై పోరాడుతున్నది.
- 2013లో తన బావ యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడింది సాప్నా. ఆమెకు 'మేక్ లవ్ నాట్ స్కార్స్' ఎన్జీఓ అండగా నిలిచింది. జిగురు తయారు చేసే కంపెనీలో ఉద్యోగం ఇప్పించింది. ఆ ఫ్యాక్టరీలో అంచెలంచెలుగా ఎదిగింది సాప్నా. ప్రస్తుతం ప్యాకేజింగ్ విభాగానికి ఇన్‌చార్జ్, సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది.
- ముంబైలోని కల్యా ప్రాంతానికి చెందిన లలిత బెన్ బాన్సీ తన బంధువుల యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడింది. 17 సర్జరీల తర్వాత కోలుకున్నది. ఆమెను ఇటీవలే రాహుల్ పెండ్లి చేసుకున్నాడు.
- వీరితోపాటు ఇలాంటి ఎంతోమంది బాధితులు ఆత్మస్థైర్యంతో నూతన జీవితాన్ని కొనసాగిస్తున్నారు. అలాంటి వారికి అండగా ఉండాలి.

...✍ దప్పు రవి

రణ్‌వీర్.. పెండ్లి తర్వాత!

పెండ్లయిన కొత్తలో భర్తకు కొన్ని షరతులు విధిస్తుంటారు ఆడవాళ్లు. వాటిని కొందరు భర్తలు సంతోషంగా స్వీకరిస్తారు కూడా. మితిమీరిన షరతులతో కొన్ని ఇబ్బందులూ ఎదురవుతుంటాయి. తాజాగా విడుదలైన 'ఎఫ్ 2' సినిమాలో ఈ విషయాన్ని చాలా చక్కగా చూపించారు కూడా. అయితే.. ఇటీవల దీపిక పదుకొణెను పెండ్లి చేసుకున్న రణ్‌వీర్ పరిస్థితి కూడా ఎఫ్2 మాదిరిగానే ఉందట.

'ఒక మనిషి గురించి చెప్పాలంటే.. పెండ్లికి ముందు, పెండ్లి తర్వాత' అంటూ ఎఫ్2 సినిమాలో వెంకీ చెప్పే డైలాగు వినోదభరితంగా ఉంటుంది. పెండ్లికి ముందు తిరిగినట్లుగా.. పెండ్లైన తర్వాత కూడా తిరిగితే భార్యలు ఊరుకుంటారా? అచ్చం అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాడు బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్‌సింగ్. ఎందుకంటే పెండ్లికి ముందు నైట్‌పార్టీలు, ఫ్రెండ్స్‌తో ఎంజాయ్‌మెంట్ అంటూ తిరిగిన రణ్‌వీర్‌కు పెండ్లి తర్వాత దీపికా కొన్ని కొత్త షరతులు విధించిందట. వాటితో తన స్వేచ్ఛా జీవితానికి చరమగీతం పాడుతుందని చమత్కరిస్తున్నాడు రణ్‌వీర్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో రణ్‌వీర్ ఈ విషయాన్ని వెల్లడించాడు. ముఖ్యంగా పెళ్లి తర్వాత రణ్‌వీర్‌కు దీపికా మూడు కండిషన్స్ పెట్టిందట. అందులో మొదటిది ఇంటికి ఆలస్యంగా రాకూడదు. రెండోది ఇంటి నుంచి ఏమీ తినకుండా బయటకు వెళ్లకూడదు. ముచ్చటగా మూడో విషయానికొస్తే.. ఫోన్ చేసినప్పుడు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలి. ఈ మూడూ సమంజసంగానే ఉండడంతో రణ్‌వీర్ ఫ్రస్ట్రేషన్‌తో కాకుండా ఫన్‌తో ఎంజాయ్ చేస్తున్నానని చెబుతున్నాడు. అయితే, మొత్తానికి పెండ్లి తర్వాత దీపికా.. తన మొగుడ్ని కొంగున కట్టేసుకుందని బాలీవుడ్‌లో అందరూ చెవులు కొరుక్కుంటున్నారు.



సుడోకు

డైలీ సుడోకు 41 సమాధానం

5	1	8	9	2	6	3	4	7
7	9	6	3	4	5	8	2	1
2	3	4	7	8	1	6	9	5
6	4	1	2	7	9	5	8	3
8	2	3	1	5	4	7	6	9
9	7	5	6	3	8	2	1	4
3	8	9	5	1	2	4	7	6
4	6	7	8	9	3	1	5	2
1	5	2	4	6	7	9	3	8

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.


సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు - 42

	6			2	5	7	4	
	4			6			1	
5				7	9	2		
8	3			4		1		
			7				2	
			8				6	
	1	9				4		
6	2	7		8				
							9	

ట్వీట్

సల్మాన్ ఖాన్
@BeingSalmanKhan



'జిమ్ రోజూ చేస్తే చేయండి. కానీ శిక్షకుని సహకారంతో చేయండి. ట్రైనర్ లేకుండా జిమ్ చేయకూడదు' అని వీడియో ట్వీట్ చేశాడు.

సల్మాన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 3,56,76,755

కామన్‌మ్యాన్ వాయిస్

పది సంవత్సరాల ఛాలెంజ్ ఎవరు మొదలుపెట్టారో గానీ.. బతికించారు.కుంభమేళా జరుగుతుండగా,ఆ నగ్న అఘోరాల మీద ఆవు వ్యాపాలతో ఊదరగొట్టాల్సిన వాళ్లంతా పురాతత్వ తవ్వకాల్లోంచి తీసిన ఫొటోలు పెట్టుకుంటూ నెట్టుకు రావడం శుభపరిణామం. అయ్యల్లారా అమ్మల్లారా.. మీ పాత ఫొటోలు భరించటమే వీజీ. మీ రొటీన్ ఊకదంపుడు ఆవు వ్యాసాలకంటే..

–విరించి విరివింటి

సర్పంచ్ అంటే పండుగలకు, పబ్బాలకు ఫ్లెక్సీలు వేసి శుభాకాంక్షలు చెప్పడం.. రిపబ్లిక్ డే రోజు జెండా ఎగురవేయడం కాదు. సర్పంచ్ అంటే ఒక ఊరి ప్రజల నమ్మకం.

–Raj Uragonda

వైరల్ వీడియో



వర్షం పడుతున్న బ్యాక్‌గ్రౌండ్.. ఫ్రేమ్‌లో అంతా బ్లాంక్. స్లోగా కెమెరా పాన్ అవుతున్నది. అవుట్‌ఫోకస్‌లో టేబుల్ ఫ్యాన్ రెక్కలు తిరుగుతున్నాయి. మెల్లగా రివీల్ చేస్తే ఓ మనిషి ఫ్రేమ్‌లో కనిపిస్తారు. ఆయనెవరు? ఎలా ఉన్నారో తెలియాలంటే ఈ వీడియో చూడాలి.

NTR Becomes Alive in Lakshmi's NTR | RGV | GV Films | Rakesh Reddy
Total views : 1,234,162+
Published on Jan 18, 2019

III. నమస్తే తెలంగాణ
అల్లరి
[కరీంనగర్]
ఆదివారం 20 జనవరి 2019

చుక్కలు కలుపండి!



జతపరుచండి

1. జపాన్
2. చైనా
3. అమెరికా
4. యూరోపియన్
5. భారతదేశం

A. డాలర్
B. యెన్
C. రూపాయి
D. యువాన్
E. యూరో



దేశాలు వాటి కరెన్సీ గుర్తులను గుర్తించండి



బ్లడ్ రిలేషన్స్




1. మేనత్త అన్న కోడలికి మీ అక్కేమవుతుంది?
2. మామ అక్క కోడలు మీ అన్నకేమవుతుంది?
3. పిన్ని వదిన కొడుకు నీకేమవుతాడు?
4. అక్క కొడుకు, మీ అన్న కూతురికి ఏమవుతాడు?
5. అన్న భార్య మీ నానమ్మకు ఏమవుతుంది?

పజిల్



Y ఆకారం ముక్కుని కనుక్కోండి



సంహిత.. కొత్త చరిత!



పిల్లలూ! 'పిట్టకొంచెం కూత ఘనం' అనే సామెతను మీరు వింటూనే ఉంటారు. ఆ సామెతకు ఈ బుడుగు సరైన నిదర్శనం. ఎందుకంటే పదేండ్లకే పదో తరగతి, 12 యేండ్లకే ఇంటర్..16 యేండ్లకే ఇంజినీరింగ్ పూర్తి చేసింది మరి. అది కూడా అషామాషీగా కాదు.. అన్నీ ఫస్ట్ ర్యాంకులే సాధించింది. ఇంకో విషయం ఏంటంటే.. కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)లో 95.95 శాతం స్కోర్ సాధించి కొత్త చరిత్రను సృష్టించింది.

ఎలాంటి బ్యాక్‌లాగ్స్ లేకుండా ఇంజినీరింగ్ పూర్తి చేయాలంటే నాలుగేండ్లు పడుతుంది. లేకపోతే ఇంకా రెండేండ్లు పడుతుంది. అలాంటిది మన హైదరాబాద్‌కు చెందిన ఈ టీనేజర్ ఫస్ట్‌క్లాస్‌లో ఇంజినీరింగ్ పాసైంది. అది కూడా 16 యేండ్లకే. క్యాట్ ఎంట్రెన్స్‌లో 95.95 శాతం స్కోర్‌తో దేశంలోనే అతి పిన్న వయస్కురాలైన ఇంజినీర్‌గా చరిత్రకెక్కింది. ఈ ర్యాంకుల రాకెట్ పేరు సంహిత. చదువులో ఎప్పుడూ ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకుంటుంది. అలా అని చదువుకే పరిమితం కాదు. సంగీతం, చిత్రలేఖనం ఇతర రంగాలలోనూ ప్రావీణ్యం సాధించింది. పదహారేండ్లకి ఇంజినీరింగ్ పూర్తి చేసిన మొదటి భారతీయురాలిగా గుర్తింపు పొందింది.

టార్గెట్ ఫైనాన్షియల్ అనలిస్ట్!

ఐఐఎంలో ఫైనాన్స్ చేయడం నా మొదటి లక్ష్యం. ఆ తర్వాత అమెరికాలోని సీఎఫ్ఏ ఇనిస్టిట్యూట్ నుంచి ఛార్టెడ్ ఫైనాన్సియల్ అనలిస్ట్ అవ్వడం నా తదుపరి లక్ష్యం. దాని వల్ల దేశ ఆర్థికాభివృద్ధిలో నా వంతు పాత్ర నిర్వహించాలనేది నా జీవిత ఆశయం. నేను అందరితో చాలా సరదాగా ఉంటా. అలాగని నిత్యం చదువులతో బిజీగా ఉండను. సినిమాలు బాగా చూస్తా. మహేశ్‌బాబు అంటే ఇష్టం. ఆయన సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూడాల్సిందే. నా కృషి, పట్టుదల వెనుక తల్లిదండ్రుల పాత్ర మరవలేనిది.

– సంహిత, క్యాట్ టాపర్

బాలమేధావి ప్రయాణం ఇలా..

సంహిత తండ్రి పేరు ఎల్ ఎన్ కాశీభట్ల. తల్లి గీత. వీరిది హైద్రాబాద్. సంహితకి మూడేండ్లు ఉన్నప్పుడు ఒక పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చాడు నాన్న. అందులో 200 దేశాల పేర్లు, వాటి రాజధానులు, దేశాల జెండాలున్నాయి. వాటన్నంటినీ గుర్తుపెట్టుకొని తడబడకుండా చెప్తుండేది. అది చూసిన తల్లిదండ్రులు, బంధువులు ఆశ్చర్యపోయేవారు. తల్లిదండ్రులు ఆలస్యం చెయ్యకుండా ఆమె తెలివికి పదును పెట్టారు. క్రమంగా స్టేజ్ షోలు ఇచ్చే స్థాయికి ఎదిగింది సంహిత. ఐదేండ్ల నుంచే వేదికల మీద



ప్రసంగించడం మొదలు పెట్టింది. అప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇచ్చిన పుస్తకాన్ని చదివి.. సౌర కుటుంబం గురించి 15 పేజీల వ్యాసం రాసింది. దానిని అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు పంపింది. ఆ వ్యాసాన్ని చూసి ఆశ్చర్యపోయిన ఆయన.. తనను కలిసే అవకాశం కల్పించారు. సంహిత ప్రతిభ తెలుసుకున్న మాజీ రాష్ట్రపతి 'యు ఆర్ వెరీ గుడ్ గాళ్' అంటూ ప్రశంసించారు. ఆ మాటలను ఎప్పటికీ మర్చిపోలేనని చెబుతున్నది సంహిత. రెట్టించిన ఉత్సాహంతో తీవ్రవాదం, ఆర్థిక వ్యవస్థపై అనేక వ్యాసాలు రాసి, చిత్రాలు వేసి ప్రముఖుల ప్రశంసలు పొందింది. ఇందుకు పుస్తకాలు, వార్తా పత్రికలు ఎక్కువగా చదివేది.

చిన్న వయసులోనే పెద్ద చదువు..

పదేండ్లకి పదో తరగతి పూర్తి చేసింది. 12 యేండ్లకి ఇంటర్మీడియట్ 89 శాతంతో పూర్తి చేసింది. తర్వాత ప్రభుత్వ అనుమతితో హైదరాబాదులోని సీబీఐటీ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించింది. అప్పుడే దేశంలోనే అతిపిన్న వయసులోనే ఇంజినీరింగ్ పూర్తి చేసిన రికార్డు సొంతం చేసుకున్నది. తాను ఇంజినీరింగ్ చదువుతున్నప్పుడు రెండు జడలు వేసుకొని కాలేజ్‌కు వెళ్లేదట. అక్కడి విద్యార్థులందరూ తనని 'ఎవరి చెల్లివి' అని ప్రశ్నించేవారట. అప్పుడు సంహిత 'నేనూ మీలాగే విద్యార్థిని' అని చెబితే అశ్చర్యపోయేవాళ్లని తన అనుభవాలను(నవ్వుతూ) గుర్తు చేసుకుంటున్నది సంహిత. ఇంజినీరింగ్‌లో ఈవెంట్స్‌కు, పలు ప్రాజెక్ట్‌లకు టీం లీడర్‌గా ఉండేది. అప్పుడే తనకు లీడర్‌షిప్ అలవడింది. అందుకే ఎంబీఏ చేసేందుకు క్యాట్ ఎంట్రెన్స్ రాసి చరిత్రకెక్కింది.

వనజ వనిపెంట

పిల్లల కోసం ఉడ్నే దో!

ఈ మధ్యకాలంలో లైంగిక వేధింపులు బాగా పెరిగిపోయాయి. ముఖ్యంగా విద్యార్థినులపై లైంగిక వేధింపులు అధికం అయ్యాయి. అభం శుభం తెలియని చిన్నారులనూ కామాంధులు వదలడం లేదు. అందుకే.. చిన్నారులపై ఎలా దాడులు జరుగుతాయో తెలిపేందుకు ఓ చక్కని షార్ట్‌ఫిలీం రూపొందించారు.




ముంబైకి చెందిన చలనచిత్ర నిర్మాత ఆర్తీ బాగ్డీ. ఆమె చిన్నారులపై లైంగిక వేధింపులు ఏవిధంగా జరుగుతున్నాయో 'ఉడ్నే దో' అనే షార్ట్ ఫిలీ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించింది. స్కూల్లో పిల్లలు అందరితో సరదాగా ఉంటారు. క్లాస్‌లు వినడం, చదువుకోవడం, ఆడుకోవడమే వీరికి తెలుసు. అక్కడ పనిచేసే యాజమాన్యం గాని, పనివాళ్లు కాని ఎవరైనా మాట్లాడితే చాలా గౌరవంగా సమాధానం చెప్పే తత్వం పిల్లలిది. వంటిమీద చేయివేస్తే ఎందుకు వేసారో పసిగట్టేంత వయసు వారికి లేదు. అయినా ఎదుటి వారి స్పర్శతో ఇబ్బందిగా అనిపిస్తే మాత్రం దూరంగా వెళ్లిపోతారు. మరలా వారిని చూసినప్పుడు భయపడుతుంటారు. చివరికి స్కూల్‌కి వెళ్లడానికే సంకోచిస్తారు. ఇంట్లో అమ్మానాన్నలతో చెబుదామంటే ఏమంటారో అన్న భయం. అయినా చెప్పాలని తల్లిదగ్గరికి వెళ్లితే మాట వినిపించుకోకుండా వెళ్లిపోతుంది. ఎవరితో చెప్పుకోలేక మనసులోనే మదనపడుతుంటుంది ఓ చిన్నారి. తల్లిదండ్రులతో చెప్పుకోలేనివి కూడా స్నేహితులతో చెప్పుకుంటారంటే ఇందుకే మరి. తన బాధని పసిగట్టిన ఫ్రెండ్‌కి మొత్తం వివరిస్తుంది. తనని తాను రక్షించుకోవడానికి పెప్పర్ స్ప్రే, విజిల్‌ని ఇస్తాడు ఆ అబ్బాయి. ఆ కామాంధుడు మళ్లీ వస్తాడు. మాయమాటలు చెప్పి ఆమెపై చెయ్యి వేస్తాడు. తన దగ్గరున్న స్ప్రే కంట్లో కొట్టి, విజిల్ వేస్తుంది. అలా ఆ కామాంధుడి రూపాన్ని బయటపెడతారు ఆ ఇద్దరు పిల్లలు. ఇదే షార్ట్ ఫిలీం సారాంశం. తల్లిదండ్రులు పిల్లలతో ప్రేమగా ఉండాలని చెప్పే మంచి సందేశాన్ని ఇస్తుందీ ఫిలీం. ఇందులో లీడ్ రోల్ చేసింది సీనియర్ నటి రేవతి. ఈ షార్ట్ ఫిలీంకు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుతున్నాయి.

ఒకేలా పలికే పదాన్ని రాయండి


Road, Tail, Hare, Roll, Blue, Two, Wait, Sea, Hole, Cot, Sum, Bean, Peace, Ad

1. Caught - C _ t	8. Role- _ o _ l
2. Some - _ u _	9. Been - B _ a _
3. Piece - P _ _ c _	10. Whole - _ o _ e
4. To - T _ o	11. Weight - W _ _ t
5. Hair - H _ r _	12. Add - _ d
6. See - _ e _	13. Blew - B _ u _
7. Rode - R _ _ d	14. Tale - T _ i _

పది తేడాలు గుర్తించండి



పదాలు కలుపండి!



1. పశువుల పేడ ఎత్తడానికి వాడుతారు?
2. పుస్తకాలు చినిగిపోకుండా చూస్తుంది?
3. దీని తయారీకి వెదురుని వాడుతారు?
4. దీంతో టెంట్ వేసుకోవచ్చు?
5. క్లాత్ తెలుగులో?
6. ఆకుకూరల్ని .. కట్టి అమ్ముతారు?

జవాబులు

జతపరుచండి : 1.B, 2.D, 3.A, 4.E, 5.C
పదాలు కలుపండి : 1. తట్ట 2. అట్ట 3. బుట్ట 4. పట్ట 5. బట్ట 6. కట్ట
బ్లడ్ రిలేషన్స్ : 1. వదిన/మరదలు 2. వదిన/మరదలు 3. బావ/మరిది 4. బావ/మరిది 5. మనవరాలు.
పజిల్ : 22
ఒకేలా పలికే పదాన్ని రాయండి : 1. cot 2. sum 3. peace 4. two 5. hare 6. sea 7. road 8. roll 9. bean 10. hole 11. wait 12. ad 13. blue 14. tail.

నిపుణ — విద్య, ఉద్యోగ సమాచారం —

ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నావిక్ పోస్టులు

భారత రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని ఇండియన్ కోస్ట్‌గార్డ్ 10+2 ఎంట్రీ-02/2019 బ్యాచ్ ద్వారా ఖాళీగా ఉన్న నావిక్ (జనరల్ డ్యూటీ) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



- **పోస్టు పేరు:** నావిక్ (జనరల్ డ్యూటీ)- 10+2 ఎంట్రీ స్కీమ్
- **అర్హతలు:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్ లేదా 10+2 ఉత్తీర్ణత. ఇంటర్‌లోని మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌ల్లో తప్పనిసరిగా కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 నుంచి 22 ఏండ్ల మధ్య ఉండాలి. 1997, ఆగస్టు 1 నుంచి 2001 జూలై 31 మధ్య జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **శారీరక ప్రమాణాలు: ఎత్తు** :157 సెం.మీ ఉండాలి. ఛాతీ – శరీరానికి తగ్గ అనుపాతంలో ఉండాలి. గాలిపీల్చినప్పుడు కనీసం 5 సెం.మీ. వ్యాకోచం తప్పనిసరి.
- **బరువు:** ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, పీఎఫ్‌టీ ద్వారా
- దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులను ప్రతి జోన్ పరిధిలోని సెంటర్ ప్రకారం షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఈ అభ్యర్థులకు రాతపరీక్షను నిర్వహిస్తారు.
- రాతపరీక్షలో క్వాలిఫైయింగ్ మార్కులు ఒక్కొక్క జోన్ సెంటర్‌ను బట్టి ఎక్కువ, తక్కువగా ఉంటాయి.
- **రాతపరీక్ష:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. దీనిలో ఇంటర్ స్థాయిలోని మ్యాథ్స్, ఫిజిక్స్, బేసిక్ కెమిస్ట్రీ, ఇంగ్లిష్ నాలెడ్జ్ , జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.
- రాతపరీక్షలో క్వాలిఫై అయిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ప్రిలిమినరీ మెడికల్ ఎగ్జామినేషన్‌లను నిర్వహిస్తారు.
- ఈ పరీక్షల నిర్వహణకు 2 నుంచి 3 రోజులు పడుతుంది.
- మెరిట్ అభ్యర్థుల వివరాలను జోన్‌పరిధిలోని ఖాళీల సంఖ్య ఆధారంగా 2019 మార్చి- ఏప్రిల్‌లో ఇండియన్ కోస్ట్‌గార్డ్ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.
- **శిక్షణ:** ఐఎన్ఎస్ చిల్కాలో 2019 జూలై- ఆగస్టు మధ్య ప్రారంభమవుతుంది. కేటాయించిన ట్రేడ్‌కు సంబంధించి సముద్రంలో ప్రొఫెషనల్ ట్రెయినింగ్‌ను ఇస్తారు.
- **ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్:** 1.6 కి.మీ. దూరాన్ని 7 నిమిషాల్లో, 10 పుష్ అప్‌లు, 20 ఉతక్ బైటక్‌లు చేయాలి.
- పై అన్ని పరీక్షల్లో క్వాలిఫై అయినవారికి వైద్యపరీక్షలను నిర్వహించి జూన్/జూలైలో ఫలితాలను వెల్లడిస్తారు.
- **జీతభత్యాలు:** నెలకు రూ. 21,700/- వీటికి అదనంగా డీఏ, కిట్ మెయింటెనెన్స్ అలవెన్స్, ఇతర అలవెన్స్‌లు ఉంటాయి.
- నావిక్ నుంచి ప్రధాన అధికారి హోదా వరకు పదోన్నతి పొందవచ్చు.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రాంత అభ్యర్థులు ఈస్ట్‌జోన్ పరిధిలోకి వస్తారు.
- ఈస్ట్‌జోన్ పరిధిలోని పరీక్ష కేంద్రాలు- సికింద్రాబాద్, చెన్నై, విశాఖపట్నంలో ఉన్నాయి
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 31
- **వెబ్‌సైట్:** www.joinindiancoastguard.gov.in

ఆర్జీయూకేటీ బాసరలో ఫ్యాకల్టీలు

బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) కాంట్రాక్టు ప్రాతిపదికన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.



టీచింగ్ (గెస్ట్ ఫ్యాకల్టీ)

- **విభాగాలు:** ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్
- **అర్హత:** ఇంజినీరింగ్ విభాగాలకు బీఈ/బీటెక్‌తో పాటు ఎంఈ/ఎంటెక్, నాన్ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీతోపాటు నెట్/స్లెట్ లేదా పీహెచ్‌డీ ఉండాలి.
- **పేస్కేల్:** గంటకు రూ. 500 చొప్పున చెల్లిస్తారు
- **నాన్ టీచింగ్ (గెస్ట్ ల్యాబొరేటరీ అసిస్టెంట్)**
- **విభాగాలు:** ఇంగ్లిష్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్
- **అర్హత:** ఇంజినీరింగ్ విభాగాలకు బీఈ/బీటెక్ లేదా డిప్లొమా, నాన్ ఇంజినీరింగ్‌కు బ్యాచలర్ డిగ్రీ.
- **పేస్కేల్:** నెలకు రూ.15,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 20
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in

'రామనంద'లో ఉచిత శిక్షణ

భూదాన్ పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ ఉపాధి ఆధారిత కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆసక్తి, అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

Swamy Ramananda Tirtha Rural Institute
Empowering Rural People

- **కోర్సు:** ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ ఎలక్ట్రిక్ సిస్టమ్ ఇన్‌స్టాలర్, సర్వీస్ ప్రొవైడర్
- **అర్హత:** ఐటీఐ/డిప్లొమాలలో ఎలక్ట్రికల్ ట్రేడ్ ఉత్తీర్ణులైన యువకులు మాత్రమే.
- **కోర్సు:** సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, జర్దోజి, ఎంబ్రాయిడరీ వర్క్
- **అర్హత:** 8వ తరగతి ఉత్తీర్ణులైన యువతులు మాత్రమే.
- **వయస్సు:** 18-35 ఏండ్ల మధ్య ఉండాలి.
- **నోట్:** టైలరింగ్ కోర్సు మహిళలకు మినహాయింపు
- **నోట్:** పై రెండుకోర్సుల కాలవ్యవధి ఆరునెలలు.
- శిక్షణ పూర్తిగా ఉచితం. ఈ సమయంలో ఉచితంగా వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారు. శిక్షణానంతరం ఉద్యోగావకాశం కల్పిస్తారు.
- జనవరి 21నాడు ఉదయం 10 గం|| సంబంధిత సర్టిఫికెట్స్‌తో సంస్థ కార్యాలయంలో హాజరుకావాలి.
- వివరాల కోసం 9133908000, 9133908222, 9948466111లో సంప్రదించవచ్చు.
- **వెబ్‌సైట్:** www.srtri.com

జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్లు

న్యూఢిల్లీలోని ఢిల్లీ హైకోర్టు టెక్నికల్ విభాగంలో ఖాళీగా ఉన్న జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది.



- **మొత్తం పోస్టులు:** 60 (జనరల్-32, ఓబీసీ-16, ఎస్సీ-8, ఎస్టీ-4)
- **పోస్టు పేరు:** జూనియర్ జ్యుడీషియల్ అసిస్టెంట్
- **అర్హత:** బీసీఏ/బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (ఆనర్స్), బీఈ/బీటెక్ (కంప్యూటర్ సైన్స్), ఎంసీఏ, ఎమ్మెస్సీ/ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్) లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 18 నుంచి 27 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష , ఇంటర్వ్యూ ద్వారా
- రాతపరీక్ష 75 మార్కులకు ఉంటుంది. దీనిలో జనరల్ ఇంటెలిజెన్స్-10 జనరల్ అవేర్‌నెస్-10, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-10, ఇంగ్లిష్-15, కంప్యూటర్ సైన్స్-30 ప్రశ్నలు ఇస్తారు.
- ఇంటర్వ్యూకు 25 మార్కులు.
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** జనవరి 23
- **వెబ్‌సైట్:** www.delhihighcourt.nic.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
ఆదివారం 20 జనవరి 2019


శిరీష్, వరుణ్‌తేజ్, వెంకటేష్, అనిల్, దిల్‌రాజు, లక్ష్మణ్

నిత్యవిద్యార్థినే!


ఏసుదాసు

ఐదు దశాబ్దాలకు పైగా తన విలక్షణ గాత్ర సౌందర్యంతో భారతీయ సంగీత ప్రియుల్ని మంత్రముగ్ధుల్ని చేస్తున్నారు దిగ్గజ నేపథ్య గాయకుడు కె.జె.ఏసుదాసు. అసమాన గాన మాధుర్యంతో ఆయన తెలుగునాట అశేష అభిమానుల్ని సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన సంగీత విభావరిని నిర్వహించబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో కె.జె.ఏసుదాసు పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'పది సంవత్సరాల తర్వాత హైదరాబాద్‌లో లైవ్ మ్యూజిక్ చేయడం చాలా ఆనందంగా ఉంది. నేను త్రివేంద్రంలో విద్వాన్ కోర్స్ చేశాను. అప్పటి ఆర్థిక పరిస్థితుల కారణంగా దానిని మధ్యలో వదిలేశాను. అందుకే నేను సంగీతంలో విద్వాన్‌ని కాదు. నిత్యవిద్యార్థినే. ఇప్పటికీ కర్ణాటక సంగీతాన్ని నేర్చుకుంటున్నాను. గతంలో చేసిన పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటున్నాను. హైదరాబాద్ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌లో ఎక్కువగా తెలుగు పాటల్నే ఆలపించబోతున్నాను. హిందీ, మలయాళీ పాటలు కూడా ఉంటాయి' అని చెప్పారు. ఔత్సాహిక గాయనీగాయకుల గురించి చెబుతూ 'ప్రస్తుతం సాంకేతికత ఎంతగానో అభివృద్ధి చెందింది. ఆ రోజుల్లో నేను, సుశీల ఒకే మైక్‌ను మార్చుకుంటూ పాటలు పాడేవాళ్లం. ఇప్పుడు ప్రతి ట్రాక్‌ను సపరేట్‌గా పాడిస్తున్నారు. వర్ధమాన గాయనీగాయకులు గురువుల్ని స్ఫూర్తిగా తీసుకోవాలి. వారి రంగంలో సుప్రసిద్ధులైన వారిని కలిసి సలహాలు తీసుకుంటే త్వరగా వృద్ధిలోకి వస్తారు. అన్నింటికంటే ముఖ్యంగా క్రమశిక్షణ, ఏకాగ్రత కలిగి వుంటే మంచి విజయాలు సాధిస్తారు' అన్నారు.

ప్రేక్షకులు నవ్వుతూ కనిపించారు!

వెంకటేష్, వరుణ్‌తేజ్ కలిసి నటించిన చిత్రం 'ఎఫ్-2'. అనిల్ రావిపూడి దర్శకుడు. తమన్నా, మెహరీన్ కథానాయికలుగా నటించారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్, లక్ష్మణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా చిత్ర బృందం శుక్రవారం రాత్రి విజయోత్సవాన్ని నిర్వహించింది. హీరో వెంకటేష్ మాట్లాడుతూ 'పదేళ్ల తరువాత థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకుల స్పందన చూశా. అందరూ నవ్వుతున్నారు కానీ నాకు కళ్లలో నీళ్లొచ్చాయి. కష్టపడి ఒక సినిమా చేశాక దాన్ని ప్రేక్షకులు చూస్తున్నప్పుడు గొప్ప అనుభూతి కలుగుతుంది. నేను నటించిన చిత్రాలు ఎన్నో సంక్రాంతికి విడుదలై మంచి విజయాల్ని సాధించాయి. మళ్లీ ఇన్ని రోజుల తరువాత ఇలాంటి వినోదాత్మక చిత్రం చేయడం ఆనందంగా వుంది. ప్రేక్షకులు మళ్లీ మమ్మల్ని ఇలాంటి వినోదాత్మక చిత్రంలో చూడాలనుకుంటున్నారని దర్శకుడు కథ చెప్పాడు. అంతే ఉత్సాహంగా సినిమా చేశాడు. వరుణ్, తమన్నా, మెహరీన్ బాగా నటించారు' అన్నారు. వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'నేను ఇంకా కొత్తవాణ్ని. ఎలాంటి సినిమాలు చేయాలా అని నా దారిని వెతుక్కుంటున్నా. నాకు కామెడీ అంటే చిరంజీవి, వెంకటేష్ సినిమాలే గుర్తొస్తాయి. వాళ్లని చూసి కొంచమైనా చేయగలుగుతామా అనుకునే వాణ్ని. అనిల్ రావిపూడి సెట్‌లో సన్నివేశాలు చెప్పి వెళ్లిపోయినప్పుడు వెంకటేష్ గారు నా పక్కన ఓ సోదరుడిలా నిలిచి సహకారం అందించారు. త్వరలో ఇద్దరం కలిసి 'ఎఫ్-3' చేయబోతున్నాం' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా నాకు ప్రత్యేకం. సాంకేతికబృందం, నటీనటులు ప్రాణం పెట్టి పనిచేశారు. వెంకటేష్‌తో కలిసి వరుణ్‌తేజ్ మంచి టైమింగ్‌తో నటించారు. వెంకటేష్ పలికిన ప్రతి సంభాషణకు ప్రేక్షకులు నవ్వుతూ కనిపించారు. విదేశాల్లోనూ ఈ సినిమా మిలియన్ డాలర్ల మార్కును దాటేసింది' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'మా సినిమా పేరు 'ఎఫ్-2'అని ఖరారయ్యాక వీ2 అంటూ వెంకటేష్, వరుణ్‌తేజ్ వచ్చి చేశారు. సినిమా విడుదలయ్యాక ఎంటర్‌టైన్‌మెంట్ రెండింతలైందని'ఈ2' అంటూ అంతా సందేశాలిచ్చారు' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహరీన్, శిరీష్, లక్ష్మణ్, దేవిశ్రీప్రసాద్, అనసూయ, అన్నపూర్ణమ్మ, కాసర్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

యస్వీ రంగారావు స్ఫూర్తితో..

'ఐదారేళ్ల క్రితం మంచి హిట్ సినిమా కోసం తపించాను. 'దృశ్యం' చిత్రం నుంచి విజయాలు ఊపందుకున్నాయి. 2018 నా కెరీర్‌లో ఉత్తమమైన సంవత్సరంగా భావిస్తున్నాను' అన్నారు సీనియర్ నటుడు నరేష్. ఒకప్పుడు కథానాయకుడిగా తనదైన శైలి వినోదంతో ప్రేక్షకుల్ని అలరించిన ఆయన ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా సత్తా చాటుతున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. నేడు నరేష్ జన్మదినం. ఈ సందర్భంగా శనివారం ఆయన పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..


నరేష్

గత ఏడాది తెలుగు పరిశ్రమ మంచి విజయాల్ని సాధించింది. అందులో నేను నటించిన ఎనిమిది సినిమాలు భారీ సక్సెస్‌ను సొంతం చేసుకోవడం ఆనందంగా ఉంది. యస్వీ రంగారావు గారిని స్ఫూర్తిగా తీసుకొని పాత్రల్ని ఎంపిక చేసుకుంటున్నాను. ఏదో ఒక మూసకు పరిమితమైపోకుండా పాత్రలపరంగా వైవిధ్యాన్ని చూపించాలని ప్రయత్నిస్తున్నాను. గత ఏడాది 'రంగస్థలం' 'మహానటి' 'ఛలో' 'తొలి ప్రేమ' 'సమ్మోహనం' 'అరవింద సమేత వీరరాఘువ' చిత్రాలు మంచి సంతృప్తినిచ్చాయి. 'మిమ్మల్ని దృష్టిలో పెట్టుకొని కథల్ని రాసుకుంటున్నాం' అని రచయితలు చెబుతున్నారు. ఆ మాటలకు మించిన అవార్డు లేదనుకుంటున్నాను.

చిన్న చిత్రాలకు ప్రాధాన్యత

నేను పారితోషికం గురించి ఆలోచించడం లేదు. కథ నచ్చితే చిన్న బడ్జెట్ సినిమాలకు అందుబాటులో ఉండాలని నిర్ణయించుకున్నాను. త్వరలో ఓ వెబ్‌సిరీస్‌లో కూడా నటించబోతున్నాను. 'మా'లో (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) నేను ఎప్పుడూ పదవుల్ని ఆశించలేదు. నా కుటుంబం ద్వారా 'మా'కు ఇప్పటివరకు 30లక్షల వరకు విరాళాన్ని అందించాను. జాయింట్ సెక్రటరీగా బాధ్యతల్ని నిర్వర్తిస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు జరిగేలా చూస్తున్నాను. ఈ దఫా 'మా'లో కొన్ని వివాదాలు చోటుసుకున్న మాట వాస్తవమే. అందరూ కోరితే 'మా'లో ధర్మాన్ని కాపాడటానికి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

96 రీమేక్‌లో?


సమంత
శర్వానంద్

ప్రేమ జ్ఞాపకాలకు అందమైన దృశ్యరూపంలా, ఒక నాస్టాల్జిక్ జర్నీలా సాగిన తమిళ చిత్రం '96' గత ఏడాది ప్రేక్షకుల హృదయాల్ని గెలుచుకుంది. విజయ్ సేతుపతి, త్రిష జంటగా నటించిన ఈ చిత్రం వాణిజ్యపరంగా కూడా మంచి విజయాన్ని సాధించింది. ప్రస్తుతం ఈ సినిమాను తెలుగులో రీమేక్ చేయబోతున్నారు. దిల్ రాజు తెలుగు హక్కుల్ని సొంతం చేసుకున్నారు. తెలుగు వెర్షన్‌లో నాయకానాయికలుగా ఎవరు నటిస్తారనే విషయం ఆసక్తికరంగా మారింది. తాజా సమాచారం ప్రకారం శర్వానంద్, సమంత నాయకానాయికలుగా నటించబోతున్నారని తెలిసింది. తమిళ మాతృకకు దర్శకత్వం వహించిన సి.ప్రేమ్‌కుమార్ తెలుగు వెర్షన్‌కు నిర్దేశక బాధ్యతల్ని నిర్వర్తించబోతున్నారు. ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్ మీదకు వెళ్తుందని చెబుతున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని అంటున్నారు. ప్రస్తుతం సమంత..భర్త నాగచైతన్య సరసన 'మజిలీ' చిత్రంలో నటిస్తున్నది. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటున్నది. దీనితో పాటు కొరియన్ చిత్రం 'మిస్‌గ్రానీ' ఆధారంగా నందినిరెడ్డి దర్శకత్వంలో రూపొందిస్తున్న సినిమాలో సమంత నాయికగా నటిస్తున్నది.

తనీష్ 'సరిహద్దు' కథ!


తనీష్

తనీష్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రానికి 'సరిహద్దు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'రంగు' ఫేమ్ కార్తికేయ దర్శకుడు. వినూత్నమైన కథతో తెరకెక్కనున్న ఈ చిత్రం మార్చి 16న ప్రారంభంకానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'భాషను నేర్చుకుని జ్ఞానాన్ని సంపాదించాలనుకుని..ప్రతి భాషకు ఒక తెగ అని, కొన్ని తెగలకు ఒక కులం అని కొన్ని కులాలు కలిసి ఒక మతం అని విడిపోతూ మృగాల నుంచి మనుషులుగా..మనుషుల నుంచి తెగలుగా..మతాల నుండి రాష్ట్రాలుగా..రాష్ట్రాల నుంచి దేశాలుగా.. సరిహద్దుల్ని గీసుకుంటూ బతుకుతున్నాం. ఈ కాన్సెప్ట్‌తో 'సరిహద్దు' చిత్రాన్ని రూపొందిస్తున్నాం. తెలుగుతో పాటు హిందీలోనూ ఈ చిత్రాన్ని నిర్మించనున్నాం. తెలుగు, హిందీ నటులు నటిస్తారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలతో పాటు మరిన్ని వివరాల్ని ఈ నెలాఖరున తెలియజేస్తాం' అన్నారు.